గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూన్ 2013

# కథలు




ఊపిరి ఆడటంలేదు.

గాలి కోసం ఊపిరితిత్తులు ఎగిరెగిరి పడుతున్నాయి.

కిటికీ తలుపు తీసాను ...

గాలి తెమ్మెర అలలా వచ్చినట్టు .... అర క్షణమే .. ఆ అనుభూతి ...

మరుక్షణం గాలికి శిక్ష వేసినట్టు ...

భరించలేని దుర్గంధం ...

ఆ కారణం వల్లే ఫ్యాన్ వేసుకున్నా, ఇబ్బంది పడుతున్నా కిటికీలు తీయం !

ఎవరో పరిశ్రమ వాడు గుట్టు చప్పుడు కాకుండా అర్ధరాత్రి విష వాయువులు వదిలేస్తున్నాడు .

ఎవరికి ఫిర్యాదు చెయ్యాలి ?...

ప్రకృతి పట్ల మర్యాద లేకపోయినప్పుడు ఎవరికి ఫిర్యాదు చేసి ఏమి లాభం ?

ఇల్లు విడిచి బయటకి నడిచాను..

పొగ వదుల్తూ వేగంగా కార్లు వెళ్తున్నాయి - పెట్రోల్ , డీజిల్ వాసన విరజిమ్ముతూ ...

గాలి ..... గాలి కోసం గాలింపు ...

హాలాహలం మింగేసినట్టుంది గాలి ...

పరిశ్రమ వాసనలు ...

నాలుగు రోజుల క్రితం - కడుపు నొప్పి వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్ళాను. పరీక్ష చేసి ఫుడ్ పాయిజన్ అన్నాడు.

ఐదు నక్షత్రాల హోటల్లో భోజనం చేస్తే - ఫుడ్ పాయిజనా ?

'ఇందు గలడందు లేడని సందేహం వలదు' కాంతి వెళ్ళని చోటుకి సైతం కాలుష్యం వెళ్ళిపోయింది. అని దగ్గాడు. డాక్టర్ గారికి గిరాకీ కోసం సెంటర్లో పెడితే దుమ్ము, ధూళి వల్ల దగ్గు చుట్టుకుంది.

'కానీ .... ' ఏదో చెప్పబోతుంటే -

'నీళ్ళు తాగారా ? ' డాక్టర్ అడిగాడు అదో తప్పయినట్టు ...

'మినరల్ వాటర్ ... '

అనుభవజ్ఞుడైన రోగిలా నవ్వాడు డాక్టర్ .

మినరల్ వాటర్ ఇంకోటని లేదు ...      నీళ్ళు తాగితే క్రిములను పంపినట్లే ...      గట్టిగా నవ్వి, నవ్వు లోంచి దగ్గులోకి జారుకుని విమర్శించిన నీళ్ళనే తాగాడు.

వెంటనే, ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో ఓ పెద్దాయిన ఇంట్లో మినరల్ వాటర్ తాగి అనారోగ్యం పాలైన సంగతి గుర్తొచ్చింది.

'ప్రాణాయామం ... ' నేను అడిగే లోపే -

సిటీ లో వున్న వాయువుని పీలిస్తే ప్రాణాయామం కాదు ... ప్రాణాపాయం అవుతుంది. అని చర్మ రోగానికి మందు రాసుకుంటూ - మేము మీలాంటి వాళ్ళమే ... అని సర్దిచెప్పి - మందులు రాసి - 'హాయిగా పడుకోండి' అన్నాడు.

ఇదిగో ... నిద్ర పట్టక ఇలా రోడ్డున పడ్డాను !!

మర్నాడు ...

నిరంతర వార్తా వాహినిలా ప్రవహిస్తున్న ముక్కుని తుడుచుకుంటున్న డాక్టర్ దగ్గరికి వెళ్లి -

మందులు పనిచెయ్యలేదు .... నిద్ర రాలేదు ....

మందులు కూడా కాలుష్యం బారిన పడి కల్తీ అయ్యాయేమో.... హచ్చ్ మంటూ పెద్దగా తుమ్మేస్తూ అనేసాడు.

'మరెలా?'

'మీదేవూరు ....?'

మా పల్లె పేరు చెప్పాను.

'వెరీ గుడ్ ... ' అని ప్రిస్క్రిప్షన్ ప్యాడ్ అందుకుని - 'పల్లెకు వెళ్లి ... స్వచ్ఛమైన గాలి పీల్చి, నీటిని తాగి ఆరోగ్య వంతులు కండి... ' అని రాసి 'ఇంతకుముందు ఎలా వున్నా ... ఇప్పుడు సగం రోగాలకి కారణం కాలుష్యమే ... ' ఖండితంగా చెప్పేసాడు ప్రిస్క్రిప్షన్ అందిస్తూ !! నాకు ఆనందం, ఆశ్చర్యం కలిగాయి !

ఎప్పట్నుంచో మావూరు తీసుకెళ్ళమని పిల్లలు అడుగుతున్నారు.

ఎప్పుడూ ఏదో హడావుడి.

ఈసారి డాక్టర్ సలహా మేరకు వెళ్ళాల్సి వస్తోంది కనుక సకుటుంబంగా బయలుదేరాము.

మా పల్లె-

అందమైనది. పచ్చదనం..పెద్ద చెరువు, పూలచెట్లు, మా ముత్తాత ఆ వూరు రావడానికి కారణం.

ఇప్పటికీ మావాళ్ళు ఆ విషయం గొప్పగా చెప్పుకుంటారు.

"సాంబయ్య తాత ఇక్కడికి వచ్చినప్పుడు ఇదంతా బీడునేల...వ్యవసాయం చేయడానికి వచ్చారు. అన్నీ రాళ్ళు,రప్పలు...అంతా బీడు. చాలారోజులు చాలా రకాలుగా ప్రయత్నాలు చేశారు. చివరకి విరక్తి కలిగి విసిగి అక్కడినించి వెళ్ళిపోదామనుకున్నారు. కానీ ఏదో చిన్న ఆశ. నీరు పడితే, నీటి ప్రయత్నాలు ఫలించలేదు  రామకృష్ణ పరమహంస గారు చెప్పినట్టు "మనసారా ఏడిస్తే దేవుడే కనబడతాడు."అని ఓ పెద్దాయన సాంబయ్య తాతకి చెప్తే ఆయన ఆ నేల మీదకి ఒదిగిపోయి ఏం చేయలేని స్థితిలో కన్నీళ్ళు కార్చాడట. అలా ఎన్ని పగళ్ళు,ఎన్ని రాత్రుల్లో గడిచాక అక్కడ ఓ మొక్క చాలా చిన్నది మూడు ఆకులతో సన్నగా తీగలా భూమిలోంచి పైకి వచ్చిందట. అంటే, ఆ చిన్ని మొక్క యిచ్చిన మొక్కవోని ధైర్యం అక్కడ వూరు రావడానికి కారణం అయినాది. ఒక యిల్లు..రెండు యిళ్ళు..అలా...అలా పంటలు..పక్షులు...పచ్చదనం...సాంబయ్య గట్టు  యిప్పటికీ వుంది మా వూరు చెరువు గట్టున..."ఉత్సాహంగా చెప్తుంటే మా ఆవిడ  , పిల్లలు వుత్సాహంగా విన్నారు. ఆ మర్నాడే మా ప్రయాణం.

"చెరువు దగ్గరికి వెళ్దాం" వూళ్ళోకి దిగిన వెంటనే మా కార్తీక్ అడిగాడు.

"...వెళ్ళాల్సిందే...." అమ్మాయి కౌశిక హుకుం జారీ చేసింది.

యిద్దరికీ దారిలో చిన్నప్పుడు చెరువులో ఈదులాడిన విషయం చెప్పాను. ఆ రోజుల్లో, చెరువులో ఈదులాటల్లో తేలిపోయేవాళ్ళం.

"స్నానం చేశాక చెరువుకి వెళ్దాం..." మా బాబాయ్ కొడుకు సూరిబాబు అన్నాడు.

"చెరువులోనే స్నానం.." ఇద్దరు పిల్లలు ఒకేసారి అన్నారు.

"...వద్దురా..." బ్రతిమాలుతున్నట్టు అన్నాడు సూరిబాబు.

ససేమిరా అన్నారు పిల్లలు.

తప్పక కదిలాము.

చెరువు అంత దూరం లో ఉండగానే ముక్కుపుటాలు బద్దలయ్యే పరిస్థితి. అపరిశుభ్రంగా వుందక్కడ.

పిల్లలు నిరాశగా చూశారు. స్నానానికి బయలుదేరినవాళ్ళు భయపడ్తూ ఆగిపోయారు.

"సాంబయ్య గట్టు అదిగో..."ఉద్వేగం ఆపుకోలేక వాళ్ళ దృష్టి మరల్చే ప్రయత్నంలో అరిచాను.

సాంబయ్య గట్టు పగిలి శిథిలావస్థలో ఉంది. చుట్టు ఎండుటాకులు..పిచ్చిమొక్కలు.

గట్టుని చూసినా పిల్లల్లో ఉత్సాహం కలగలేదు. కానీ తప్పక కాసేపు అక్కడ వున్నారు.

సాయంత్రం ఆరు గంటలప్పుడు మావాడు అడిగాడు.

"పోనీ పక్షులనేనా చూద్దామా?"అని.

మావూరు దగ్గరున్న కొల్లేరుకి పక్షులు వలసకి రావడం వాటితో మేం గడిపిన విషయం గొప్పగా చెప్పాను. అది గుర్తుకు వచ్చి అడిగారు.

నేను మాట్లాడే లోపు సూరిబాబు యింటి లోపలికి వెళ్ళి "సలీం ఆలీ" పుస్తకం తీసుకొచ్చి

"ఇందులో బోలెడు పక్షులు వున్నాయి..." అన్నాడు..

"ఇందులోనా" పుస్తకం అనాసక్తిగా తీసుకున్నారు.

"వాతావరణం లో మార్పుల వల్ల, ఆఫ్ఘనిస్తాన్ లో యుద్ధం వల్ల వలస పక్షులు రావడం లేదు."

"వాతావరణం లో మార్పా?..అయినా ఆఫ్ఘనిస్తాన్ లో యుద్ధం జరుగుతుంటే, పక్షుల్ని చంపేస్తున్నారా?"

"ఆ...సైనికులు చక్కగా లాగించేస్తున్నారు."

కర్ణుడి చావుకి కారణాలు సవాలక్ష వున్నట్టు..పక్షులు అంతరించి పోవడానికి చాలా కారణాలు వున్నాయిలే..."

ఆ సాయంత్రం పక్షుల పుస్తకం తోనే పిల్లలు గడిపారు.!!

పిల్లలకి చక్కటి నీళ్ళున్న చెరువుని-

కువకువలు వినిపించే పక్షులని-

కాలుష్య ఛాయలు కనిపించని వూళ్ళని చూపెట్టలేక పోయాను.

ఈ వూరిలా మారిపోయింది-

ఉదయం అయితే చాలా వాహనాల మోతతో మారుమోగిపోతోంది.-

చెరువు దగ్గరికెళ్తేనే జబ్బులు వచ్చే పరిస్థితి. -

పక్షుల జాడే లేదు.-!

పల్లె, పట్నం తేడా లేకుండా నరకప్రాయమైపోయాయి.

***************

నిద్రపట్టక లేచాను.

యధాలాపంగా పక్కనే పడుకున్న పిల్లల కోసం చూశాను.

యిద్దరూ కనిపించలేదు.

ఈ వూళ్ళో ఎక్కడికి వెళ్ళివుంటారు?

సూరిబాబు,నేను టార్చిలైటు వేసుకుని పిల్లల్ని వెతుక్కుంతూ వెళ్ళాము.

ఆ వీధిలో కనిపించలేదు.

పక్క వీధికి వెళ్ళాము.

అక్కడా లేరు.

చెరువుగట్టుకి చేరాము. ఊహూ...

ఎక్కడికి వెళ్ళినట్టు?

కాసేపు అక్కడే ఆగాము.

మెల్లగా ఆ నిశిలో ఎవరో ఏడుస్తున్న శబ్దం...

అటుగా చూశాము. కాస్త దూరంగా సాంబయ్య గట్టు దగ్గర మా యిద్దరు పిల్లలు వినయంగా నిలబడి, కనిపించని దేవుళ్ళకి దండం పెడ్తూ "మనసారా"ఏడుస్తున్నారు.మురికి కాలువగా మారిన చెరువు కోసం, ఋతువులని గుర్తు చేస్తూ వచ్చే వలస పక్షుల కోసం.....




" మ నిషి కనబడుట లేదు.మారుతున్న కాలంతో సమానంగా పరిగెడుతూ సరికొత్త విజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు సముపార్జించుకునే మనిషి...తెలివిగా యావత్ ప్రపంచాన్నే తన గుప్పిట్లో పెట్టుకుని నిరంకుశంగా శాసించే మనిషి....శక్తిపరుడు, యుక్తిపరుడైన మనిషి కనబడుటలేదు. చేజిక్కించుకున్న మహిమల్తో విర్రవీగి నెత్తిన చేయి పెట్టుకుని, తనని తానే దహింపజేసుకున్న భస్మాసురుడిలా..తరతరాలు, యుగయుగాలుగా ఎంతో శ్రద్ధాసక్తులతో సంపాదించుకున్న సర్వశక్తుల అగ్నికీలల్లో పడి మాడి మసైపోయాడు. అసలు మనిషంటే ఎవరు? భూగోళం పై నెలకొన్న కోటానుకోట్ల జీవరాశులన్నింటిలోనూ ఎంతో మేధో సంపత్తి కలిగినవాడు. సృష్టికి ప్రతిసృష్టి చేసే సత్తా ఉన్న విశ్వామిత్రుడు, దివిజగంగను భువికి తీసుకు రాగల సామర్థ్యం కల భగీరధుడు, ఆకాశ తీరాల్లో సుస్థిర తారగా మారే నిపుణత ఉన్న ధృవుడు. అందని జాబిలిపై అడుగుజాడల ప్రగాఢ ముద్రల్ని అద్దిన నీల్ అర్మ్ స్ట్రాంగ్. అలవోకగా అంతరిక్షాన్ని ఈదేసిన సునీతా విలియమ్స్. అలా మనిషి అవధుల్లేని విజ్ఞాన ఖని. అంతులేని సృజనశీలి. ...అటువంటి మనిషే కనబడుట లేదు. ప్లీజ్...! మనిషి ఆచూకీ తెలిస్తే వెంటనే చెప్పండి.."

ఆకాశం కాన్వాస్ పై మెరిసే నక్షత్రాల అక్షరాల్తో ఓ ప్రకటన కనిపించింది. ఆశ్చర్యపోవడం సుప్రజ వంతయింది. ఇంతలో...ఎవరో గొంతు చించుకుని అరుస్తున్నారు. "ఓ మనిషీ...ఒక్కసారి కనిపించు"అని. మొదట అతి చిన్నగా వినిపించిన ఆ స్వరం

అంతకంతకూ పెద్దదై రాన్రానూ భూనంభోతరాలు దద్దరిల్లే ధ్వనితో కొండ కోనల్లో ప్రతిధ్వనిస్తోంది.

ఆ అరుపులకి, ఆ పిలుపులకి ఒక్కసారిగా హడలిపోయి దిగ్గున లేచి కూర్చుంది సుప్రజ. గుండెలదిరిపోతుండగా చుట్టూ చూసింది. కన్ను పొడుచుకున్నా కానరాని చికటి. కనురెప్పల్ని దట్టంగా కమ్మేస్తున్న చిక్కటి నల్లటి వలయాలు. అంతకు ముందుదాకా ఆకాశం లో కనిపించిన ఆ అక్షరాల నక్షత్రాలు అంతలోనే అంతర్థానమయ్యాయి.

ఓ పక్క శరీరాన్ని సన్న సన్నగా కోసేస్తున్న శీతలస్పర్శ.మరోపక్క నీరసం, నిస్సత్తువ, చేతులు గాల్లో తేలుతున్నట్టు... కాళ్ళు నేల మీద నిలవనట్లు..ఊపిరి ఆగిపోతున్నట్లు ఆమెకి ఏదోలా ఉంది. చండప్రచండంగా తాకుతున్న చలితో , నిలువెల్లా భయం తో ఆమె వణికిపోతోంది. అంతెత్తున విరుచుకు పడ్తున్న రాక్షస కెరటాల్తో చీకటి సముద్రం లో దారీతెన్నూ తెలీని అస్తవ్యస్త పరిస్తితుల్లో ఆమె కొట్టుమిట్టాడుతోంది. తనని కాపాడే ఆపన్న హస్తం కోసం ఆర్తిగా ఎదురుచూస్తూ మళ్ళీ ఆమె అరిచింది. "హలో నేనెక్కడున్నాను...ఈ భూమ్మీదేనా?"

ఆమె పిలుపుకి సమాధానమా అన్నట్టు అంతలో మళ్ళీ అదే అరుపు "ఓమనిషీ...ఎక్కడున్నావ్? అది అరుపు కాదు. తప్పిపోయిన ఆత్మీయుల కోసం సాగుతున్న అంతులేని అన్వేషణ. భూగోళమంత ఆందోళన. ఆకాశమంత ఆవేదన.

"హలో...మీరెవరు? ఎక్కడున్నారు? మీకు నా మాటలు వినిపిస్తున్నాయా? అసలు నేనెక్కడున్నానో చెప్పండి ప్లీజ్. ఇక్కడి పరిసరాలు చూస్తుంటే నేనెక్కడున్నానో అర్థం కావడం లేదు. ఇక్కడ నాకేం కనిపించడం లేదు. అయోమయంగా, భయం భయంగా ఉంది. ఒకవేళ నా గొంతు మీకు వినిపిస్తే వెంటనే వచ్చి ఆదుకోండి "దీనంగా అర్థిస్తోంది సుప్రజ.

"నేను తప్పిపోయాను ప్లీజ్..నన్ను కాపాడండి "గుక్కపెట్టి ఏడుస్తోంది సుప్రజ.

"సుప్రజా...సుప్రజా...!ఓసారి కళ్ళు తెరువ్..."పిలుస్తూ ఎవరో గట్టిగా చరిచారు. తన శరీరాన్ని బలంగా తాకిన చేయిని వెంటనే పట్టుకుని "ప్లీజ్...నన్ను విడిచి పోకండి"అంటోంది సుప్రజ నిద్రమత్తులోంచి బయటకు రాకుండానే.

"ఒసేయ్,! నువ్వింట్లో...నీరూం లో.. నీ బెడ్ పైనే ఉన్నావ్. ఒక్కసారి కళ్ళు తెరిచి చూస్తే ఆ సంగతి నీకే అర్థమవుతుంది."అన్న మాటలతో ఉలిక్కిపడి ఒక్కసారిగా కళ్ళు తెరిచింది సుప్రజ. అవును నిజం... తను తన గదిలో, బెడ్ మీదే ఉంది.ఆనందంతో సుప్రజ గెంతులేసింది.

"అర్ధరాత్రివేళ ఈ అంకమ్మ శివాలేంటే ?ఎదురుగా నిల్చున్న తల్లి నర్మద అడుగుతోంది.

"అమ్మో...ఎంత భయంకరమైన కలొచ్చిందో? నేను మనిషినట...ఎక్కడో తప్పిపోయానట. నా గురించి ఎవరో వెతుకుతూ అరుస్తున్నారు...."ఓ మనిషీ కనిపించమంటూ అడుగుతున్నారు. మమ్మీ నువ్వే చెప్పు...చిన్నప్పుడు నేనెపుడైనా తప్పిపోయానా ?"

"ఆ డౌట్ నీకెందుకొచ్చింది?" అడిగింది నర్మద తను తెచ్చిన మంచినీళ గ్లాసు సుప్రజ చేతికిస్తూ. ఆ గ్లాసందుకుని తొందర తొందరగా రెండు గుటకలేసి కాస్త తెరిపిన పడిన తర్వాత అంది సుప్రజ -"ఎప్పుడో జరిగిన సంఘటనలే ఇపుడు మళ్ళీ జరుగుతున్నట్టు కలలొస్తుంటాయి కదా, అందుకని అడిగా చెప్పు...చిన్నప్పుడు ఏ తిరుపతిలోనో, మరే తిరునాళ్ళలోనో తప్పిపోయిన జ్ఞాపకం నీకుందా?

"అదేదో జరిగినా బాగుణ్ణు. ఇప్పుడీ తిప్పలు తప్పేవి. " అంది నర్మద.

"అంటే?"

అంటే, అపుడెపుడో తప్పిపోయి తిరిగి దొరక్కుండా ఉంటే ...ఇప్పుడిలా అర్ధరాత్రి జాతర మాకుండేది కాదుకదా.! నువ్వు హఠాత్తుగా గావుకేక పెట్టడం..ఏ పాము కుట్టిందోననే ఆందోళనతో మాంచి నిద్రలోంచి మేం లేచి రావడం...ఇంత ప్రహసనం ఉండేదా?"అంది నర్మద చిరాకుపడుతూ.

గలగలా నవ్వేసింది సుప్రజ.

"ఏంటా నవ్వులు?"

భయపెట్టినా..మంచి థ్రిల్ కలిగించిన కలని తల్చుకుంటుంటే భలే తమషాగా ఉంది. సిటీలో జీవవైవిధ్య సదస్సు జరుగుతోంది కదా! ఆ సందర్భాన్ని పురస్కరించుకొని మా కాలేజీలో "జీవ వైవిధ్యం-మనిషి పాత్ర" అనే అంశం పై వ్యాసరచన పోటీ అనౌన్స్ చేసారు. అందులో పార్టిసిపేట్ చేద్దామని సిన్సియర్ గా ఎఫర్ట్ చేసి లైబ్రరీలో కూచుని ఎక్కడలేని పుస్తకాలు తిరగేసేసరికి ఇదిగో...ఇలా బెదరగొట్టే కల..."మళ్ళీ గలగలా నవ్వింది సుప్రజ.

"గుడ్ సుప్రజా! జీవ వైవిధ్యం మీద వ్యాసం రాయమంటే ఏకంగా థీసీసే సబ్మిట్ చేసావ్."తెలుగు లెక్చరర్ ఆనందరావు మెచ్చుకోలుగా అన్నాడు. లెక్చరర్ అలా ప్రశంసించేసరికి ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోయింది సుప్రజ.

ఇంతలో "థీసీస్ అంటే తేసేసి రాయడమే కద్సార్" లాస్ట్ బెంచ్ లోంచి ఓ సెటైర్ వినిపించింది.

"వాడే ....వేస్ట్ ఫెలో" ఆ గొంతు గుర్తు పట్టింది సుప్రజ.

"ఎవరు...ఎవరా కూత కూసింది?"అడిగాడు ఆనందరావు. సుప్రజ లేచి వాడిపేరు చెప్పేందుకు సమాయుత్తమౌతుండగా పక్కనే ఉన్న కల్పన ఆమెని వారించింది.

"దారిన పోయె గొడవనెందుకు నెత్తికెత్తుకోవడం?"సుప్రజకి మాత్రమే వినిపించేంత నెమ్మదిగా అంది కల్పన. దాంతో ఆమె ఏమీ మాట్లాడకుండా జరుగుతున్న సన్నివేశాన్ని మౌనంగా వీక్షిస్తోంది.

"ఇక్కడే...ఇప్పుడే... ఈక్షణమే నాకు తెలియాలి.డిగ్రీ ఫస్టియర్లోనే థీసిస్ నిర్వచనం తెలిసిన మహానుభావుడెవడని నేను చూడాలి."

అంటున్నాడు ఆనందరావు. ఎవరూ ఏం మాట్లాడడం లేదు. చిన్న సూది కింద పడినా వినిపించేంత పిన్ డ్రాప్ సైలెన్స్ గా క్లాస్ వుంది. ఆనందరావు తెలుగు లెక్చరరే అయినా ...స్ట్రాంగ్ పొలిటికల్ బాక్ గ్రౌండ్ ఉన్నవాడు. అందుకే, షాడో ప్రిన్సిపాల్ గా ఆయన వ్యవహరిస్తాడన్న పేరు కూడా ఉంది. ఆ కాలేజీలో ఆయన ఎంత చెప్తే అంత. అందుకే, స్టూడెంట్స్ కూడా ఏ క్లాసులో ఎంత అల్లరి చేసినా ..ఆనందరావు క్లాసులో మాత్రం కాస్త క్రమశిక్షణతోనే ఉంటారంతా.

"లాస్ట్ బెంచ్ ఒక్కరొక్కరుగా లేవండి" హుకుం జారీ చేసాడు ఆనందరావు దాంతో వెనక బెంచి మించి ఒక్కరొక్కరుగా లేస్తూ - "నేను కాదంటూ తప్పుకుంటున్నారు.

"మీకంటే ఈ ఆడపిల్లలే నయం...ఇచ్చిన ఎసైన్మెంట్స్ ఎప్పటికప్పుడు కంప్లీట్ చేస్తూ అప్డేట్ గా ఉంటారు. ఇలాంటి కాంపిటీషన్లలో

పార్టిసిపేట్ చేస్తూ ప్రతిభ చాటుకుంటారు...అందుకే, మీరంతా లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ అయ్యారు. ఈ ఆడపిల్లలు ఫస్ట్ బెంచ్ ఫస్ట్ క్లాస్ స్టూడెంట్స్ అయ్యారు."అన్నాడు లెక్చరర్.

"లేడీస్ ఫస్ట్ అన్నారు కదా, అందుకే మేం చదవకుండా వాళ్ళకా చాన్స్ ఇచ్చేస్తున్నాం." ఈసారి మళ్ళీ అదే గొంతు. అయితే, ఆ స్టూడెంట్ ని గుర్తు పట్టాడు ఆనందరావు.

"ప్రశాంత్ .....లే, లేచి నీ ముఖారవిందాన్ని మా అందరికీ ఓసారి చూపించు. కనిపించకుండా బెంచిలకింద దాక్కుని గొంతు మార్చి క్లాస్ లో అల్లరి చేయడం కాదు..." కోపం తో ఊగిపోతున్నాడు లెక్చరర్.

"నా మాటవిని నువ్వు ఇపుడు కనుక లేచి నిల్చోక పోతే,...ఇక ప్రిన్సిపాల్ ముందే నిల్చోవాల్సి వస్తుంది. తర్వాత...సస్పెండై కాలేజి గేటు బయట నిల్చోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఎగ్జామ్స్ కి ఎటెండ్ కాకుండా..ఏ ఆఫీసులోనో అటెండరుగా చేరి చాలీ చాలని నెల జీతం కోసం ఎంప్లాయిస్ దగ్గర చేతులు కట్టుకుని ప్రతిరోజూ నిల్చోవాల్సి వస్తుంది...."అంటూ బెదిరించాడు లెక్చరర్.

"అన్ని నిల్చోవడాలు వద్దు సార్. నేనిక్కడే , ఇప్పుడే లేచి నిల్చుంటా.."అంటూ లేచి నిల్చున్నాడు ప్రశాంత్ 'రాముడు మంచి బాలుడ'న్న రీతిలో      అమాయకమైన ఫోజిస్తూ.

"ప్రశాంత్... ఇలాంటి కాంపిటీషన్స్ లో నువ్వెపుడైనా పార్టిసిపేట్ చేసావా?"

లేదు సార్,"తల అడ్డంగా ఊపాడు ప్రశాంత్.

"ఏం, ఎందుకని?"

"టైం లేదు సార్"

ఓహో ...అంత తీరిక లేని పనేం చేస్తున్నారో దొరగారు"అడిగాడు ఆనందరావు.

"పొద్దస్తమానం కంటికి నచ్చిన అమ్మాయిల వెనక పడ్డమే. అంతకు మించిన పని దొరగారికేముంది?"కోపంగా పళ్ళు నూరుకుంటోంది సుప్రజ. సుప్రజ వేపే చూస్తూ అన్నాడు ప్రశాంత్. -"పొద్దున లేచిందగ్గర్నుంచి ఒకటే పని సార్. ఇల్లు ఊడవాలి. అన్నం వండాలి. సాయంత్రం ఇంటికెళ్ళగానే బట్టలు ఉతకాలి. ఇలా ఆడపని, మగపని అనే తేడా లేకుండా ఇంట్లో అన్ని పనులూ నేనే చేసుకోవాలి సార్.అస్సలు చదువుకోడానికే సమయం చాలడం లేదు. ఇంకా ఇలాంటి కాంపిటీషన్లలో పార్టిసిపేట్ చేసే టైం నాకెక్కడిదీ?"అనాడు దీనంగా మొహం పెట్టి ప్రశాంత్.

"అవునా, అదేం?"

"నాకు మమ్మీ లేదు సార్. చిన్నపుడే చనిపోయింది. నాన్నకి బిజినెస్ లో తీరిక ఉండదు. అందుకే, ఇంటి పనంతా నాదే" అన్నాడు.

ప్రశాంత్.

ప్రశాంత్ చెప్పిన దాంట్లో అమ్మలేదన్న విషయం ఒక్కటే నిజం. మిగతావన్నీ అబద్ధాలే. అయితే, ఆనందరావుకు అవి అబద్ధాలని చెప్పే ధైర్యం ఎవరికుంది? దాంతో ప్రశాంత్ పాచిక పారింది.

"అమ్మ లేని జీవితం నిజంగా దుర్భరం. వెరీ సారీ" అంటూ చూడు ప్రశాంత్ ఇకముందెపుడూ ఇలాంటి అల్లరి చిల్లర వేషాలు వేయకు.

బుద్ధిగా చదువుకుని వృద్ధిలోకి రా. ఇక్కడ లెక్చరర్ చెప్తున్న పాఠాలు వినకుండా సెటైర్లు, కౌంటర్లతో నీ తెలివితేటల్ని వేస్ట్ చేసుకోకు. నా క్లాసులో నీ బిహేవియర్ నచ్చకపోయినా ఫస్ట్ టైం నిన్ను క్షమిస్తున్నా"అన్నాడు ఆనందరావు.

సుప్రజవేపు చూస్తూ పొగరుగా కాలరెగరేసి మరీ కూచున్నాడు ప్రశాంత్

"ఇక విషయానికొస్తే, ఈ కాంపిటీషన్ లో సుప్రజకే ఫస్ట్ ప్రైజ్. కంగ్రాట్స్ సుప్రజా! త్వరలో కాలేజీలో జరిగే ఫంక్షన్లో ప్రిన్సిపాల్ గారి చేతులమీదుగా ఆ ప్రైజ్ నువ్వందుకుంటావ్..." అనౌన్స్ చేసాడు ఆనందరావు.

దాంతో స్టూడెంట్సంతా బల్లలపై దరువేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న కల్పన సుప్రజతో చేతులు కలుపుతూ -"కంగ్రాట్స్. ఇవాళ ఈవెనింగ్ కాఫీక్లబ్ కెళ్దాం, బిల్ నీదే" అంది.

ఆ సాయంత్రం కాఫీక్లబ్ లో ఇద్దరు ముగ్గురు ఫ్రెండ్స్ తో ప్రైజు వచ్చిన ఆనందాన్ని షేర్ చేసుకున్న తర్వాత ఒంటరిగా ఇంటికెళ్తున్న సుప్రజని అనుసరిస్తూ విసిగిస్తున్నాడు ప్రశాంత్. ఇది ప్రతిరోజు తంతే. ఈ దేశంలో ఆడదానిగా పుట్టినందుకు ఇలాంటి పోకిరి బెడదకి అలవాటు పడాల్సిందే. లేదా....అరిచి అల్లరి పడాల్సిందే. అపుడైనా కడుపున పుట్టిన ఆడపిల్లల్ని తల్లిదండ్రులు వెనకేసుకొస్తారన్న నమ్మకం అసలు లేదు. చూసీ చూడనట్టు వ్యవహరించకుండా ఆ మగాడితో గొడవ పడ్డావేంటని..? ఇంట్లో, వీధిలో పెద్దలు నిలదీయొచ్చు. అందుకే, చాలామంది ఆడపిల్లలు బాధ బయటపడకుండా పంటిబిగువున అణుచుకుంటున్నారు. సుప్రజ కూడా మొదట్లో పట్టించుకోనట్టు వ్యవహరించినా..నానాటికీ మితిమీరుతున్న అతడి ఆగడాలను సహించలేక గతంలో ఓసారి క్లాస్ పీకింది. అయినా, అతడు వినిపించుకోలేదు. 'అసూర్యంపశ్య'లైన మహిళలు కనిపించని సంకెళ్ళను తెంచుకుంటూ ఈనాడు నాలుగ్గోడల్ని దాటుకుని విశాలమైన ప్రపంచం లోకి అడుగుపెట్టి మంచి చదువులు చదివి ఉన్నత పదవులు ఏలేందుకు సిద్ధమౌతుంటే, ఇంకా అడుగడుగునా పంజా విసురుతున్న పురుష దురహంకారమేనా?

ఆడదంటే, భోగ్య వస్తువనే అవగాహనేనా? ఎంతసేపూ చాలామంది మగాళ్ళకి ఆడదాన్ని అనుభవించాలనే తపన, తాపత్రయమే తప్ప, ఆమెకీ ఓ మెదడుంటుంది..అది ఆలోచిస్తుంది, ఓ హృదయం ఉంటుంది..అది స్పందిస్తుందని ఎందుకనిపించదు? వివిధ అవసరాల నిమిత్తం ఇంటినుంచి బయటకొచ్చే మహిళ్ అలకు ఇలాంటి ఆకతాయిల నుంచి రక్షణ ఏదీ? ఆ బాధ్యత ఎవరిదీ? కని పెంచిన తల్లిదండ్రులదా? చుట్టూ ఉన్న సమాజానిదా? చట్టానిదా? ఆ చట్టాలని చేసే పాలకులదా? ఆ పాలకులను ఎన్నుకునే ఓటర్లదా? లేక, మేం మీ స్నేహితులమంటూ తాటికాయంత పెద్ద అక్షరాల్తో ప్రచారం చేసుకునే పోలీసులదా? ఈ మహిళల్ని ఎవరు రక్షిస్తారు?

"నీకు ప్రైజ్ వస్తే మాకూ హ్యాపీనే. నీకంత పార్షియాలిటీ పనికిరాదు. కేవలం నీ చుట్టూ తిరిగే ఇద్దరుముగ్గురికే పార్టీ ఇచ్చి, మమ్మల్ని పిలవకపోతే ఎలా? ఉదయ సాయంకాలాలూ నేను నీ చుట్టూనే తిరుగుతున్నా"అంటున్నాడు వెనకెంకే నడుస్తూ వెకిలిగా నవ్వుతూ ప్రశాంత్.

"నిజానికి పార్టీ ఇవ్వాలనుకుంటే.. ముందు నాకే ఇవ్వాలి. ఎందుకంటే, నీకు నీ ఫ్రెండ్స్ కంటే నేనే ఎక్కువ. ప్రతిరోజూ ఇంటినుంచి కాలేజీకి, కాలేజ నుంచి ఇంటికి బాడీగార్డ్ లా తీసుకెళ్ళి తీసుకొచ్చేది నేనే. ప్రతి ఉదయం మీ ఇంటి సందు చివర్న నిల్చుని నువ్వు ముస్తాబై బయటికి ఎపుడెపుడు వస్తావా?అని గంటలు గంటలు వెయిట్ చేస్తుంటా. తీరా నువ్వు వచ్చాక..నీవెంట కాలేజీకి,

అట్నుంచి క్లాసుకి చేరుకుని నిన్నే తదేకంగా చూస్తూ మైమరచిపోతా. తిరిగి సాయంత్రం క్లాసు నుంచి ఇంటికి తీసుకురావడం కూడా నా బాధ్యతేగా. ఈ విషయంలో మీ నాన్నని కూడా తప్పు పట్టాల్సిందే. ఎంతసేపూ ఆఫీసు ఆఫీసంటూ పని చేసుకుంటాడే కానీ ..అరె, డిగ్రీ చదువుతున్న కూతురు కాలేజికెలా వెళ్ళివస్తోందనే ఆలోచనేమైనా అతడికుందా...లేదే...? వసపిట్టలా వాగుతున్నాడు.

ఆడశివంగిలా ఒక్కసారి వెనక్కి తిరిగి -"ఇచ్చేది పార్టీ కాదు, పోలీసులకు ఫిర్యాదు. మిస్టర్. మైండ్ యువర్ బిజినెస్...నిన్ను పట్టించుకోకుండా ఎంత విదిలిస్తున్నా నా వెంట పడ్డానికి సిగ్గు లేదూ?ఈ సారి నా వెనక పడ్డావో, జాగ్రత్త"అరిచింది.

ఆ అరుపులకి చుట్టుపక్కల వాళ్ళు అప్రమత్తులు కావడంతో ప్రశాంత్ తన కాళ్ళకి బుద్ధి చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. అతడలా వెన్ను చూపి పరిగెడుతుంటే సుప్రజకి చూడముచ్చటగా ఉందా దృశ్యం.

"జీవితం లో ఏ ఆపదైనా పరిగెడితే భయపెడుతుంది. భయపెడ్తే పరిగెడ్తుంది. అన్న విషయం సుప్రజకి మొదటిసారిగా తెలిసినట్లైంది.

దాంతో ఆ రాత్రి ఆమెకి ఆనందంతో నిద్ర కరువైంది.

ఆ మర్నాటి ఉదయం -

ఆనవాయితికి విరుద్ధంగా సుప్రజకి ఇంటిదగ్గర ప్రశాంత్ ఎదురుపడలేదు. కాలేజీలో కనిపించలేదు. క్లాసుకి రాలేదు. కల్పనతో జరిగిన విషయం చెప్తూ "ఎదురుపడేందుకు మొహం చెల్లనట్లుంది " కామెంట్ చేసింది సుప్రజ.

"జరిగిన సంగతి ఇంట్లో పేరెంట్స్ కి, దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లో పోలీసులకి ముందుగా చెప్పు" అని సలహా ఇచ్చింది కల్పన.

"అవమానభారంతో చచ్చిన పాము. వాడేం చేస్తాడు?" ధీమా ప్రదర్శించింది సుప్రజ.

"అంత చిన్న దెబ్బకే పాము చచ్చిందనుకోవడం వట్టి భ్రమ. నువ్వు తోకనే తొక్కావ్. రేపోమాపో అది పడగవిప్పి బుస్సున కాటేస్తుంది. ఎందుకైనా మంచిది జాగ్రత్తగా ఉండు..."అంది కల్పన.

"అలాగే" అంది సుప్రజ. ఆ సాయంత్రం కాలేజి నుంచి ఇంటికొస్తుండగా...దారిలో ఎదురుపడ్డాడు ప్రశాంత్. రోజులా లేడు. రాత్రి నుంచి ఇప్పటిదాకా తాగుతూనే ఉన్నాడేమో, ..కళ్ళెర్రగా ఉన్నాయి. జుత్తు చెదరి ఉంది.

"ఆగు సుప్రజా!" గట్టిగా అరిచాడు ప్రశాంత్.

"ఇన్నాళ్ళూ ఎపుడూ నీ వెనకే నడిచాను. ఇవాళే నీకెదురొచ్చాను.ఎందుకో తెలుసా?" అని బీకరంగా నవ్వాడు. "ఎపుడో అపుడు నువ్వు లొంగుతావనుకున్నా.నిన్నటి ఆ సంఘటనతో ఆ ఆశ తీరిపోయింది. నాకు దక్కనిది మరెవరికీ దక్కకూడదనే పంతంతోనే చిన్నప్పట్నుంచి నే పెరిగా.నాకు దక్కని నిన్ను మరెవరికీ దక్కనివ్వను. సుఖంగా ఉండనివ్వను...."అంటూ హఠాత్తుగా వెనక దాచుకున్న చేతుల్లోంచి ఓ బాటిల్ చూపించాడు.

"అదేంటి?" సుప్రజ గొంతులో భయం...

"యాసిడ్.. ఒక్కసారి ఈ బాటిల్ విదిలిస్తే నువ్వు కాలి బూడిదవుతావ్.." అంటూ మీదమీదకొస్తున్నాడతడు.

"హెల్ప్...హెల్ప్.."చుట్టూ చూస్తూ గట్టిగా అరిచింది సుప్రజ.

ఈ బాటిల్ చేతిలో ఉండగా ఎవరొస్తారో చూస్తా" అంటూ రెచ్చిపోతున్నాడు ప్రశాంత్. ఇంతలో అట్నుంచి వేగంగా వస్తున్న ఓ స్కూటర్ అతడ్ని ఢీ కొట్టింది. అదుపు తప్పి ప్రశాంత్ కింద పడ్డాడు. స్కూటర్ మరింత వేగంగా ముందుకు దూసుకుపోయింది.దబ్బున పడిన బాటిల్ చితికి యాసిడ్ ప్రశాంత్ మొహం పై పడింది. దాంతో భరించలేని బాధతో ప్రశాంత్ హాహాకారాలు చేస్తుంటే.....గుమికూడిన నలుగురు అతడ్ని ఆటోలో వేసుకుని ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో పడ్డారు. తన ప్రమేయం లేకుండా జరిగిపోతున్న సన్నివేశాల్ని గమనించలేని స్థితిలోపడ్డ సుప్రజ స్థాణువే అయింది.

"మేడం మంచినీళ్ళు తాగండి" ఎవరో అరిచారు. అందుకుని గడగడా నీళ్ళు తాగేసింది సుప్రజ.

"మీరూ..." పక్కనే ఆగిన స్కూటర్ వేపు చూస్తూ అడిగింది తేరుకున్న తర్వాత.

"సాగర్...సాఫ్ట్ వేర్ ఇంజనీర్. మీ ఎదురింట్లోనే ఉంటున్నా..అడపాదడపా మిమ్మల్నీ..అతడ్నీ గమనిస్తున్నా..ఆ క్రమం లోనే నిన్నటి సంఘటన చూసా.ఇవాళేదో జరుగుతుందని ఎక్స్ పెక్ట్ చేసా...ఊహించిందే జరిగింది. యాసిడ్ తో మీ జీవితాన్ని నాశనం చేయాలని ప్రయత్నించి తాను తెచ్చిన యాసిడ్ కి తానే బలయ్యాడు..." చెప్పాడతడు. వారం రోజుల తర్వాత ఓ సాయంత్రం-

"మీకెలా థాంక్స్ చెప్పాలో అర్థం కావడం లేదు..."సాగర్ తో అంది సుప్రజ.

" ఆ ఇన్సిడెంట్ ని ఇంకా మీరు గుర్తుంచుకున్నారన్న మాట. అన్నట్టు మీ ప్రియమైన శత్రువెలా ఉన్నాడు?"అడిగాడు సాగర్.

"ప్రియమైన శత్రువా?" అర్థం కానట్టు చూసింది అతనివేపు సుప్రజ.

"అదేనండీ...ప్రతిరోజూ మిమ్మల్ని నీడలా వెన్నాడే మీ క్లాస్ మేట్."అతడడుగుతున్నది ప్రశాంత్ గురించేనని అప్పటికి అవగతమైందామెకి. నవ్వుతూ - "ఇంకా ఆస్పత్రి బెడ్ మీదే ఉన్నాడు. మీ దెబ్బకి ..ఆ యాసిడ్ ధాటికి మొహమంతా కాలిపోయిందట"

"అందుకే అన్నారు పెద్దలు..చెరపకురా చెడేవు అని. పెద్దల మాట చద్దన్నం మూట. ఆ సంగతి ఇప్పటివాళ్ళకి తెలిస్తే ఇన్ని అనర్థాలు జరగవు"

"అంటే...మీరు ఎప్పటి వారో..?"

ఎం.ఎన్.సి.లో పని చేస్తున్న నన్నే అనుమానిస్తారేమిటండీ? నేనూ ఈ తరం కుర్రాడినే. అయితే, మా బామ్మ పెంపకంలో.... "మిగతా మాటలు పూర్తి చేయకుండా ముసిముసిగా నవ్వాడు.

"ఇవాళ రేపు పక్కవాడికి సాయం చేసే మనుషులున్నారంటారా"? అడిగింది సుప్రజ.

"ఎందుకు లేరు? నిలువెత్తు ఉదాహరణగా మీ ఎదురుగా నేనే ఉన్నానుగా"అన్నాడు నవ్వుతూ.

"ఏమో...నమ్మలేకపోతున్నాను."

"ఎందుకంత అపనమ్మకం"

"ఈ మధ్యే మనిషి మీద ఏర్పడిన అభిప్రాయం" అంది సుప్రజ.

"ఓహో....అయితే, మీరు చెప్పాల్సింది చాలా ఉందన్న మాట. అంటే, నేను వినాల్సింది ఎంతో ఉందనేగా అర్థం" అన్నాడు సాగర్.

"వినే ఓపిక ఉందా? అయితే, పదండి పక్కనే ఉన్న కాఫీ క్లబ్ కి."

ముందు ఆమె, వెనక అతడు. అయిదు నిముషాల్లో కాఫీక్లబ్ లో ఉన్నారిద్దరూ.

కాఫీకి ఆర్డరిచ్చాక -"ఊ...ఉపోద్ఘాతం చెప్పారు.అసలు కథేంటో చెప్పండి" అన్నాడు సాగర్ నవ్వుతూ.

"సుత్తి లేకుండా సూటిగా చెప్తాను. మనిషి ఎంత నిరంకుశుడో, ఎంత స్వార్థపరుడో ఇపుడిపుడే నాకర్థమౌతోంది. తన స్వార్థం కోసం ప్రకృతిని కబళించేశాడు. కోటానుకోట్ల జీవరాశుల ఉనికిని నిర్వీర్యం చేశాడు. చేస్తున్నాడు. ఇంటి ముంగిట్లోకి వచ్చి ఇన్ని బియ్యం గింజల్ని ఏరుకునే చిన్ని పిచుకల్ని సర్వ నాశనం చేశాడు. అంతులేని ధనరాశుల కోసం కప్పల్ని ఎగుమతి చేసి ఆ జాతి లేకుండా చేసాడు. ప్రకృతివిరుద్ధంగా అనేక అక్రమాలకు పాల్పడ్డ ఈ మనిషి ..క్రమక్రమంగా చివరికి తన జాతినే అంతం చేసుకుంటున్నాడు. చూసారుగా...ఈ యాసిడ్ దాడులు...ఎక్కడో దేవుడు కరుణించబట్టి ఇపుడు మీముందు కూచుని ఇలా మాట్లాడగలుగుతున్నా.లేకుంటే, నేనుండాల్సింది ఆస్పత్రిలోనే. కాపాడినందుకు థాంక్స్" సర్వర్ తెచ్చిచ్చిన కాఫీ కప్పు అందుకుంటూ అంది సుప్రజ.

"ఫిఫ్టీ..ఫిఫ్టీ"అన్నాడు తన కాఫీ కప్పుని పక్కకు తోసేస్తూ సాగర్ సడెన్ గా.

"ఏమన్నారు?"

"ఫిఫ్టీ..ఫిఫ్టీ...మీ కప్పులోని కాఫీని సగం సగం తాగుదామంటున్నా.." అన్నాడు.

"ఔను...ప్రకృతి ఐనా ప్రేమ ఐనా ఫిఫ్టీ ఫిఫ్టీ పంచుకుంటేనే జీవ వైవిధ్యం సార్థకం"అనుకుందామె.

సగం సగం కాఫీ పంచుకుంటున్న ఈ తాజా సన్నివేశంలో సుప్రజ అంతరంగంలో కదుల్తున్న రంగురంగుల భావాలెన్నో...ఎన్నెన్నో? ఏమో...కొన్నాళ్ళ తర్వాత ఆమె ఆలోచన నిజమవొచ్చేమో.....ఎవరు చెప్పగలరు?




మూ డు రోజులనుంచి లక్ష్మి నలతగా ఉంది.

ఇక ఆలస్యం చేస్తే లాభం లేదు. మీరొక సారి డాక్టర్ గారిని తీసుకురండి. సరస్వతి సంధ్యావందనం ముగించుకొన్న భాస్కరశర్మ వంక అభ్యర్ధనగా చూసింది. లక్ష్మి మగతగా ఉంది. ఆహారం ముట్టి నాలుగో రోజు. "మీరు వావిళ్ళ వారింట్లో వ్రతం చేయించాలి తెలుసు కానీ "లక్ష్మిని నేను తీసుకెళ్ళలేను కదా!"

అంది సరస్వతి.వంటింట్లోకి వసారాలోకి తిరుగుతూనే వుంది. భాస్కర శర్మకు కూడా పాలుపోలేదు. ఏ డాక్టరు దగ్గరకు తీసుకుపోవాలో తనకైతే తెలిదు. కొత్తపల్లి సురేంద్రకు ఫోన్ చేసి విషయం చెప్పాడు.

"అట్టాగా సామే, నువ్వు సెప్పాలా,వుండుండు, ఆపాట్నే వస్తావుండా" అన్నాడు సురేంద్ర. ఐదేఐదు నిముషాల్లో భాస్కరశర్మ యింటిముందు వాలాడు. కానీ ఈలోగా ఎన్ని ఆలోచనలో.

***

లక్ష్మి భాస్కర శర్మ ఇంటికి వచ్చి మూడు నెలలు. వేదమంత్రాలు చదివి ఎంతో మంది చేత గోదానం చేయించారు శర్మగారు. యిదివరలో చాలామంది ఇవ్వగా గోదానం స్వీకరించారు. వాటిని ఇచ్చేసి డబ్బు స్వీకరించేవారు. కానీ మనమెందుకు ఒక గోవును

పెంచుకోకూడదు అంది సరస్వతి. ఆ మాట నిజమే అని బాస్కరశర్మ లక్ష్మిని ఇంటికి తెచ్చాడు. గోవు ముఖానికి రోజూ అంత పసుపు, కుంకుమ రాసి అంత బొట్టు పెడితే లక్ష్మి కళకళ్లాడుతూ ఉండేది. విప్పారిన లక్ష్మి కళ్ళు - బాపు వేసిన సంక్రాంతి గ్రీటింగ్ లలో లాగా - కాటుక పెట్టినట్లు ఉండేవి. కొమ్ములకు కట్టిన చిరు గంటలు అది తల ఆడించినప్పుడల్లా ఘల్లుఘల్లు మంటూ సవ్వడి చేసేవి. మెడలో నీలం, తెలుపు పూసల దండలేసుకొని తోకెత్తి పరిగెడుతూ అంబా అని అరిస్తే - " ఆ జగజ్జనని ని ఆర్తిగా పిలుస్తోంది ఆ మూగ జీవి చూడు" అనేవాడు శర్మ గారి అబ్బాయి శేషఫణి శర్మ.లక్ష్మి రోజుకు ఎనిమిది లీటర్ల పాలిచ్చేది. ఇటీవల వరకూ బాగానే ఉండేది. నాలుగు రోజులుగా నలతగా వుంటోంది. పాలు ఇవ్వడం లేదు. నెమరు వేయడం లేదు. చలనం లేదు.

సురేంద్ర నేరుగా లక్ష్మి దగ్గరికే వెళ్ళాడు. సురేంద్ర పది పన్నెండు పాడి పశువులున్న ఆసామి. సురేంద్రకీ, ఆయన తండ్రి తరం నుంచి శుభ కార్యాలకు శర్మగారే బ్రహ్మ. జ్వరం వుందేమోనని చూసాడు. జ్వరం లేదు. కంటివెంట నీళ్ళు కారుతున్నాయి. మూతి కదల్చడం లేదు. పశువుల పెంపకంలో మంచి అనుభవం వున్న సురేంద్రకి ఏమీ తోచలేదు. వెట్నరీ డాక్టర్ వేణుగోపాల్ కి ఫోన్ చేసాడు.

"డాట్రూ మన పంతులు శర్మగారుళ్ళా! ఆయనీమద్దెన ఆవును పెంచుకుంటావుండాడ్లే, ఆ...! అదే అదే...ఎవురో దానం యిస్తేనూ ...దానికి సుస్తీ చేసి వుండాది. మీరు ఎట్టైనా రావాల.! తప్పదు...సార్..నాకు తెల్సు సార...మీరు ఈరోజే రిటైర్ అవుతాండారు. సాయంత్రం మీటింగుకు నేనూ వస్తా వుండా. ఏం అనుకోబాకండి. ఇబ్బందే కాని ఇది అయ్యోరి ఆవు అయిపాయెనే. ఆయనకంటే ఆయన బార్య దిగులు పెట్టుకుని కూకుండినాది. టిఫిన్లేదు. వంటలేదు..పొయ్యి లేస్తేగదా...ఫోనుకి చెయ్యి అడ్డం పెట్టి చెబుతున్నాడు. ...డాట్రు వేణుగోపాలని మంచోడు. ఈవాళే రిటైర్ అవుతాండాడు. వేరే సిన్న డాక్టరుని అంపిస్తానంటే వొద్దెహే...నువ్వే రావాలని సెప్పినా..ఇంట్లో వాళ్ళకి సెప్తావుండాడు. ..వస్తాళ్ళే" సరస్వతమ్మ వైపు చూస్తూ చెప్పాడు.

లక్ష్మి పరిస్తితి వివరించాడు సురేంద్ర. అడ్రస్ కనుక్కొని నేనే వస్తానన్నాడు డాక్టర్ వేణుగోపాల్. దాక్టర్ వచ్చేలోగా "అమ్మా అంత కాఫీ పెట్టీ"అని స్వతంత్రంగా అడిగి కాఫీ తాగుతున్నాడు.

యిఘనేం కాదునే" అని ధైర్యం చెప్తూ సురేంద్ర.

***

బొలెరో లోంచి దిగిన డాక్టర్ గారికి శర్మ దంపతులిద్దరూ అభివాదం చేశారు. డాక్టరు వచ్చేలోగా సురేంద్ర తన అసిటెంట్లను పిలిపించి వసారా క్లీన్ చేయించాడు. ముందు రెండు వేప గుంజలు నాటి ఒక అడ్డగుజ కట్టించాడు. లక్ష్మిని డాక్టర్ గారు పరీక్షించడానికి అనువుగా ఏర్పాట్లు చేశాడు. సరస్వతమ్మకు చెప్పి రెండు బక్కెట్ల వేణ్ణీళ్ళు, సబ్బు, టవలు ఏర్పాటు చేయించాడు. డాక్టర్ వేణుగోపాల్ ఆవును పరీక్షగా దూరం నుంచే పరికించాడు. అనుభవం పండిన వైద్యుడికి రోగి లక్షణాలు ఇట్టే తెలిసిపోతాయి. లక్ష్మికి బాగా నలతగా వుంది. మూతి పెదాలు బాగా డ్రై గా వున్నాయి. కళ్ళనుంచి నీళ్ళు కారుతున్నాయి. లక్ష్మిని పరీక్షించాడు. ప్రబ్లెం లంగ్స్ లో లేదు. గైనిక్ ప్రబ్లెం కూడా కాదు. జ్వరమూ పెద్దగా లేదు. వివరంగా అడిగితే ఆహారం మానేసి నాలుగు రోజులూ, నెమరు వేసి మూడు రోజులూ అయ్యిందనీ నీళ్ళు కూడా ముట్టడం లేదనీ చెప్పారు. పొట్ట బాగా ఉబ్బరంగా వుంది. ఎడమ వైపు కాస్త స్వెల్లింగ్ వుంది. "చాలా రోజులు తిన్నది ఏదీ జీర్ణం అయినట్లు లేదు. ఇంఫాక్షన్ వుందయ్యా!సర్జరీ చేయాలి" అన్నాడు.

"డాట్రూ, పొడిమందు, మాత్రలూ ఏవైనా ఇస్తే సరిపోదా"ఆదుర్దాగా అడిగాడు సురేంద్ర. "లేదండీ...ఇది ఇంఫెక్షన్ కాదు. యింఫాక్షన్ అంటే తిన్నది అంతా కదలక అలాగే జాం పాక్డ్ గా వుండిపోవడం. ఈ పరిస్తిలో సర్జరీ ఒక్కటే మార్గం. మీరు సరే అంటే ...డాక్టర్ శర్మ వంక చూశాడు. సరస్వతి తల్లడిల్లింది. నోటికి ఘుద్దా అడ్డం పెట్టుకుని లోనికి పరిగెత్తింది. దు:ఖం ఆపికొంటూ శర్మగారు తల

దించుకొన్నాడు దిక్కు తోచక. సురేంద్ర తలపాగా వదులు చేసి భుజమ్మీద వేసుకున్నాడు. పెంపుడు జంతువు మీద ప్రేమ అలాంటిది. మూగజీవి మౌనంగా బాధను అనుభవిస్తోంది. శర్మకి ధైర్యం చెప్పాడు డాక్టర్ వేణు. "ఏం కాదు పంతులుగారూ..నేనున్నాగా" హామి ఇచ్చారు. చేయగలిగింది లేక సరస్వతి సరేనంది కళ్ళు తుడుచుకొంటూ.

డాక్టర్ వేణు తనతో తెచ్చుకున్న పరికరాలన్నీ ఓ వైపు టేబుల్ వేయించి పెట్టుకున్నాడు. తలకు కాప్, మెడకు ఆప్రన్, చేతికి గ్లోవ్స్, వేసుకొన్నాడు. ఎడమ డొక్కలో నొక్కి చూసి ఎక్కడ కోత కోయాలో నిర్ధారించుకున్నాడు. మొదట డొక్క మీద వెంట్రుకలన్నీ క్లీన్ గా షేవ్ చేసాడు. సోప్ వాటర్ తో కడిగి శుభ్ర పరచి స్పిరిట్ అప్లై చేశాడు. నొప్పి తెలియ కుండా ఇంజక్షన్ చేశాడు. స్టెరిలైజ్ చేసిన పరికరాలన్నీ సిద్ధంగా వున్నాయి. తదుపరి పని పూర్తి చేయడానికి డొక్క నిలువుగా ఆరు అంగుళాలు కోశాడు వేణు. పై స్కిన్ కట్ చేసి రక్తాన్ని తుడుస్తూ తర్వాత కండరాల్ని కత్ చెసి లోపలి భాగాల్ని పరిశీలించాడు. జీర్ణకోశం బాగా ఉబ్బిపోయి ఉంది. లోనికి చెయ్యి పట్టి గట్టిగా లాగి పట్టి బయటకు తీశాడు. జీర్ణాశయం చూసిన డాక్టర్ వేణుగోపాల్ ఒకాసారి షాక్ కి గురైనాడు. ఎన్నో సర్జరీలు చేసాడు. తన 35ఏళ్ళ అనుభవం లో కానీ ఎన్నడూ ఎదురుకాని అనుభవం. లోన చెయ్యిపట్టి బయటకు లాగేసాడు. పొట్టనిండా క్యారీ బ్యాగ్ లు.!ప్లాస్టిక్ సంచులు. !! పాన్ పరాగ్ ప్యకెట్లు. షాంపూ సాచెట్లు...కుక్కుకొని పోయి ఉన్నాయి. లాగుతుంటే వస్తూనే వున్నాయి. బయటకు లాగి పక్కకు పడేసిన కుప్ప - వీధి చివర చెత్తకుప్పలాగుంది.

ఒకవైపు సర్జరీ చేస్తూ చెబుతున్నారు డాక్టర్ వేణుగోపాల్, అక్కడ చేరిన జనాల వైపు చూస్తూ - " చూడండి, ఆవు, గేదె ఏదైనా- దాని పొట్ట కెపాసిటీ నలభై కేజీలుంటుంది. పశువు గడ్డి ముందు తిని మళ్ళీ నోట్లోకి తెచ్చుకొని నెమ్మదిగా నెమరు వేస్తుంది. ఎప్పుడూ దాని కడుపులో కనీసం పది కేజీల గడ్డి వుండాలి. దీని పొట్టలో అరకిలో గడ్డికూడా లేదు. మొత్తం నలభై కేజీలూ క్యారీ బ్యాగులూ, ప్లాస్టిక్ సంచులూ, షాంపూ పాకెట్లే ఉన్నాయి. "విచారం వెలిబుచ్చాడు. లోనుంచి నిరోధ్ పాకెట్లనూ తీస్తూ.

"ప్రజల నిర్లక్ష్యం పశువులకు ప్రాణాంతకమౌతుంది. " ఇకనైనా పట్టించుకోండి. మారండి. ప్లాస్టిక్ వినియోగం మానండి...."చెప్పసాగాడు. ఆవు కడుపు మొత్తం ఖాళీ చేసేసి అందులో ఐదు కిలోల గడ్డి సన్నగా ముక్కలుముక్కలుగా చేసి నీళ్ళు చల్లి దాన్ని - ఆవు జీర్ణాశయం లో పెట్టి కుట్లు వేశాడు. మరో పది నిముషాల్లో ఆపరేషన్ ప్రక్రియ, డ్రెస్సింగ్ పూర్తి చేసాడు.వేయాల్సిన మందులూ రాసిచ్చాడు.

అక్కడ గుమికూడిన వారంతా గోవు వంక జాలిగా చూసారు. నీకంతటి కష్టం మావల్లనే కదా అని కొందరూనుకొంటే, - మేమిక ప్లాస్టిక్ వాడబోమని గట్టి నిర్ణయం తీసుకున్నారు కొందరు. డాక్టర్ ఆపరేషన్ చేసి చేతులు కడుక్కొనేసరికి అక్కడికి చాలామంది ప్రజలూ, విలేకరులూ, టీవీవాళ్ళూ చేరుకొన్నారు. ఫోటోలు తీస్తున్నారు. డాక్టర్ గారిని ఇంటర్వ్యూ చేస్తున్నారు.

"డాక్టర్ గారూ, చెప్పండి. మీరు ఈ ఆపరేషన్ చేసి దాదాపు నలభై కిలోల క్యారీ బ్యాగులు, సంచులూ తీసారు కదా, ఇది ప్రజా నిర్లఖ్యంగా పరిగణించాలా!ప్రభుత్వ వైఫల్యం అనుకోవాలా! ఏవిధంగా అర్థం చేసుకోమంటారు"వాళ సహజ ధోరణిలో అడిగారు.

"క్యారీ బ్యాగులూ,ప్లాస్టిక్ సంచులూ వాడకం మానాలి. ఇది పశువులకే కాదు, మానవాళికీ మంచిది కాదు. మీరు కూరలు క్యారీ బ్యాగ్ లో తెస్తారు. కూరలు తరిగిన చెక్కులూ, తొక్కలూ, క్యారీ బ్యాగ్ లలో పెట్టి వీధిలోకి విసిరేస్తారు. అపార్టుమెంట్లలో అయితే పై ఫ్లోర్ నుండే మిగిలిపోయిన అన్నం, కూరలూ చికెన్ ముక్కలూ, అన్నీ కలగలిపి క్యారీ బ్యాగుల్లో ముడివేసి మరీ విసిరేస్తారు. వాటిలోని ఆహార పదార్థాల కోసం పశువులు వెంపర్లాడతాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్ లు వేరు చేసి తినాలనే తెలివి పశువులకు లేదు. ప్లాస్టిక్ బ్యాగ్ లలో అలా పారేయకూడదనే తెలివి మనకు లేదు. అలా తిన్న ఆహారం అరిగిపోగా, ప్లాస్టిక్ బ్యాగ్ లూ, సాచెట్లూ అలాగే వుండిపోతాయి. "గమనించండి. ఈ కుప్పలో అన్ని బ్రాండ్ల షాంపూ పాకెట్లూ, అన్నిరకాల పాన్ పరాగ్ ప్యాకెట్లూ నిరోధ్ లూ

ఉన్నాయి " అని చెప్పగానే అందరూ నవ్వుకొన్నారు.

" ఈ ఆపరేషన్ చేసిన ఆవు మళ్ళీ మామూలుగా గడ్డి తింటుందా?" అని ఒక విలేకరి ప్రశ్నించాడు. "రెండు మూడు రోజుల్లో మళ్ళీ మామూలుగా గడ్డి తింటుంది. బేసిక్ గా పశువులకు ప్లాస్టిక్ నచ్చదు. కాని ఒక్కసారి తిన్నాక అది అడిక్ట్ అయ్యే ప్రమాదమూ ఉంది. అందుచేత పశువులకు ప్లాస్టిక్ సంచులను దొరకకుండా చేయడంలోనే వుంది అందరి బాధ్యత. పశువులను పోషించేవారుకూడా పశువులనువిచ్చలవిడిగా వీధిలోకి వదిలేయకుండా కాపాడుకోవాలి."అని సూచించారు. మరి ఇంత ప్రమాదమైతే- ప్లాస్టిక్ వాడకాన్ని , తయారీని ప్రభుత్వం ఎందుకు నిరోధించదు?మరో విలేకరి ప్రశ్న. "ప్రభుత్వం చట్టం చేసి వదిలేస్తుంది. చట్టం అమలయ్యేలా చూడ్డం అధికారుల బాధ్యత. సామాజిక స్పృహతో మనుషులుగా మెలగడం మనందరి బాధ్యత "అని చెప్పి వెళ్ళిపోయారు డాక్టర్ వేణుగోపాల్.

***

భాస్కరశర్మగారు ఆనాటి సాయంత్రం డాక్టర్ గారి రిటైర్మెంట్ సభలో వేద మంత్రాలు చదివి, శాలువతో సత్కరించి అశీర్వచనం పలికారు.

"డాక్టర్ గారూ, మీరు రిటైర్మెంట్ తర్వాత కూడా పశు సన్రక్షణకి మీ సేవలు అంద్దించాలి!"అని తోటి డాక్టర్లూ, డైరెక్టర్ గారూ కోరారు.

ఆయన " నో" అనడంతో అందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు. "సర్వీస్ లో వున్న మీరు ఆబాధ్యత స్వీకరించండి. నేను ఇకపై మనదేశం లో ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా గట్టి ఉద్యమం లేవనెత్తి నోరు లేని మూగజీవాలన్నిటి కోసం పోరాడుతాను!" అని ప్రకటించగానే సభాస్థలిలో చప్పట్లు మారుమోగాయి.!!!




ఏ య్ నిమ్మి...నిన్నే నే...

ముక్త కంఠంతో ఎవరో తనను పిలిచినట్లనిపించి వెనక్కు తిరిగి చూసింది నిర్మల. తన చిన్ననాటి మిత్రులు కవిత, రజని, కల్పన పార్కింగ్ ప్లేసులో హుందాయ్ కారు దగ్గర హుందాగా నిలబడి తననే పిలుస్తున్నారు.

ఎన్నాళ్ళకు... ఉహూ... ఎన్నేళ్ళకు కనిపించారు. నిర్మల ఆనందానికి పట్ట పగ్గాల్లేకుండా పోయాయి. "హాయ్ ఎవెరీబడి" అంటూ చిన్న పిల్లలా పరుగు తీసింది వారి వద్దకు. వారి సౌకుమార్యాన్ని కన్నార్పకుండా చూస్తూ "మీరు నిజంగా కవిత, రజని, కల్పనలే కదా? దివి నుండి భువికి ఏతెంచిన రంభ, ఊర్వశి, మేనకలు కాదుగా!" అని ఆశ్చర్యంగా అడిగింది.

"అవునే తిలోత్తమ తప్పి పోతేనూ ఇలా వచ్చాం, హమ్మయ్య ఇదిగో ఇప్పుడు కనిపించింది. మొత్తానికి ఇంద్రుడితో చివాట్లు తప్పించావు" ఎకసక్కెంగా అంది రజని.

"నీ పెంకితనమూ, నువ్వూ... చిన్నప్పటి నుంచి నువ్వేమీ మారలేదే. అపుడే జోకులు మొదలెట్టావు" రజని చేతిని ఆప్యాయంగా నొక్కుతూ అంది నిర్మల.

"మరి మామీద జోకులేస్తే ఊరుకుంటానా?" నవ్వుతూ అంది రజని."నిమ్మీ, మమ్మల్ని కాస్తా కనికరించి మాట్లాడవే" మిగతా వారు నిష్ఠూరమాడారు. "అయ్యో అదేంటే, అలా అంటారు. మనమంతా ఎంత థిక్ ఫ్రెండ్స్మో అందరికీ తెలుసు. కాలేజీ చదువులయ్యాక ఎవరికివారు విడిపోయామే గానీ లేకపోతే కవలల్లా కలిసి మెలిసి ఉండేవారం కాదూ?" రాగం తీసింది నిర్మల.

"ఇపుడెవరు కాదన్నారూ, ఇలా రోడ్డు మీద నిలబడి మాట్లాడ్డమేనా ఏదైనా హోటల్కి వెళ్ళే ప్రోగ్రాము ఏదైనా ఉందా?" అసహనంగా అంది కల్పన.

"కల్పనా నీకెప్పుడూ తిండి ధ్యాసేనే. ఒకసారి క్లాసులో నువ్వు చక్కిలం పట పటలాడించేస్తుంటే ఎవర్రా నామీద పళ్ళు నూరుతున్నారు అని తెలుగు మాస్టరు నీమీద రంకెలు వేయడం నాకింకా బాగా గుర్తు" గల గలా నవ్వుతూ అంది నిర్మల."తల్లీ నీకో దండం, ఇక నీ ఫ్లాష్ బ్యాకులు ఆపి కారెక్కు. హోటల్లో తందూరి తింటూ కబుర్లు చెప్పుకుందాం" అమల ప్రతిపాదనకు అందరూ ఓకే చెప్పి కారెక్కారు.

కవిత, రజని, కల్పన డబ్బులో పుట్టి డబ్బులో పెరిగారు. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకొనే రకం వారు. తాము గొప్పవారమనే అహం వారిలో మెండు. నిర్మల దిగువ మధ్యతరగతి కుటుంబీకురాలు. ఆచితూచి అడుగేస్తుంది. నిర్మల అమాయకత్వం వారికి నచ్చింది. ఏసీ కారు ఫైవ్ స్టారు హోటలు వైపు రివ్వున దూసుకెళ్తోంది. ఇది గమనించిన నిర్మల "మనం ఎక్కడికే?" అని ఆదుర్దాగా అడిగింది. "ఫైవ్ స్టారు హోటలుకు" కారు డ్రైవు చేస్తూ అంది కల్పన.

"అమ్మో ఖరీదైన ఈ తందూరి అక్కడ ఎంతుంటుందో?" గుండె మీద చెయ్యి వేసుకొని అంటున్న నిర్మల వైపు చూస్తూ "ఎంటే నీ పర్సు ఖాళీ అవుతుందని బెంగ పడుతున్నావా?" ఉడికిస్తూ అంది కల్పన.

"అది కాదే" అంటున్న నిర్మల నోటి మీద చెయ్యి పెట్టి "తినేదీ తినిపించేదీ అంతా మేమే. నీవు కేవలం నిమిత్తమాత్రురాలివే"

అభయమిచ్చింది అమల.

వారు ముగ్గురూ, తనొక్కతే. కుక్కిన పేనల్లే కూచోక తప్పలేదు నిర్మలకు. కారు హోటల్ వద్దకు వచ్చి ఆగింది. ఎదురుగా మైసూరు ప్యలెస్ లాంటి పెద్ద భవంతి. రిచ్ గా ఉంది. సూట్లూ, బూట్లూ, స్లీవ్లెస్సు జాకెట్లే అన్నీ. నిర్మల వ్యానిటీ బ్యాగులో చిల్లరతో లెక్కబెట్టినా వందకు లోపే ఉంది.

"బిల్లు మన పర్సుకు చిల్లు చెయ్యడం ఖాయం" పైకే అనేసింది నిర్మల.

"ష్, మా మర్యాద తీసేట్టున్నావే" గద్దించారు ముగ్గురూ.

మెనూలో చూసి ఏవేవో ఆర్డర్ ఇచ్చారు. వాటి పేర్లే తెలీదు నిర్మలకు. తప్పదన్నట్లు మిన్నకుండి పోయింది. సర్వర్లు బిల బిల మంటూ వచ్చారు. అన్నీ సర్ది పోయారు.

"ఇవన్నీ మనకే" ఆశ్చర్యంగా అంది నిర్మల.

"కాదే వీటిలో కొన్ని మీ కాలనీ వాళ్ళకు కూడా తీసుకెల్దువులే" వెటకారంగా అంది అమల.

"హోటలు ప్రోగ్రాము అన్నప్పటినుంచి చూస్తున్నా ఓ ఒకటే వణికి పోతున్నావే" అంది కల్పన.

"డబ్బు మంచి నీళ్ళలా ఖర్చు పెట్టడం మాకు అలవాటేలేవే" అంది కవిత డాబు ప్రదర్శిస్తూ.

" ఆ, ఇక చెప్పవే నిమ్మీ, ఈ రోజు నీవే మా గెస్టువు. చాలా రోజులకు కనిపించావు. ఎక్కడ వున్నావు? పెళ్ళయిందా? ఎంతమంది పిల్లలు?" ప్రశ్నలు సంధించారు ముగ్గురూ.

"ముందు మీగురించి చెప్పండే" అంది నిర్మల.

"ముంజేతి కంకణానికి అద్దమెందుకన్నట్లు మాగురించి అందరికీ తెలుసు. మేము ఈ సిటీలో ధనవంతులం. నువ్వేంటే చిక్కి శల్యమవుతున్నావు. చిన్నప్పుడు బొద్దుగా ఉండేదానివి. నీ మొగుడు తిండి పెడుతున్నాడా, లేదా?" ఆరా తీశారు.

"మా ఆయన చాలా మంచి వ్యక్తి. ఏదో మాకు తగ్గట్లు సంపాదించుకుంటున్నాము. నాకు ఇద్దరు పిల్లలు. ఇదీ మా చరిత్ర. ఇక మీ వంతు" అంది నిర్మల.

" మా ఆయన పెద్ద రాజకీయ నాయకుడు. ఆయన పరపతి గల వ్యక్తి. ఆయన చుట్టూ ఎప్పుడూ జనమే జనం" గొప్పలు పోయింది అమల.

"మా ఆయన ఫేమస్ డాక్టరు. పెద్ద ఆసుపత్రి మేడలు కార్లు వగైరా షరా మామూలే" చెప్పింది కవిత.

"ఇక నా భర్త రంజీ క్రికెటర్. నీకు తెలుసుగా క్రికెట్టంటే డబ్బులని. మాకు డబ్బుకి కొదువ లేదమ్మా" బడాయి పోయింది రజని.

"ఓ వాళ్ళా? పేపర్లో ఈ మధ్య వారి గురించి చదివాలే." అంది నిర్మల.

"చదవక చస్తావా, మా వాళ్ళు గొప్ప వాళ్ళు, సెలెబ్రిటీలు కదా. మరి నీ భర్త ఏమి చేస్తుంటాడే?" అడిగారంతా ఆసక్తిగా. ఈలోగా నిమ్మికి తన భర్త నుంచి ఫోనొచ్చింది. కాసేపు పక్కకెళ్ళి మాట్లాడి వచ్చింది. తన భర్త గురించి చెబుతూ, "మా ఆయన అటెండరు లేవే. వికలాంగుల కోటాలో ఆయనకు ఉద్యోగమొచ్చింది. చిన్న ఉద్యోగమైనా చింతలు లేని కుటుంబం మాది. మా ఆయనకు నేనన్నా, పిల్లలన్నా

ప్రాణం" అంది నిర్మల.

"ఏంటో ఇంత చిన్న ఉద్యోగాన్నే అంత పెద్దగా చెబుతున్నావు. మా దగ్గరకు వస్తే అంతకంటే పెద్ద ఉద్యోగమే ఇస్తాము. అయినా దేవుడు నీకు చాలా అన్యాయం చేశాడే. వికలాంగున్ని ఇచ్చి నీ ఆనందం మీద నీళ్ళు చల్లాడు." అని వారు అనగానే

నిర్మలకు కోపమొచ్చింది. "అలాంటి మాటలు మాట్లాడకండి. ఆయనకు ఆ లోపమొక్కటే. గుణంలో ఆయన శ్రీరామ చంద్రుడు" అంది.

"నీ మొగుడిని వెనకేసుకు రాకమ్మా. వికలాంగుడే కదా. పాపం" సానుభూతి చూపించారు.

"అంత సానుభూతి అక్కర్లేదు. గుణంలో మా ఆయన మీ భర్తల కంటే ఎంతో ముందున్నాడు. మీ వాళ్ళంతా అవినీతిపరులని పత్రికలు కోడై కూస్తున్నాయి. అదీ గొప్పతనమేనా? మాకు అలాంటి గొప్పతనం అక్కర్లేదులే. త్వరలో జైలు పాలయ్యే పెద్దరికం మాకు ఏమాత్రం వద్దు. మీవి మేడిపండు జీవితాలు. చిన్నప్పటి మిత్రులని కలిస్తే ఇలా అవమానిస్తారా? మీకో దణ్ణం" అంటూ అప్పటికే అక్కడకు చేరుకున్న తన భర్త వెంట రాగా బయటకు నడచింది నిర్మల.

కత్తి వేటుకు నెత్తురు చుక్క లేకుండా పోయినట్లయ్యాయి మిత్ర త్రయం ముఖాలు. నిర్మల జంట ముందు వీరు అంగుష్టమాత్రంగా కనిపించారు.




హా య్ గీత్స్... ఏంటి ఇంత లేటు"

"అదేరా బాబు, రాత్రి లేట్ గా నిద్రపోయాను"

"ఓహ్ ఓకే"

"సరే, ఏంటి ఇవాళ కూడా నేనే డ్రైవ్ చెయ్యాలా"

"యా... నువ్వు డ్రైవ్ చేస్తుంటే నేను రోడ్డు మీద బ్యూటీస్ ని చూస్తూ ఎంజాయ్ చేస్తాను"

"నో వేస్, ఇవాళ నువ్వు డ్రైవ్ చెయ్యి"

"ప్లీజ్ గీత్స్, అర్ధం చేసుకో"

ఒకే, నువ్వేం అడిగినా కాదనలేను అని మనసులో అనుకుని

"ఓకే రామ్స్, ఇవాళ మాత్రమే నేను డ్రైవ్ చేస్తాను, ఇక రేపట్నుంచి నువ్వే డ్రైవ్ చెయ్యాలి, ఈజ్ ఇట్ ఒకే ఫర్ యు"

"యా, ఫైన్, ఇక పద"

***

"ఎప్పుడూ ఇదే రెస్టారెంట్. బోర్ కొడుతోంది గీత్స్"

"ఇది నాకిష్టమైన రెస్టారెంట్ రా"

"ఓకే, ఫైన్"

"నీకిష్టమైనవి ఆర్డర్ చెయ్యరా"

"నాకు ఇష్టమైనవి నీకు తెలుసుకదా, నువ్వే ఆర్డర్ చెయ్యి"

రామ్స్ కి ఇష్టమైన కొన్ని రకాల డిషెస్ ని ఆర్డర్ చేస్తుంది గీత

"హమ్మయ్య, థాంక్స్ ఫర్ ది లంచ్ మేడం గారు"

"మై ప్లెషర్"

***

"గీత్స్ ఈ షర్ట్ ఎలా ఉంది"

"అద్భుతంగా ఉంది"

"సరే ఇది నువ్వు నాకు ఇస్తున్న బర్త్ డే గిఫ్ట్"

"ఇదా, బిల్ ఎంత, అమ్మో నాలుగు వేలా, మా నాన్నకు తెలిస్తే చంపేస్తాడు"

"నువ్వు దాచుకున్న డబ్బులు ఉన్నాయి కదా వాటితో కొను"

"రామ్స్ ఓకే ఈసారికి సరే" అని ఆ షర్ట్ కి బిల్ పే చేస్తుంది గీత

***

"ఎయ్ టికెట్స్ ఏవి"

"ఆల్రెడీ ఆన్ లైన్ లో బుక్ చేసానురా, నా ఫోన్ కి మెసేజ్ వచ్చింది అక్కడ ఈ మెసేజ్ చూపిస్తే టికెట్స్ ఇస్తారు" అని హడావిడిగా మేకప్ చేసుకుంటూ చెబుతుంది

"ఇంకా ఎంత సేపు నీ మేకప్... త్వరగా రెడీ అవ్వు. నేను నీ స్కూటీ దగ్గర వెయిట్ చేస్తాను" అని బయటికి వస్తాడు రామ్స్

***

"గీత్స్, గీత్స్"

"అబ్బ ఏంట్రా, ఇంత పొద్దున్నే"

"నీకో విషయం చెప్పాలి"

"మ్, చెప్పు"

"త్వరగా కిందకి రా"

"ఓకే, గివ్ మీ ఫైవ్ మినిట్స్"

"కం సూన్"

"ఓకే రా, పెట్టు ఫోను"

అరగంట తరువాత రామ్స్ వాళ్ళ ఇంటికి గీత వచ్చింది.

"ఏంటి ఫైవ్ మినిట్స్ అంటే థర్టీ మినిట్స్ అవునా"

"నీ సోది ఆపి అసలు సంగతి చెప్పు, అమ్మాయిలు తయారవడానికి టైం పడుతుందని తెలుసుకోవేరా మొద్దు"

"ఒకే ఒకే జస్ట్ కిడ్డింగ్"

"మ్, చెప్పు, ఏంటి అర్జెంటు గా మాట్లాడాలని పిలిచావు"

"అదీ, ఆదీ"

"చెప్పరా తొందరగా"

"అదేనే, నాకొంచెం సిగ్గేస్తోంది"

"సిగ్గా, చిన్నపటినుంచి కలిసి పెరిగాము. ఇళ్ళు కూడా పక్క పక్కనే ఉండేవి. ఎల్ కె జి నుండి పీజి వరకు కలిసి చదువుదామని అనుకున్నాం. నా దగ్గర నీకు సిగ్గేంటి"

"అందుకే కదా నీకు తప్ప ఎవరికి చెప్పగలను ఇలాంటి విషయాలు. నీకు నాకు ఇంకెవరు లేరు. మనకి మనమే కదా"

"ఇప్పుడు అసలు విషయం చెప్పు"

"లవ్ మాటర్"

"ఏంటి నువ్వు లవ్ లో పడ్డావా" అని కొంచెం షాక్ తిన్న గీత రామ్స్ పై తన కున్న ప్రేమను మనసులోనే అణచుకుంది.

"అవునే"

"నేను తప్ప నీకు వేరే అమ్మాయిలు ఎవరు తెలియదు కదరా, నాతో తప్ప ఏ అమ్మాయితో మాట్లాడడానికైనా సిగ్గు పడతావు కదా"

"అదీ నిజమే"

"మరి ఎలా మొదలయ్యింది నీ ప్రేమ"

"మన అపార్ట్ మెంట్ లోకి కొత్తగా దిగారు చూశావా"

"అవును రమణ మూర్తి అంకుల్ వాళ్ళు దిగారు, వాళ్ళ అమ్మాయితో కూడా నేను మాట్లాడాను"

"ఆ అమ్మాయే"

"ఆ అమ్మాయా"

"ఏం ఎందుకు అలా అడిగావు"

"ఆ అమ్మాయి నీకు సెట్ కాదేమో రా"

"పరవాలేదే నేను అడ్జస్ట్ అవుతాను"

"సర్లేరా ఇంతకీ ఆ అమ్మాయితో పరిచయం చేసుకున్నావా" అని అడుగుతుంది

"లేదే"

"సరే నువ్వు ఆ అమ్మాయితో పరిచయం చేసుకో ఆ తరువాత ఈ విషయం ఆలోచిద్దాం"

"ఏంటి ఆలోచించేది, ఆ అమ్మాయితో పరిచయానికి నీ సహాయం కావాలి"

"సరే, గ్రాంటెడ్" అనగానే గీతని రామ్స్ ఎత్తుకుని గిర గిరా కొంత సేపు తిప్పుతాడు.

ఇంట్లోకి అడుగుపెడుతున్న గీత తండ్రి తన కూతురిని ఎత్తుకుని తిప్పుతున్న రామ్స్ వైపు నవ్వుతూ చూస్తూ

"చిన్ననాటి స్నేహం" అని లోపలికి వెళ్ళిపోతాడు.

***

ఎత్తరా ఫోన్, ఎంత సేపు వెయిట్ చెయ్యాలి అనుకుంటూ ఉండగా రామ్స్ ఫోన్ లిఫ్ట్ చేస్తాడు

"ఒరేయ్ రామ్స్"

"చెప్పు గీత్స్"

"ఆ అమ్మాయితో ఇవాళ మాట్లాడనురా"

"నా గురించి చెప్పావా"

"ఉండరా...నీ తొందర కొంచెం పక్కన పెట్టు"

"చెప్పవే ఆ అమ్మాయితో నా గురించి చెప్పావా"

"ఆ విషయానికే వస్తున్నా, ఆ అమ్మాయి నీకు సెట్ కాదేమో రా"

"ఎందుకు సెట్ కాదే"

"ఆ అమ్మాయికి బాయ్ ఫ్రెండ్స్ ఎక్కువ రా, అల్ట్రా మోడరన్ కూడా, తన డ్రెస్సింగ్ స్టైల్ గమనించావా"

"ఓహ్ అవునా"

"అవున్రా, నీ మంచి కోరి చెబుతున్నా"

"నువ్వు నిజంగా నా ఫ్రెండ్ వి అయితే నాకు ఆ అమ్మాయితో పరిచయం చెయ్యి"

"సర్లేరా నీకు ఎంత చెప్పినా అర్ధం కాదు"

"సరేనే నువ్వు తప్ప నాకేవరున్నారు. నా మీద కోపం తెచ్చుకోకు"

"నాకూ అంతే కదరా"

"గుడ్ నైట్, స్వీట్ డ్రీమ్స్"

"గుడ్ నైట్"

ఆ రాత్రంతా గీత రామ్స్ గురించే ఆలోచిస్తుంది.

***

"హాయ్ అని"

"హాయ్ గీతా, రా లోపలి రా, నా రూం చూపిస్తాను"

అని గీతని తన రూం కి తీసుకెళుతుంది

రూం అంతా అందం గా ఉంటుంది. షి ఈజ్ వేరి ట్రెడిషనల్ అండ్ సెంటిమెంటల్ ఫెల్లో అని ఆ గది గోడలపై ఉన్న పెయింటింగ్స్ ఇంకా అపురూపంగా సేకరించబడిన కొన్ని దేవుడి చిత్రాలను చూసి అనుకుంటుంది గీత.

నిజానికి అని డ్రెస్సింగ్ మోడరన్ గా ఉన్నా ఎక్కడా వల్గర్ గా ఉండదు.

గీత డ్రెస్సింగ్ సినిమాలోని హీరోయిన్ ని ఇమిటేట్ చేసేటట్టు ఉంటుది. అప్పుడప్పుడు శృతి మించుతుంది కూడా.

కూతురంటే అతి గారాబం చేత గీత వాళ్ళ అమ్మా నాన్నా ఏమి అనరు.

"అనీ నువ్వు చూడడానికి మోడరన్ గా ఉన్నావ్ కానీ నీ రూం మాత్రం ఎంతో కళాత్మకంగా ట్రెడిషనల్ గా ఉంది" అని ఇంకా ఏదో చెప్పబోయే లోపు

"యా ఐయాం మోడరన్ బట్ మై థాట్స్ ఆర్ కంప్లీట్లీ ట్రెడీషనల్"

"నువ్వు ఇంత పాష్ గా ఉంటావు కదా నీకు బాయ్ ఫ్రెండ్స్ ఉన్నారా"

"ఐ హేవ్ మెనీ ఫ్రెండ్స్. నా ఫ్రెండ్స్ లో అబ్బాయిలు ఉన్నారు అమ్మాయిలు ఉన్నారు. బట్ వాట్ డు యు మీన్ బై బాయ్ ఫ్రెండ్స్"

"అదే సినిమాలలో చూపిస్తారు కదా బాయ్ ఫ్రెండ్స్ అంటే పబ్బులకి షికార్లకి వెళ్తారని, డేటింగ్ అవి ఇవి చేస్తారని"

"గీతా, యు ఆర్ సో ఇన్నోసెంట్, అవన్నీ ఒక లక్ష్యం లేని వాళ్ళ కాలక్షేపాలు. నాకున్న ఫ్రెండ్స్ అందరూ ఏదో ఒకటి సాధించాలనే

తపన ఉన్న వాళ్లు. మా అందరిదీ పవిత్రమైన స్నేహబంధం. అఫ్ కోర్స్ మేము కూడా సినిమాలకి ఇంకా ఔటింగ్స్ కి వెళ్తాం కానీ వి నో అవర్ లిమిట్స్. ఒక వేళ మాలో ఎవరికైనా ఎవరిమీదనైనా ప్రేమ పుడితే కచ్చితంగా చెప్పుకుంటాం. ఎందుకంటే లోపల ఒక ఫీలింగ్ బయట ఫ్రెండ్షిప్ అని ఎందుకు పవిత్రమైన స్నేహాన్ని పాడుచేయ్యటం."

".........."

"అండ్ వన్ మోర్ థింగ్ నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావో నాకు తెలుసు. సినిమాలు చూసి అడా మగా స్నేహం అని చాలా మంది చెడిపోతున్నారు. స్నేహం చెయ్యడం లో తప్పు లేదు. బట్ ఆ స్నేహానికి చెడ్డ పేరు తీసుకు వచ్చే పనులు చెయ్యకూడదు. ఈ ఇంట్లో దిగినప్పటి నుండి నిన్ను ఇంకా ఆ అబ్బాయెవరు ఎప్పుడూ నీతోటే ఉంటాడు కదా"

"రామ్స్"

"యా రామ్స్ ని అబ్జర్వ్ చేస్తూనే ఉన్నాను. మీ అమ్మానాన్నల ముందే మీరు హగ్స్ ఇచ్చుకోవడం లాంటివి చేస్తున్నా వాళ్ళు మిమ్మల్ని అదుపు చెయ్యలేదని కూడా గమనించాను. కనీసం వాళ్లైనా మిమ్మల్ని అదుపులో పెట్టి మంచి విషయాలు చెప్పి ఉండుంటే అత్తెసరు మార్కుల నుండి మీకు మంచి మర్కులైనా వచ్చేవి. జీవితం అంటే ఒక లక్ష్యం ఉండేది.

"బట్ అనీ వి ఆర్ చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్"

"స్టాప్ ఇట్ గీతా"

"అనీ"

"డోంట్ యు లవ్ హిం"

"అంటే"

"నిజం చెప్పు"

"యా ఐ లవ్ హిం సో మచ్"

"థట్స్ వై యు ఆర్ ఎంటర్టైనింగ్ హిం"

"తను నిన్ను లవ్ చేస్తున్నాడట"

"ఐ నో, మీరు మాట్లాడుకుంటుంటే అంతా విన్నాను. అందుకే ఇవాళ ఎంతో బిజీ గా ఉన్నా నువ్వు మాట్లాడతానంటే నేను ఒకే అన్నాను"

"మ్ చెప్పు"

"తను నిన్ను లవ్ చేస్తున్నాడట, ఈ విషయం నీతో చెప్పమన్నాడు"

"మరి నీ సంగతి"

"అడిగితే నేను జస్ట్ ఫ్రెండ్ అనే అంటాడు. నాకున్న ఫీలింగ్ అతనికీ ఉండాలని లేదుగా"

"ఇప్పుడర్థమయిందా. చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ అన్న పేరు ని ఉపయోగించుకుని తను నిన్ను తన జల్సాలకి వాడుకుంటున్నాడు. అఫ్ కోర్స్ చైల్డ్ హుడ్ ఫ్రెండ్స్ అయిన అబ్బాయి అమ్మాయి టీనేజ్ లో కి వచ్చాక కూడా పవిత్రం గా స్నేహంగా ఉండటంలో తప్పులేదు. కానీ ఇలా రాసుకు పూసుకు తిరగడాలు, హగ్స్ ఇచ్చుకోవడాలు ఏంటి అసహ్యంగా. ఇంత కష్టపడినా అతనికి నువ్వంటే ప్రేమ ఏర్పడదు. కేవలం తన విలాసాల కోసం నిన్ను వాడుకుంటున్నాడని గుర్తుంచుకో. ఇప్పటికైనా బుద్ధిగా చదువుకో.

ఐ యాం దేర్ టు హెల్ప్ యు ఇన్ స్టడీస్"

"థాంక్స్ అని"

"ఇంకో విషయం, ఈ బట్టలేంటి, ఎవరు సెలెక్ట్ చేస్తున్నారు ఇవన్నీ"

"రామ్స్, ఇలాంటి బట్టలలో నేను అనుష్కలా ఉంటానట"

"చూసావా, నీ మీద ఇతరులకి కూడా చెడు అభిప్రాయం కలిగేలా ఇలాంటి చెత్త బట్టలు వేయిస్తున్నాడు. బిల్ తనే పే చేస్తాడా"

"లేదు బయటకి ఎక్కడికి వెళ్ళినా బిల్ నేనే పే చేస్తాను"

"అనుకున్నాను వాడి వాలకం చూసి, నీ డబ్బులతో, నీతో వాడు బాగా ఎంజాయ్ చేస్తున్నాడు"

"అనీ నీకు రామ్స్ గురించి తెలియదు కాబట్టి ఇలా మాట్లాడుతున్నావు. తను చాలా మంచివాడు"

"మంచివాడా, తనకి నీ పైన ఏ అభిప్రాయం ఉందో నేను నిరుపిస్తాను. ఈ కాలనీలో ఉన్న పార్క్ కి నేను రమ్మన్నానని రామ్స్ కి చెప్పు".

"సరే అనీ"

***

"రామ్స్ గుడ్ న్యూస్, అని నిన్ను కలుస్తుందట"

"వాట్, నిజమేనా"

"అవున్రా, నిజమే"

"ఓహ్ ఎక్కడ కలుస్తుందట"

"ఈ కాలనీ లో ఉన్న పార్క్ కి నిన్ను సరిగ్గా ఇవాళ సాయంత్రం అయిదు గంటల కల్లా రమ్మంది"

"ఓకే, థాంక్ యు గీతా" అని ఫోన్ పెట్టేస్తాడు.

***

చెప్పిన సమయం కంటే అరగంట ముందుగా అనీ కోసం రామ్ పార్క్ కి వస్తాడు

అక్కడకి రెడ్ కలర్ చుడీదార్ లో వచ్చిన అనీ ని కళ్ళార్పకుండా రామ్ చూస్తూ ఉంటాడు

అనీ దగ్గరికి వచ్చి "హాయ్ రామ్స్, ఐ యాం అనీ" అని పరిచయం చేసుకుంటుంది.

"హాయ్ అనీ" అని షేక్ హ్యాండ్ ఇస్తాడు.

"నీ గురించి గీత నాకు చెప్పింది. నువ్వు నన్ను ప్రేమిస్తున్నావట కదా"

కొంచెం సిగ్గు పడుతూ "అవును" అని చెప్తాడు.

"మరి నాకు నీ మీద అనుమానంగా ఉంది"

"నా మీద అనుమానమా"

"అవును, నువ్వు గీత చాలా క్లోజ్ కదా"

"క్లోజ్ ఏంటి, అదే నా వెంట పడుతుంది"

"వ్వాట్"

"అవును అదే నా వెంట పడుతుంది. ఎన్ని సార్లు చెప్పానో చూడు మనం చిన్ననాటి ఫ్రెండ్స్ అయినా ఇలా రాసుకు పూసుకు తిరగకూడదు అని"

"అవునా"

"అవును అని, అస్సలు వినదే అలాంటి అసహ్యకరమైన బట్టలు వేసుకుని తిరుగుతుంది. మా అమ్మా నాన్న అయితే గీతతో ఫ్రెండ్ షిప్ మానుకోరా అని నస."

"అలాగా రామ్స్. ఇప్పుడు నా సందేహం తీరిపోయింది" అని అక్కడే పార్క్ లో ఒక చెట్టు చాటుగా ఉన్న గీత కి అర్థం అయ్యేటట్టు అంటుంది.

"రామ్స్ నా పెళ్లి కుదిరిపోయింది. ఈ విషయమే నీకు చెబితే నువ్వు టైం వేస్ట్ చేసుకోవని ఇక్కడికి పిలిపించాను" అని చెప్పి వెళ్ళిపోతుంది

***

అని ఇంటికి గీత వస్తుంది

"సారీ అనీ"

"ఎందుకు నాకు సారీ"

"నీ గురించి నెగటివ్ గా రామ్స్ కి చెప్పి నీ పై ప్రేమ ని పోగొట్టాలనుకున్నాను, కానీ నువ్వు నాకు జరుగుతున్న విషయాలు తెలియచేసి నా కళ్ళు తెరిపించావు, ఐ యాం రియల్లీ థాంక్ ఫుల్ టు యు"

"ఫ్రెండ్స్ మధ్య థాంక్స్ లాంటి ఫార్మాలిటీస్ ఉండవు"

అనగానే గీత అనీ చేయ్యపట్టుకుని కృతజ్ఞతాపూర్వకంగా నవ్వుతుంది.

***

ఆ మరునాడు రోజూలాగే తన స్కూటీ దగ్గర వెయిట్ చేస్తున్న రామ్స్ దగ్గరికి వచ్చి "రామ్స్ మేము ఈ మంత్ ఎండ్ వేరే ఇంటికి వెళ్ళిపోతున్నాము, సో ఇవాళ్టి నుంచే నువ్వు కాలేజ్ కి బస్ లో రావడం అలవాటు చేసుకో" అని మరో మాట వినకుండా డ్రైవ్ చేసుకుంటూ కాలేజి కి వెళ్ళిపోతుంది గీత.

తన మాటల వల్ల గీత లో వచ్చిన మార్పును గమనించిన అనీ సంతోషిస్తుంది.




హాయ్, నా పేరు మానస్. నన్ను ఎవరన్నా ఆమె గురించి నిలదీసినప్పుడు ఏమని చెప్పాలి? నేను చెప్పే కారణం ఎంత మంది అర్థం చేసుకుంటారో కానీ, నా ఆప్తులు అనుకునేవారు మాత్రం నా అంతరార్థాన్ని అర్థం చేసుకుంటారనుకుంటున్నాను. అందుకే వారితో ఆమె గురించి చెప్పాలనుకుంటున్నాను.

************

ఆదివారమంటే అందరికీ ఇష్టమైనది. ఆ రోజు ఎప్పుడొస్తుందా? అని సోమవారం నుండే ఎదురుచూస్తారు. కానీ జాబ్ కారణంగా హైదరాబాద్ లో ఒంటరిగా ఉంటున్న నాకు మాత్రం ఆ రోజంటే చాలా భయంగా వుండేది. ఎందుకంటే ఆ రోజు ఒంటరితనం నన్ను ఎంతగా హేళన చేస్తుందో తెలుసు కాబట్టి.

ఆ ఒంటరితనాన్ని ఓడించడానికి నేను వేసిన పధకం ఆ రోజు లైబ్రరీకి వెళ్లి బుక్స్ చదువుకోవటం. అలా బుక్స్ చదువుకోవటం అలవాటు అయ్యాక, ఆదివారమంటే భయం పోయింది.

అలా ఓ ఆదివారం లైబ్రరీ లో ఉన్నప్పుడే పరిచయం అయ్యిందామె. ఎంత అందంగా అనిపించింది ! కలిసిన మొదటిసారే....సముద్రపు నీటి ఆకుపచ్చని రంగు చుడీదార్. టైట్ గా వేసుకున్న పోనీటైల్. ఏ మాత్రం ప్రత్యేకంగా అలంకరణ చెయ్యకపోయినా ఏదో తెలీని హుందాతనం తనలో వుంది.

ఎందుకో, పరిచయం అయిన ఆ క్షణం నుండే ఆమె అంటే ప్రత్యేకమయిన ఆకర్షణ. ఆమె గురించి తెలుసుకోవాలనే తపన ఆదివారం మీద ఆసక్తి వచ్చింది.

ఆమె పుట్టి పెరిగిందంతా హైదరాబాద్ లోనే అట. నేను హైదరాబాద్ వచ్చి సంవత్సరం అవుతుంది. కానీ ఈ సంవత్సర కాలంలో ఎందుకు కలుసుకోలేక పోయాను?

ఆమె, నేను దాదాపు ఒకే వయసు వాళ్ళం. కాలేజ్ లోనే పరిచయం అయ్యి వుంటే ఎంత బావుండేది ? కానీ దేవుడెందుకు మేము కలవడం ఇంత ఆలస్యం చేసాడు?

విచిత్రం ఏమిటంటే తనుకూడా లైబ్రరీకి రెగ్యులర్ గా వస్తుందట. అయినా ఆమెను కలవటానికి ఇంత టైం పట్టింది.

'నేనైతే ప్రతీ ఆదివారం లైబ్రరీకి వస్తానని మీరు కూడా తప్పక రావాలని' ఆమెను అడిగాను. "ష్యూర్ ... మిస్ కాకుండా చూసుకోవాల్సింది మీరే" అందామె. అలా మా మొదటి పరిచయం పూర్తయింది.

అప్పటినుండి ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడడంలో అసలు రోజులెలా గడుస్తున్నాయో తెలియకుండా అయిపోయింది. ఇంతకుముందు వరకు దేని గురించైనా అన్వేషణ వుంటే మిగతా విషయాలపై ఆసక్తి పోతుంది అనుకునేవాణ్ణి. కాని విచిత్రంగా నా జాబ్ పెర్ఫార్మన్స్ ఇంకా పెరిగింది. ఇప్పుడు నేను జాబ్ లో బాగా వుంటే ఆమెను కలిసినప్పుడు ఇదొక విశేషంగా చెప్పొచ్చు. మనసంతా ఆమె మీద పెట్టొచ్చు.

ఎదురుచూస్తుండగానే ఆదివారం రానే వచ్చింది. నేను లైబ్రరీకి వెళ్ళేటప్పటికే ఆమె ఎదురుచూస్తూ కూర్చుంది. ఆమెను చూడగానే, నాకెందుకో ఆమె అంతవరకూ ఎవరితోనో మాట్లాడింది అనిపించింది.

"నేనింతవరకూ ఎవరితోనో మాట్లాడానని అనుకుంటున్నావ్ కదూ?" ఆమె అలా అన్నందుకు నాకెందుకో అబద్ధం చెప్పాలనిపించలేదు. 'అవును' అనే చెప్పాను.

'థాంక్స్ !! నిజాయితీగా ఒప్పుకున్నందుకు. నీతో అతని గురించి పూర్తిగా చెప్పాలనుకుంటున్నాను.' అని నేనొచ్చేవరకు మాట్లాడుతుందనుకున్న అతని గురించి చెప్పటం మొదలుపెట్టింది.

అతని పేరు రాజీవ్. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివేటప్పుడు ఇక్కడే లైబ్రరీలో కలిసాడు. మా ఇద్దర్నీ కలిపింది - లియో టాల్ స్టాయ్ రాసిన 'వార్ అండ్ పీస్' అనే పుస్తకం.

"పుస్తకమా ?"

"అవును .. ఆ పుస్తకం కోసం అడిగితే ఒకతను తీసుకుని వెళ్ళాడని చెప్తుండగానే రిటర్న్ చెయ్యడానికి తిరిగొచ్చాడు. ఆ పుస్తకం చూడగానే అతని చేతుల్లోంచి నేరుగా తీసుకున్నాను. అతను ఓ క్షణం ఆశ్చర్యంగా చూసి గట్టిగా నవ్వాడు. అదే మా మొదటి పరిచయం. అప్పుడతను ఎం బి ఎ మొదటి సంవత్సరం."

ఇప్పుడతను నాకు సీనియర్. అంటే మా పరిచయం అయ్యి సంవత్సరం అయ్యింది.

సంవత్సరం అయ్యిందా? ఇదే లైబ్రరీ లోనా? ఇప్పుడతను సీనియరా? అంటే అతనికోసమే ఆతను చదివిన కాలేజ్ లో జాయిన్ అయ్యవా? అని అడిగాను.

అరె. భలే కనిపెట్టేసావే ! నిజానికి బెంగళూరులో ఎం . బి. ఎ చేయ్యలనుకునేదాన్ని. కానీ రాజీవ్ వల్ల ఇక్కడే హైదరాబాద్ లో చేస్తున్నా!

ఏమిటీ ..? రాజీవ్ వల్ల ఇక్కడ చేస్తున్నావా? అంటే మీ ఇద్దరూ ??.....?? మీరు అంటూ సందేహంగా అడిగాను.

అవును .. మేమిద్దరం ప్రేమించుకుంటున్నాము. అతను ఆల్రెడీ కేంపస్ లో సెలెక్ట్ అయ్యాడు. బెంగళూరు లో జాబ్!

అంటే హైదరాబాద్లో కాకుండా బెంగళూరు లోనే ఎమ్. బి. ఎ చేసుంటే బాగుండు అని ఇప్పుడు అనుకుంటున్నావ్ కదూ?

అవును. కానీ ఏం చేస్తాం ? కొన్ని సార్లు సరైన ఆలోచన వుండదు. నాక్కూడా ఎం . బి. ఎ అయ్యాక, మా మ్యారేజ్. ఇంట్లో అందరూ ఒప్పుకున్నారు. రాజీవ్ జాబ్ కి వెళ్లేముందు మా ఎంగేజ్మెంట్.

ఆమె ఆ విషయం చెప్పినప్పటి నుండి ఆమె గురించి ఊహల్లో స్వేచ్చా విహంగం కోల్పోయింది.

అయినా ఆమె గురించి ఏదో తెలియని ఆసక్తి. ఆమె కూడా నన్నెప్పుడూ నిర్లక్ష్యం చెయ్యలేదు.

కొన్ని రోజుల తరవాత రాజీవ్ బెంగళూరు వెళ్ళిపోయాడు. మిగిలిన సంవత్సరం పాటు ప్రతీ ఆదివారం కలుస్తూనే వున్నాం. ఎప్పుడూ రాజీవ్ గురించే చెప్తుండేది. నా మ్యారేజ్ గురించి అడుగుతుండేది. త్వరలోనే అని చెప్పేవాడిని.

అంతలోనే సంవత్సరం గడిచిపోయింది. ఆమెకు వివాహం కూడా అయ్యింది.

నెల రోజుల తరవాత నాకు కూడా మ్యారేజ్ అయ్యింది.

మా మధ్య కమ్యునికేషన్ కూడా తగ్గిపోయింది. అయినా ఎందుకో అంత బాధగా అనిపించేది కాదు. ఎందుకంటే ఆమె తనకిష్టమైన రాజీవ్ తో వుంది. రాజీవ్ ఆమెను ఏంతో ప్రేమగా చూసుకుంటాడన్న నమ్మకం ఓ కారణమయితే, మరోవైపు నేను కోరుకున్న లక్షణాలు, ఆశించినంత ప్రేమించే భార్య దొరకటం మరో కారణం.

మేరేజ్ అయిన తరవాత కూడా ఇంతకుముందు లా మాట్లాడటం కానీ, మాట్లాడాలని ప్రయత్నిచటం గానీ చెయ్యటం మంచిది కాదని అభిప్రాయపడ్డాను.

నా జీవితంలోకి వచ్చిన భార్య, కొత్త జీవితం, ఆమెను నేను, నేను ఆమెను అర్ధం చేసుకోవటానికి, ఇద్దరి మధ్య ఒక అవగాహన రావటానికి, ఒకరినొకరు ప్రేమించుకోవటానికి ఎంతో సమయం పట్టలేదు.

జీవితం, గత కాలపు గాయాలని, వర్తమానంలో వుండే అనుమానాల్ని, భయాల్ని అధిగమించి జీవితం ప్రశాంతం గా, ఆనందంగా నడుస్తుండగా, ఓ రోజు ఆమె నుండి ఫోన్ కాల్ వచ్చింది.

ఆ ఫోన్ కాల్ తో నేను ఊహించిన ప్రపంచమంతా మారిపోయినట్టయింది. ఆమె రాజీవ్ కి దూరంగా వున్న ఆ సంవత్సర కాలంలో రాజీవ్ కి మరో అమ్మాయితో పరిచయం అయ్యిందంట ! ఆ పరిచయం ఎంతవరకు వెళ్లిందంటే ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకునేంత. కానీ చివరి క్షణంలో తనకా ఉద్దేశ్యం లేదని చెప్పడంతో రాజీవ్ ముందు నిర్ణయించినట్టు గానే ఆమెనే పెళ్లి చేసుకున్నాడు గానీ ఆమె ఊహించినట్టు ఆమె జీవితం లేదట !

ప్రేమ వివాహం అంటే ఎప్పుడూ ప్రేమ వుంటుంది అనుకోవటం పొరపాటు. ఒక వివాహం విజయవంతం కావాలంటే పెళ్ళికి ముందు ప్రేమ, స్నేహం వుందా అన్నది ఎంతవరకు సహకరిస్తుందో తెలీదు కానీ, పెళ్లి తరవాత ప్రేమ లేకపోతే జీవితం సంతోషంగా, ప్రశాంతం గా ఉండదని గతంలోని ప్రేమ ఎందుకూ పనికిరాదనీ ఆమెకు స్పష్టం గా తెలుస్తుంది.

గతంలో నైనా ఆమె రాజీవ్ కి ప్రేమికురాలు అనే నమ్మకం తో, ప్రస్తుతం ఎన్ని ప్రయత్నాలు చేసినా రాజీవ్ లో ఎలాంటి మార్పు లేదని ఫోన్లో వాపోయింది.

రాజీవ్ కేవలం పరువు కోసం, సమాజంలో గౌరవం కోసం మాత్రమే తనని భార్యగా చేసుకున్నాడు కానీ పెళ్లి నాటికే అతనిలో తనపై ప్రేమ చచ్చిపోయిందని ఆమె తెలుసుకోవటానికి ఎంతో టైం పట్టలేదు.

ఆమె ఫోన్ కాల్ తరవాత చాలా బాధ అనిపించింది. నేనింతకాలం ఆమె సంతోషంగా వుందని ఊహించిందంతా కేవలం భ్రమ మాత్రమే అని తెలిసి జీర్ణించుకోవడం ఏంతో కష్టంగా వున్ది.

ఆమె గురించి ఆలోచిస్తూనే నిద్ర పోవటానికి ప్రయత్నించాను. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. పక్కనే వున్న నా భార్య వైపు చూసాను. నేను ఏదో బాధతో నిద్ర పోవట్లేదని అనుకుందో ఏమో .... ఆమె కూడా నిద్ర పోలేదు.

అసలు భార్యని పక్కన ఉంచుకుని మరో స్త్రీ గురించి ఆలోచించటం కరక్టేనా? కానీ నేను తప్పుగా ఆలోచించట్లేదు కదా? కేవలం మానవత్వంతోనే కదా నేనాలోచించేది. ఒకప్పటి నా స్నేహితురాలిగానే కదా ... నేను ఆలోచించేది ... ? ఒకవేళ మగాడయితే, స్నేహితుడైతే, అప్పుడు అతని గురించి ఆలోచించటం తప్పు కాదేమో? కానీ స్నేహితుడైతే, స్నేహితురాలి గురించి ఆలోచించినట్టు ఇంతలా ఆలోచించే వాడినేనా?

ఇలా ఎన్నో ప్రశ్నలు ... ? కానీ ఆమె సమస్యలు తీరిపోవాలి. రాజీవ్ తనని ప్రేమగా చూసుకోవాలి. అని దేవుణ్ణి వేడుకుంటూ ఎప్పటికో నిద్ర పోయాను.

తరవాతి రోజు రాత్రి మళ్ళీ ఆమె నుండి ఫోన్ వచ్చింది. తనక్కడ పనిమనిషి లాగా ఉండలేనని, నాతో , నా దగ్గర వుండలనిపిస్తోందని ఫోనేలోనే ఏడ్చేసింది.

నేను సమాధానం ఇవ్వకుండానే తానే మాట్లాడింది.

నాకు తెలుసు... నేనంటే నీకు ఇష్టమని. కేవలం నేనే నిన్ను మిస్ చేసుకున్నాను. నువ్వు పెళ్లి చేసుకున్నా నా గురించే ఆలోచిస్తున్నవని నాకు తెలుసు. కానీ ఇప్పుడు మాత్రం మనం విడిగా బ్రతకాల్సిన అవసరం లేదు. అలాగే నువ్వు నీ తల్లి తండ్రులని కానీ, భార్య ని కానీ, ఈ సమాజాన్ని కానీ పట్టించుకోవనీ నాకు తెలుసు. అందుకే నీమీద నమ్మకం తో రేపే నేను

వచ్చేస్తున్నాను అని ఫోన్ పెట్టేసింది.

తనలా మాట్లాడుతుందని అస్సలు ఊహించలేదు. ఛ ! ఎందుకిలా మాట్లాడింది ? నేను ఎవ్వర్నీ పట్టించుకోనా? ఎందుకు పట్టించుకోనూ ? పట్టించుకోకపోవటానికి వారిలో కానీ, వారి ఆలోచనల్లో కానీ నిజం లేకపోతే పట్టించుకోకపోవచ్చు. నా మీద నిజం కాని అభాండాలు, అనుమానాలు వున్నప్పుడు పట్టించుకోవాల్సిన పనిలేదు. కానీ ఎవ్వర్నీ పట్టించుకోకపోవటానికి ఎలాంటి కారణాలు లేవు. నిజానికి బలమైన కారణాలు వున్నా ఆలోచిస్తాను.

అసలామె నాతో 'ఇలా మాట్లాడింది అనేదే ' అబద్ధం అయితే బాగుండు.

ఏమిటీ నా భార్యని వదిలేసి తనతో వెళ్లిపోవాలా? అసలు నేను ఎలా వున్నానని ఓ ప్రశ్న అయినా అడిగిందా? అంటే నన్నెంత తక్కువగా అంచనా వేసింది.

అందుకే వెంటనే ఫోన్ చేసి ఆమెతో ఈ విషయాలన్నీ చెప్పాను. ఒకరకంగా తిట్టాను. నా పరిస్థితి బాగా వున్నా, నా కోసం బ్రతికేవాళ్లున్నా, నీ కోసం వచ్చేయాలా? అని నిలదీశాను. తన మీదున్న అభిమానం కాదు కదా, ఇప్పుడు జాలి పడి కూడా తప్పు చేసానని గట్టిగా అరిచాను. 'నా భార్య నన్నెంత ప్రేమిస్తోందో తెలుసా? ఆమెకు ద్రోహం చేసే ప్రసక్తే లేదు.' అని అరుస్తుండగా నా భార్య నిద్రలేపింది.

అంటే ఇదంతా కలా ?     అంటే అర్ధరాత్రి ఆమె ఫోన్ చెయ్యలేదా? అవును, ఇదంతా కేవలం నా భ్రమ. ఆమె అలాంటి స్వార్ధపరురాలు కాదు. అంటే ఆమె మీదున్న అభిమానం, గౌరవం పోగొట్టుకోవాల్సిన సంఘటనలేవీ జరగలేదన్నమాట.

' థాంక్ గాడ్ ' అని బయటకే అనేసాను.

పక్కనే వున్న నా భార్య నాకు టీ అందిస్తూ "మరి థాంక్ డార్లింగ్ ఉండదా ....?" అంది. "గాడ్ కి థాంక్స్ చెప్పిందే నీలాంటి భార్యని ఇచ్చినందుకు" అన్నాను.

"అది సరే కానీ ఈరోజు ఆదివారం. మీరు లైబ్రరీకి వెళ్ళాలి కదా ? లేచి తయారవ్వండి. పెళ్లి తరవాత ఆమె కథ ఏమయ్యిందో,

ఎలా ఉందో? ఈ రోజు నాకు చెప్తా అన్నారుకదా ! " అని నా ఆదివారం కార్యక్రమం గుర్తుచేసింది.

ఒకవేళ నేను కలకన్నది, నిజంగా జరిగితేనో ??!! నో ! అల జరిగితే ఆమె మీదున్న అభిప్రాయం మారిపోతుంది.

అలా జరక్కూడదంటే - అది నా చేతిలోనే వుంది. అందుకే నా భార్య తో చెప్పాను. - "ఆమె కధ" చదవటం మానేస్తున్నానని.




అం దాల తార ఆర్. ఆర్. లాబ్ లో సీనియర్ సైంటిస్ట్. ఎమ్. ఎస్. సి. కెమిస్ట్రీ లో గోల్డ్ మెడలిస్ట్. నాజూకుగా తమలపాకు

కాడలా ఉంటుంది. హైట్ ఫైవ్ సిక్స్. సెక్సీగా ఉంటుంది. రకరకాల బట్టలు వేసుకుంటుంది. టైట్ జీన్స్ పాంట్ లే కాకుండా షార్ట్ స్కర్ట్స్ కూడా వేసుకుని వస్తుంటుంది డ్యూటీలోకి. ఒక్క ముక్కలో చెప్పాలంటే పాశ్చాత్యదేశంలో ఉండే హై సొసైటీ లో గర్ల్ లా ఉంటుంది.

'ఒళ్ళు దాచుకోవడమే కాదు... నోట్లో నువ్వుగింజ కూడా నానదు తారకు' అని ఆమె సహోద్యోగినులు చెప్పుకొంటుంటారు. తార మాత్రం వీళ్ళ మాటలనే కాదు... వీళ్ళను కూడా పట్టించుకోదు. కాని తార రీసెర్చ్ చేస్తున్న కీలకమైన లాబ్ ఇన్ చార్జ్ మాత్రం తార గురించి బాగా పట్టించుకుంటాడు. ఆమె ఆడింది ఆట... పాడింది పాట అంటాడు రఘునాథ్. డాక్టర్ రఘునాథ్, డా.ర.గా చెలామణిలో ఉన్నాడు. నల్లగా భూతద్దాలు లాంటి కళ్ళద్దాల వెనుక గుండ్రని చిన్న కండ్లు, ఎత్తైన పళ్ళుతో! ఆ పైన లావైన పెదాలు. బట్టతల బుర్ర మాత్రం అమోఘం! అమెరికన్ న్యూక్లియర్ సంఘం వారు ఎన్నిసార్లు ఆహ్వానించినా, అమెరికాలో చీఫ్ సైంటిస్టుగా, ససేమిరా ఒప్పుకోలేదు!?

అదే లాబ్ లో పనిచేస్తున్న జూలి మాటల్లో అర్థం చేసుకోవాలనుకుంటే ఆ నల్ల పీనుగు తార ఎత్తు - పల్లాల శరీరాకృతిలో ఎప్పుడో సమాధి అయిపోయాడు అని అక్కసు వెళ్ళ బుచ్చుకొంటుంది. ఆమె చుట్టుప్రక్కల వాళ్ళు జూలి మాటలు విని ఎంజాయ్ చేస్తుంటారు.

కొన్ని రోజుల క్రితం డా.ర. అహోరాత్రులు శ్రమించి, చేసిన రిసెర్చి ఫలించడంతో, సంతోషంతో తనకు తానే మైమరచి ఎదురుగా ఉన్న తారను గట్టిగా ముద్దుపెట్టుకొన్నాడు, స్టాఫ్ ఎదురుగానే! 'సైంటిస్ట్ కదా!' ఎంతో విలువైన విషయాన్ని కనిపెట్టాడు. దేశానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. పైగా డా.ర. గారు తీసుకున్నది ముద్దే కదా! పట్టించుకోనక్కర్లేదు.' అని మగ ఉద్యోగస్తులు సరిపుచ్చుకున్నారు. కాని ఆడ ఉద్యోగస్తులు, అందులో జూలి బాగా నొచ్చుకుంది... తార కంటే డా.ర. గారికి అందుబాటులో తనే ఉన్నదని... కాని తనను కాకుండా తారనందుకున్నాడని వాపోయింది!

ఈ గొడవంతా తెలిసి ఉన్న 'స్మార్ట్ యిన్ ల్యాబ్' గా టైటిల్ అందుకున్న గోపతికి మాత్రం డాక్టర్ కనుగొన్నదేమిటి? కనిపెట్టింది ఏమిటి? అనే కుతూహలం తారాస్థాయికి చేరుకుంది.

లాంగ్ టైం గర్ల్ ఫ్రెండ్, క్లబ్బుల్లో తిరిగి, పేరొందిన హోటళ్ళలో విలువైన కాఫీలు తాగి, గంటల తరబడి ఏకాంతంలో గడిపి, భవిష్యత్తు ప్లాన్ లు వేసుకున్న తార తనతో ఉండగా ఇదెంత పని అని అనుకొన్నాడు గోపతి. తార డాక్టర్ రఘునాథ్ కు చీఫ్ అసిస్టెంట్ కూడా. తన పరిశోధనలన్నీ తారకు వెల్లడిస్తుంటాడు. అడపాదడపా ఆమెను బుజ్జగించి లో విషయం బయటికి తీస్తుంటాడు గోపతి.

గోపతి ఓ రిసెర్చ్ జర్నల్ పేజీలను త్రిప్పుతూ తార కోసం ఎదురు చూడసాగాడు. డ్యూటీ టైం పూర్తయి గంటకు పైబడింది. తార తన వర్కింగ్ టేబుల్ వదలట్లేదు.

గోపతి సహనం కోల్పోయాడు. తన చాంబర్ వదిలి తార గదివైపుకు వెళ్ళసాగాడు. ఇంతలో డాక్టర్ రఘునాథ్ తార గదిలోకెళ్ళి ఏదో సైగ చేశాడు. ఆమె తన బీరువా తెరచి, అందులో ఉన్న లాకర్ తెరిచింది. డా.ర. తన వైట్ కోట్ జేబులో నుంచి ఏదో చిన్న డబ్బాలాంటిది తీసి అందించాడు ఆమెకు. తార దాన్ని తెరచి చూసింది. ఇద్దరు నవ్వుకున్నారు. తార లాకర్ లో ఆ చిన్న డబ్బాను పెట్టి లాక్ చేసింది. గోపతి ఇదంతా అద్దాల తెర నుంచి గమనించి, వాళ్ళ దృష్టి తనపై పడకముందే అక్కడ్నుంచి తప్పుకున్నాడు.

****　　****　　****　　****

ఫిబ్రవరి 14, వాలన్ టైన్ డే! ఇంతకంటే మంచి సమయం, సందర్భం దొరకదు. తార కాదనదు. విలువైన బహుమానం... ఆమెకు పెట్టుబడిగా ఇస్తున్నాడు లక్షల ఖరీదు చేసే వజ్రాల ఉంగరం!

చక్కగా తీర్చి దిద్దిన, నైపుణ్యంగా చెక్కబడిన వజ్రం, ఎర్ర వజ్రం పొదిగిన ఉంగరం. ఎదురుగా, డిమ్ లైట్ లో, ఫ్లవర్ పేజ్ లో ఎర్ర గులాబి తార కోసం ఘడియ లెక్కిస్తుంది.

తన దగ్గరున్న బ్యాంక్ బ్యాలెన్స్ మొత్తం విత్ డ్రా చేసి విలువైన తన నాన్నగారి చేతి గడియారాన్ని అమ్మేసి, తన గదిలో ఉన్న ఖరీదైన సామాగ్రిని బేరం పెట్టి పోగు చేసుకున్న డబ్బులన్ని తార కోసం, లవ్ డే　సందర్భంలో తీసుకొన్న బహుమానం తన దుర్దినాలను హరించేసుకొంటుంది!　అని అనుకున్నాడు గోపతి.

తార ఎర్ర రంగులో వెలసింది. మసక మసక ఎర్ర రంగు కాంతి లో ఆమెను వాటేసుకున్నాడు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న కాఫీ టేబుల్ గది లాంటి గదిలో. తన లాంటి ప్రేమ జంట లెందరో ఉన్నారా హోటల్లో... ప్రత్యేకంగా జంటల కోసం ఏర్పాటు చేసిన స్థలాల్లో!

ఒకరి కొకరు ప్రేమ పాఠాలు వల్లించాక, గోపతి అసలు విషయం పై రంగం సిద్ధం చేశాడు. రెండు రోజుల క్రితమే లాబరేటరీస్ క్యాంటీన్ లో మధ్యాహ్నం లంచ్ సమయంలో డాక్టర్ రఘునాథ్ కనిపెట్టిన సీక్రెట్ ను తారను బుజ్జగించి కక్కించాడు.

ఆ రాత్రంతా ఒక్క క్షణం నిద్రపోలేదు. ప్లాన్ పై ప్లాన్ లు వేసుకో సాగాడు.

తారను తన సీసాలో దింపాలి! ఎలా? కొన్నాళ్ళ నుంచి తారతో తన స్నేహం మరీ చొరవ చేసుకుంది. పెళ్లి చేసుకోవడం వరకు వెళ్ళింది. కానీ రాజీ తమకు అడ్డుగోడై నిలిచింది.

తార ససేమిరా ఒప్పుకోవడం లేదు పెళ్ళికి. రాజీ సమక్షం భరించలేనంటుంది.

తార లేని తన జీవితం కటిక చీకటిలా ఉంది!? రాజీతో తనకు పెళ్ళికాక ముందు నుంచే తారతో తనకు సంబంధం ఉంది. ఒకే కాలేజీలో చదివారు తార మరియు గోపతి.

గోపతి చిన్నప్పట్నుంచే గారాబంగా పెరిగిన తమ తల్లిదండ్రులకు ఏకైక బిడ్డ.

కాలేజీ రోజుల వరకు జీవితం లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా గడిపాడు. తండ్రి పట్టణం లో పేరొందిన బిజినెస్ మ్యాన్. ఇంటి ముందు ఇంపోర్టెడ్ మెర్సిడెస్ ఉండేది. కాలం హాయిగా గడుస్తున్న రోజుల్లోనే గోపతి నాన్నగారు, కారు యాక్సిడెంట్ లో పోయారు. గోపతి అమ్మ భర్త అకాలమరణాన్ని మరవలేక మంచం పట్టి సంవత్సరం పూర్తవ్వకుండానే తనువు చాలించింది.

తను ఏకాకి అయ్యాడు. ఆ రోజుల్లోనే తార తనకు దగ్గరైంది. ప్రేమ జీవితంలో చాలా దూరం వరకు ప్రయాణించాడు. గమ్యం చేరుకొంటుండగానే మేనమామయ్య గారి అమ్మాయితో పెళ్లి కుదిరింది గోపతికు. తార లాంగ్ లీవ్ తీసుకుంది. జీవితం మరో మలుపు తీసుకుంది!

రాజీ కోట్లాధికారి అయిన గోపతి మేనమామకు ఒక్కగానొక్క కూతురు. ఆయనకు ఉన్నదంతా రాజీకే దక్కేది! కాని తన చేతికి చిల్లిగవ్వ తగలట్లేదు. రాజీ పొగరుతనం, నడవడిక తనకు నచ్చలేదు. రాజీతో పెళ్ళయ్యాక గోపతికి మనశ్శాంతి కరువైంది.

తారతో మళ్ళీ లింక్ కుదిరింది ఆమెతో మనస్పర్ధలు తగ్గాయి. మంచి కొలీగ్స్ గా మసలుకోసాగారు.

ఈ నేపధ్యంలో గోపతి తారకు నచ్చజెప్పాలని నిశ్చయించుకొనే ఈ ఏర్పాటు చేసాడు. 'వేలంటైన్ డే' ఆమెతో గడపడం కేవలం తన ప్లాన్ ను అమలు పరచడమే!

"నేనో మంచి అమ్మాయిని కాదని నాకు బాగా తెలుసు! కాని నువ్వు చెప్పుతున్న, నన్ను బలవంతం చేస్తున్న పనికి నా మనసు ఒప్పుకోవడం లేదు? ఒక్క చుక్క కూడా ఏ టెర్రరిస్టుల చేతికి అందినా వందల వేల సంఖ్యలో జనాలు తమ ప్రాణాలను కోల్పోతారు.

"ఏ క్రిమినల్స్ చేతికి తగిలిన ... ఎవ్వరినైన హత్య చేయవచ్చు ఒక చుక్క వెయ్యి లీటర్ల నీటిని విషద్రవం లా మారుస్తుంది! ఏ ఎఫ్. బి. ఐ. యో లేదా సి. బి. ఐ లాంటి ఏజెంట్స్ కు పండుగే... పండుగ. అంతర్జాతీయ కల్లోలాలను సృష్టించగలరు!

"సో... అబ్బాయిగారు... తమరు ఈ విషయానికై వేధించకండి!" అని రెండు చేతులను జోడించి చిన్నగా నవ్వింది.

" మీ బాస్ కనిపెట్టిన ద్రవం కొన్ని కోట్ల డాలర్లకు పైనే ఉంటుంది. నేను కాదనటం లేదు. నాకు కావలసింది ఒకే ఒక చుక్క.... డ్రాప్... ఓన్లీ! దానికి.. ఒక లక్ష నేను నీకు సమర్పిస్తున్నాను!! ఆలోచించుకో... అదృష్టం కలిసొస్తే నా కొచ్చే కోట్ల ఆస్తికి వారసులవుతావు! నా జీవిత భాగస్వామి కాగలవు.

"ఒక వేళ నా ప్లాన్ అనుకున్న విధంగా ఫలించలేదనుకో... నువ్వు ఏలాగో లక్షాధికారివే! ఆలోచించుకో... కేవలం ఒకే ఒక చుక్క... నేను తెచ్చిన హేండ్ బ్యాగ్ లో క్యాష్ లక్ష రూపాయలు ఉన్నాయి!"

"నీ ప్లాన్ సక్సెస్ అయినా ఫ్లాప్ అయినా ఐ డోంట్ కేర్! ఒక చుక్క దొంగిలించిన నేరానికి నా బ్రతుకు ఏమవుతుందో ఆలోచించావా...?" కండ్లు మిటకరిస్తూ అంది తార.

"ఒకే ఒక చుక్క ఆ సీసాలో నుంచి మాయమైనా ఎవరికి ఏమి తెలియదు ఈ చుక్క వల్ల నీ.. నా అదృష్టం తారాస్థాయికి చేరుకొంటుంది. పైగా టి. బి రోగంతో బాధపడుతున్న మీ అమ్మ, పై చదువులకు వెళ్ళాలని తహతహలాడుతున్న మీ తమ్ముడు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మధ్యలో ఆపేసి... పెండ్లి కోసం ఎదురు చూస్తున్న మీ చెల్లాయి... రిటైరైన మీ నాన్నగారు తీవ్ర గుండెపోటుతో

ఇంకెంత కాలం అని బాధపడతారు... ఆలోచించుకో! ఇలాంటి శుభఘడియలు మళ్ళీ... మళ్ళీ రావు!? అని బుజ్జగించాడు, నచ్చ జెప్పాడు, చేతులో చెయ్యేసి వాగ్దానం చేశాడు. తార చేతిని తన తలపై పెట్టుకొని ప్రమాణం చేశాడు. తార పెదవులపై చిన్న చిరునవ్వు విచ్చుకుంది!?

**** **** **** ****

అర్ధరాత్రి... రెండు గంటలు గోడగడియారం కొట్టింది. దబదబా గట్టిగా తలుపు పై కొట్టుతున్న శబ్దం. చిన్న అలజడికే గోపతి నిద్ర భంగమయ్యేది! ఇంత గట్టిగా తలుపు చప్పిడి అవుతుందంటే పని అయిపోయిందన్న మాట..? అనుకొంటూ పడకలో నుంచి లేచి తన గది తలుపు తీశాడు. ఎదురుగా నర్స్?

"డాక్టర్ గారు, మీ మావయ్య గారు వెంటనే మిమ్మల్ని రమ్మంటున్నారు." అని అంది గాబరాపడుతూ.

"ఏమైంది? ఏమైనా సీరియసా? నిదానంగా అడిగాడు

"మేడమ్ గారు నిద్రలో చాలా అవస్థలు పడుతుంటే... డాక్టర్ గారిని పిలిచాను. మీతో మాట్లాడుతారట..? అంటూ పరుగెత్తుకొంటు వెళ్ళిపోయింది నర్స్.

రాజీ నూరు ఆరైన.. ఆరు నూరైన ఫ్యామిలీ డాక్టర్ గారు చెప్పిన ప్రకారం రాత్రి... నిద్రపోయే ముందు ఓ క్యాప్ సూల్ తప్పక వేసుకొంటుంది. అదును చూసి ఆమె మంచం ప్రక్కనే స్టూల్ మీద ఉన్న మందు సీసాలో మిగిలి ఉన్న నాలుగు క్యాప్ సూల్ ను తీసి ఒకదానిలో తాను తెచ్చిన బొట్టు అందులో వేసి తిరిగి క్యాప్ సూల్ ను మూసివేశాడు. ఓ రెండు క్షణాల కోసం రాజీకి అనుమానం కలిగినా... తెల్లారాక ఆరా తీద్దాం లే అనుకునే గుణం కాబట్టి అంతగా పట్టించుకోదు పైగా విధిగా... ఉన్న ఆ ఒక్క క్యాప్ సూల్ మాత్రం మింగేస్తుంది... అందుకే ఈ హడావుడి అయి ఉంటుందనుకొంటు హాలు దాటి రాజీ పడక గదిలో ప్రవేశించాడు గోపతి.

లోపలికి ప్రవేశించగానే రాజీ మొహం వైపు చూశాడు గోపతి. రాజీ గాఢ నిద్రలో ఉన్నట్లనిపించింది. రాజీ పాదాలను నర్స్ తన చేతులతో మసల సాగింది.

గోపతి మరియు రాజి ఇద్దరి వైపు చూస్తూ "గోపతి... రాజికి మైల్డ్ అటాక్ వచ్చింది. నీ కసలే టెన్షన్ ఎక్కువ... పైగా నువ్వు డిప్రెషన్ పేషంట్ వి. ఇందా ఈ క్యాప్ సూల్ వేసుకో నీకు ఉపశమనంగా ఉంటుంది" అని ఫ్యామిలీ డాక్టర్ అందించాడు.

గోపతి గాబరా పడుతున్నట్లు నటిస్తూ పొరపాటులో డాక్టర్ ఇచ్చిన క్యాప్ సూల్ మింగేశాడు. నర్స్ ఓ గ్లాసులో మంచినీళ్ళు అందించింది. గోపతి నీళ్ళు త్రాగుతూ ఖాళీగా ఉన్న క్యాప్ సూల్ సీసాపై కన్ను పడింది.

హమ్మయ్య అనుకొంటూ గట్టిగా ఓ ఊపిరి పీల్చాడు గోపతి. "అయ్యో... పాపం... తెల్లారే వరకు రాజి ఎలా ఉంటుంది? ఎందుకైనా మంచిది డాక్టర్ గారు అంబులెన్స్ తెప్పించి, పెద్ద ఆస్పత్రిలో చేరిస్తే బాగుంటుందేమో! మామ గారు... ఏమంటారు మీరు?" అంటూ కన్నీరు తడబెట్టుతూ అడిగాడు గోపతి.

"నువ్వేం బెంగ పడనక్కర్లేదు. అమ్మాయి ఈ రోజు చాలా అలసిపోయింది. గదినంతా తనే శుభ్రం చేసి చక్కగా తీర్చిదిద్దింది. రాత్రి భోజనం కూడా చేయలేదు. పైగా తను విధిగా తీసుకునే క్యాప్ సూల్ కూడా తీసుకోలేదని నర్స్ చెప్పింది! అని" ముగించారు గోపతి మేనమామగారు.

"మరి... క్యాప్ సూల్ సీసా ఖాళీగా ఉంది కదా...?" గాబరా పడుతూ అడిగాడు గోపతి.

"ఆ మిగిలి ఉన్న క్యాప్ సూల్ నీకు కూడా బాగా పనిచేస్తుందని ఇచ్చాను!" అని చెప్పారు డాక్టర్ గారు ధీమాగా.

తనకు చావు కబురు చల్లగా తగిలింది!

"అయ్యయ్యో... యో..!? అంటూ గోపతి కుర్చీలోనే పూర్తిగా చల్లారి పోయాడు.




"పెళ్ళి చేసుకోవడం మీద మీ అభిప్రాయం ఏమిటీ?" అని సుబ్బారావుని  అతి వినయంగా అడిగాడు నరహరి.

నరహరి పెళ్ళీడుకొచ్చాడు. చదువు పూర్తయింది. క్యాంపస్ సెలెక్షన్ లో వుద్యోగం రాక పోయినా కిందా మీదా పడి ఓ కంపెనీలో వుద్యోగం సంపాదించాడు. నరహరికి టీం లీడర్ గా వున్నాడు సుబ్బారావు. సుబ్బారావుని చూస్తే, చూసిన ప్రతి ఒక్కరికి పెద్దరికం ఇవ్వాలనిపిస్తుంది.

బట్టతలకి అటు ఇటు కార్టూన్ లలో వెంట్రుకలు గీసినట్టుగా జుట్టు వుండడంతోనూ, వయసుకు మించిన వయస్సు కనిపించడం తోను, ప్రతి ఒక్కరు పెద్దరికం ఇచ్చేస్తుంటారు. నిర్మొహమాటంగా పెద్దరికం వచ్చేసరికి మొహమాటపడ్తూనే పెద్దరికం

తీసేసుకున్నాడు. అంచేత పాటించినా, పాటించకపోయినా ప్రతి ఒక్కరికీ సలహా అడగాలనిపిస్తుంది. ముఖే ముఖే సరస్వతీ అన్నట్టుగా ఒక్కొక్కరికి ఒక్కొక్క కళ వచ్చేస్తుంది.

నరహరిక్కూడా సుబ్బారావు నేపథ్యం మొత్తం తెలికపోయినా సలహా అడిగేయాలనిపించింది. అడిగేశాడు.

క్యాంటీన్ లో టీ తాగుతూ మరీ అడిగాడు. టీ తాగుతున్నప్పుడు అడిగాడంటే ఖచ్చితంగా... సిన్సియర్ గా... అడిగి వుంటాడనుకున్నాడు సుబ్బారావు. సుబ్బారావు అనుభవంలో కొన్ని లెక్కలున్నాయి. నోట్లో ఏదో తింటున్నప్పుడో, తాగుతున్నప్పుడో ఆడిగితే నిజాయితీగా అడిగినట్టనుకుంటాడు.

అంచేత నరహరి ప్రశ్నకి జవాబుగా - "..ఏ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నావ్...?" అని అడిగాడు.

"మామూలు పెళ్ళేనండీ, బాజాభజంత్రీలు, పురోహితుడు, అక్షింతలు, అన్నీ వుండాలి.."

"అంటే పెద్దలు ఫిక్స్ చేసిన సంబంధమా?"

"... అంతే అనుకోండి ... "

"..పెద్దలు ఫిక్స్ చేసిన సంబంధమైతే... మాఫ్రెండ్ విషయం చెప్తా విను....వాడికథవల్ల నీతి నీకే అర్థమౌతుంది. గోపాల్ అని పెద్దల మాట జవదాటని ఒహడు పెద్దలు చెప్పిన సంబంధమే చేసుకొంటానన్నాడు. అనడమే కాదు, నిర్ణయించేసుకున్నాడు. ఏ విషయమైనా పెద్దలనేవాడు. ఆఖరికి అమ్మాయి ఫోటో చూడమని చేతికిచ్చినా, వాళ్ళ తల్లిదండ్రులు చూస్తేగానీ చూసేవాడు కాదు. మొత్తానికి ఎలాగైతేనేం అమ్మాయి ఫోటో దగ్గర్నుండి పెళ్ళిముహూర్తం వరకు సమస్తం పెద్దలు చెప్పినట్టే చేసాడు. పెళ్ళి అయింది. పెద్దలు పెళ్ళి చేయించగలరేగానీ కాపురం చేయవలసింది వీడేగా...అప్పుడు కూడా పెద్దలు అని మొదలు పెట్టాడు.

అమ్మాయికి చిర్రెత్తుకొచ్చింది. గొడవలు ప్రారంభం. అవి పది సెకెండ్ల ప్రకటనల నిడివితో ప్రారంభమై, 24 గంటల ఛానెల్లా హోరెత్తించాయి. గొడవలు తారాస్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం వాళ్ళ పెద్దలు, వీళ్ళ పెద్దలు ఫ్యామిలి కోర్టులలో తిరుగుతున్నారు..."ప్రత్యక్ష ప్రసారమంత వివరంగా చెప్పాడు సుబ్బారావు.

నరహరి తాగుతున్న టీ మధ్యలో ఆపి నీళ్ళు తాగాడు      పెద్దలు చేసే పెళ్ళిలో టెన్షన్ ఇదా అనుకుని , మరుక్షణం...

"మరయితే, శుభముహూర్తం చూసుకుని ఓ అమ్మాయిని లైన్ లో పెట్టుకోమంటారా?"

"అంటే...ప్రేమ పెళ్ళా?"

" ఆ....అంతేలెండి...అదయితే బాగుంటుందిగా..."

బాగానే వుంటుంది. మా కిశోర్ గాడు నీలాగే ఆలోచించాడు. ప్రేమించి పెళ్ళి చేసుకోవడం అన్నిటికంటే బెస్ట్ అనుకున్నాడు. అమీర్ పేట చౌరస్తాలో ఆ స్కీం లో భాగంగానే ఓ కంప్యుటర్ కోర్సులో జేరాడు. ఓ అమ్మాయిని దారిలో పెట్టాడు. ప్రేమికులమని యిద్దరు టిక్కెట్ దొరికిన సిన్మాని చూశారు. చోటు దొరికిన      పార్కులో కాలక్షేపం చేశారు. సెల్ ఫోన్ వాళ్ళు కనిపెట్టిన కొత్త కొత్త పథకాలలో చేరి ఎస్సెమ్మెస్ లు, ఫోన్ లు తెగ చేసుకొన్నారు. చివరికి ఓరోజు ఈ ప్రేమకి శుభం కార్డు పెళ్ళిలోనే అవుతుందని బలంగా నమ్మారు. నమ్మడమే కాదు, ఓ ప్రేమ ముహూర్తం లో రిజిష్టర్డ్ మ్యారేజ్ చేసుకొన్నారు. పెళ్ళయిన నెల రోజులు తెగ ప్రేమించేసుకున్నారు. ఆ తర్వాత ఎక్కడో తేడా వచ్చింది. మోజు, మోహం గట్రా అంటూంటారుగా..అవన్ని తగ్గాయి. ...పెళ్ళి పెద్దలకి చెప్పి చేసుకుంటే బావుండేదని అనేసుకుని పెద్దల దగ్గరికి వెళ్తే, వాళ్ళు మా అనుమతితో చేసుకున్నారా? మీ చావు మీరు చావండి అని చెప్పేశారు. దాంతో నిత్యం నిరంతర యుద్ధం లో కిషోర్ కాపురం ఇహనో, ఇప్పుడో అన్నట్టుగా వుంది. " అన్నాడు ఖాళీ టీ కప్పుని సింబల్ గా చూపెడుతూ సుబ్బారావు.

నరహరి ఈసారి ఇంకా పెద్ద కంఫ్యూజన్ లో పడ్డాడు.

పెద్దలు చేసిన పెళ్ళి నిలబడలేదు.

ప్రేమించి చేసుకున్న పెళ్ళి తేడాగా వుంది.

మరిప్పుడు ఎలా...?

ఆ ఆలోచనలలోనే క్యాంటీన్ నుండి తన సెక్షన్లోకి వచ్చినా పని చేసుకోలేకపోయాడు.

సాయంత్రం అయ్యింది. ఇంటికి బయలుదేరే టైం అయ్యింది. పెళ్ళి ఆలోచనలతోనే పార్కింగ్ చోటుకు వచ్చాడు. బైక్ స్టార్ట్ చేయబోతుంటే,

"ఎక్స్ క్యూజ్ మీ..."అని      తియ్యని గొంతు      వినిపించింది. ఎదురుగా సన్నగా నాజూగ్గా వున్న అమ్మాయి. పంజాబి డ్రస్సులో వుంది. "ప్లీజ్...శిల్పారామం దగ్గర డ్రాప్ చేస్తారా...?"అనడిగింది.

కాదనలేక తలూపాడు.

ఆమె వెనక కూచున్నప్పుడు, ఆమె వంటి మీదనుండి వస్తున్న స్ప్రే వాసన మెల్లగా ముక్కుపుటాలని తాకింది.

ఈ అమ్మాయినే ప్రేమిస్తే...? క్షణం నరహరికి ఏదో ఆలోచన కలిగింది. ప్రేమించాకా-

సుబ్బారావు మధ్యాన్నం బుర్ర తినేస్తూ చెప్పింది గుర్తుకు వచ్చింది.

ప్రేమ పెళ్ళా?

పెద్దలపెళ్ళా?

ఒక్క క్షణం ఆలోచించి, మరుక్షణం , భవిష్యత్తు ఎలా వుంటుందో తెలీదు కనుక, ప్రశాంతంగా వుండాలంటే, సుబ్బారావు లాంటి సలహాలు తీసుకోకూడదనే బలమైన నిర్ణయం తీసుకున్నాడు నరహరి.!!!

అందుకే సందర్భం కల్పించుకుని ఆమె వివరాలు అడగాలనుకుంటున్నాడు...!!!




ఇప్పుడిప్పుడే సూర్యుడు అస్తమించడానికి సిద్ధపడుతున్నాడు.నీలాకాశం నుదుటిపైన సింధూరం లా సూర్యుడు ముద్దొస్తున్నాడు. చల్లటి సాయంత్రం. వీచే గాలి ఈ పార్క్ లో ఉన్న చెట్లతో గుస గుస లాడుతోంది. సన్నగా మొదలవబోతోంది వర్షం అన్నట్టుగా వాతావరణం మారుతోంది.

క్రమంగా ఆకాశం లో మబ్బులు కమ్ముకున్నాయి. చినుకు చినుకు భూమి మీదకి పడుతోంటే మొట్ట మొదటి చినుకుల తడితో భూమి పై నుండి వచ్చే మట్టి వాసన తన ప్రేమ సంకేతాన్ని తెలుపుతున్నట్టుగా ఉంది.

నేను ఎదురుచూస్తున్న వ్యక్తి ఇంకా రాలేదు.

ప్రకృతి రొమాంటిక్ గా ఉంది. నా మనసులోని భావనలకి ప్రకృతి సహకరిస్తున్నట్టుగా ఉంది.

ఎన్నాళ్ళ నుండో నాలోని మౌనంగా దాగిన మాటని లేఖలో ఆమెకి తెలిపాను. ఆ అమ్మాయి ఎలా స్పందిస్తుందో ఈవేళ బయటపడబోతోంది.

ఆమె హృదయంలో సేదదీరే రోజు త్వరలోనే రాబోతోంది అని తలచుకుంటేనే నా మనసు పులకరిస్తోంది.

ఆమె సౌందర్యం వర్ణనాతీతం. మత్తెక్కించే ఆమె చూపు, వయ్యారాల నడక, అన్నింటికీ మించి ఆమెకి మాత్రమే ప్రత్యేకమైన ఒక స్టైల్.

ఆ స్టైల్ లో నే ఒక వైబ్రేషన్ ఉంది.

ఎంత ప్రయత్నించినా వేరే అమ్మాయిలు ఎవరికీ ఆమె స్టైల్ రాదు. పొందికగా అన్నీ చక్కగా ఎక్కడివక్కడ అమరినట్టుగా ఉండే శరీర సౌష్టవం. పెదవులు కదిపీ కదపకుండా ఆమె మాట్లాడుతుంటే మతి పోగొట్టే ఆమె ముఖ కవళికలు. నవ్వితే ఆమె ముందు పడిపోవడానికి సిద్ధంగా ఉండే బోల్డు మంది అబ్బాయిలు. అలా నడుచుకుంటూ వెళితే ఆమె వెనక ఏర్పడే క్యూ.

అమ్మాయిలకు కూడా ఈర్ష కలిగించేంత అందం ఆమె సొంతం. ఎప్పుడెప్పుడు తనతో పరిచయం చేసుకుందామా అని అబ్బాయిలు ఎదురుచూస్తూ ఉంటారు.

అలాంటి అమ్మాయితో మాట్లాడే అవకాశం కోసం అబ్బాయిలంతా ఎదురు చూస్తూ ఉంటే ఆ అమ్మాయే నాతో మాటలు కలపడం నాకు అమితానందం కలిగించింది.

ఆ సంఘటన తరువాత నేను కనీసం రెండు రోజులు నిద్రాహారాలు లేకుండా ఉన్నాను.

ఆ రోజు సోమవారం.

ఉదయం పది గంటలకి యదా విధిగా తయారయి ఆఫీసు బస్సు కోసం ఎదురుచూస్తున్నాను. ఆ అమ్మాయి కూడా మా ఆఫీసులోనే పనిచేస్తుంది అనుకుంట. మొట్ట మొదటి సారి ఆ అమ్మాయిని చూసాను.

ఎంతో సైలెంట్ గా సిన్సియర్ గా ఉండే నేను ఆ అమ్మాయిని చూసిన తొలిచూపులోనే మనసు పారేసుకున్నాను.

ఆ రోజు తను బేబి పింక్ కలర్ శారీ లో బ్లాక్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌస్ వేసుకుని వాటిపైన బ్లాక్ కలర్ బీడెడ్ నెక్లెస్ వేసుకుంది. వంశీ సినిమాలోని హీరోయిన్ లా ఆ అమ్మాయికున్న డ్రెస్ సెన్స్ నన్ను ఆకర్షించిన వాటిలో ముఖ్యమైనది. వేరే ఆకర్షణల గురించి చెప్పేదేముంది. బ్లాక్ కలర్ హాఫ్ షూస్ తెల్లని ఆమె పాదాల అందాన్ని రెట్టింపు చేసాయి.

బ్లాక్ అండ్ పింక్ కాంబినేషన్ బీడ్స్ పాపిడి చైను, నిలువాటి బ్లాక్ కలర్ బొట్టు, ఆ బొట్టు పైన మెరిసే ఇంకొక గుండ్రటి బొట్టు, కంటికి కాజల్, పెదవులకి లైట్ పింక్ లిప్ గ్లాస్ తో ఆకర్షణీయమైన తన చెవులకి పొడవైన బ్లాక్ అండ్ పింక్ కాంబినేషన్ హాంగింగ్స్ ముద్దోస్తున్నాయి. చేతులకి బోలెడు గాజులతో మోడరన్ కం ట్రెడిషనల్ లుక్ ని క్యారీ చేసిన ఆ అమ్మాయి పేరే హాసిని అని ఆఫీసులో ఎవరో చెప్పుకుంటుంటే విన్నాను.

చాలా రిజర్వ్డ్ గా ఉండే ఆ అమ్మాయి ఎవరికీ అతిగా చనువిచ్చేది కాదు. ఆమె ఎక్కువగా రోజీ అనే అమ్మాయితోనే మాట్లాడేది. కాఫీ కి, టిఫిన్ కి రోజీ తోటే వెళ్ళేది.

నిన్న సాయంత్రమే ఏదో క్లైంట్ ఇష్యూ విషయంలో నా డెస్క్ వద్దకి వచ్చినప్పుడు అందరూ నన్నొక అదృష్టవంతుడిని చూసినట్టు చూసారు.

అప్పుడే తనతో తొలిసారిగా మాట్లాడాను. ఆమె మాట్లాడుతున్నంత సేపు నాకు ఏమీ వినిపించలేదు. ఆ అందం నా చెవులని పనిచెయ్యకుండా చేసింది.

"ఓకే హర్ష, థాంక్ యు, ప్లీజ్ అప్డేట్ ది క్లైంట్ అబౌట్ దిస్ ఇష్యూ" అని తను వెళ్లిపోతుంటే అర్ధమయింది ఇదేదో ఇంపార్టెంట్ క్లైంట్ కి సంబంధించిన ఇష్యూ అని.

మళ్ళీ విషయం అడిగే సరికి ఆమె మొహం లో కలిగిన చిరాకు నాకు ఇంకా గుర్తుంది. చిరాకు లో కూడా ఆమె అందంగా ఉంది.

"యా, ఫైన్ ఐ విల్ అప్డేట్ అండ్ కన్ఫర్మ్ యు" అని చెప్పాను.

తను వెళ్లిపోతుంటే నా మనసు ఏంతో బాధపడింది. వీలయితే నాలుగు మాటలు, కుదిరితే కప్పు కాఫీ అని అడగమంది. కానీ నా భయం నాకు అడ్డొచ్చింది.

పక్క డెస్క్ లో ఉన్న నా స్నేహితుడు మరియు కొలీగ్ అయిన వెంకట్ నన్ను గమనించి "ఏంటి మామా, లవ్ లో పడినట్టున్నావు"

"అరె, ఎలా రా కనిపెట్టేసావు"

"ఇప్పటికి పదిహేను మందిని ప్రేమించాను నాకు తెలియదా" అని హీరోలా పోజ్ ఇవ్వబోయి కింద మెట్లు గమనించకుండా కమెడియన్ లా పడ్డాడు.

నవ్వుని బలవంతంగా ఆపుకోలేక పగలబడి నవ్వేసి వాడిని పైకి లేపి "పదిహేను మందినా" అని వాడి టాలెంట్ ని గమనించినట్టుగా అడిగాను.

"అవునురా అమ్మాయిలను ఎలా పడేయ్యాలో నన్నడుగు. అందులో పి హెచ్ డి చేసాను" అన్నాడు

"అయినా అంత మంది ఎందుకురా. ఒకరు లేకపోతె ఇద్దరు చాలు కదా" అని నా ధర్మ సందేహాన్ని వ్యక్తం చేశాను.

"నాకు లైఫ్ లాంగ్ లవ్ మీద నమ్మకం లేదురా"

"అదేంట్రా, ప్రేమంటేనే నమ్మకం కదా"

"నమ్మకం, అది నా మొదటి ప్రియురాలికి లేకపోవడం వల్లే ఈ షార్ట్ టర్మ్ ప్రేమల కాన్సెప్ట్ ని కనిపెట్టా"

"ఇంతకీ ఇప్పుడు ఎవరిని పీడిస్తున్నావ్ సారీ ప్రేమిస్తున్నావ్"

"ఇప్పుడు నా లవ్ జెనీలియా, తను ఒట్టి మొండి ఘటం. ఇంకా నా లవ్ ని యాక్సెప్ట్ చెయ్యట్లేదు. "నేను నువ్వంటూ వేరే ఉన్నా నాకీవేళ" అంటూ ఒక పాట పాడి పడేయాలి. నా లవ్ స్టోరీస్ గురించి నీకు చెబితే తట్టుకోలేవు గాని నీ సంగతి చెప్పు"

నా సంగతి చెప్పేదేముంది ఇంకా ఈ కాన్సెప్ట్ లో పాకే విద్యార్థులం.

"ఎవరి మీద"

"ఎవరి మీద కాదురా మహా ప్రభో, నువ్వు పి హెచ్ డి అన్నావు కదా మేము ఎల్ కె జి అన్న మాట"

"అర్ధమయింది అర్ధమయింది. నీకంత సీను లేదని నాకు ముందే తెలుసు. ఇంతకీ ఆ అమ్మాయికి నువ్వు ప్రేమిస్తున్న విషయం తెలుసా"

"ఇంకా నాకే తెలియదు. ఇవాళే తెలిసింది. ఆ అమ్మాయికి ఎలా చెప్పాలో తెలియట్లేదు."

"మై హూ నా, నీకేం భయం లేదు. పద కేఫటేరియాకి నాకొక పిజ్జా, ఒక చికెన్ బిర్యానీ, ఒక పెప్సీ ఆర్డర్ చెయ్యి. నీకొక అద్భుతమైన ఐడియా ఇస్తాను"

"సర్లే తప్పదుగా" అన్నాను గుస గుసగా

కట్ చేస్తే సీన్ కేఫటేరియా లో.

హాసినీ తన ఫ్రెండ్ రోజీ తో కలిసి లంచ్ కి వచ్చింది. నేను ఈ బకాసురుడు అలియాస్ వెంకట్ తో లంచ్ కి వచ్చాను.

బిల్ పే చేసేది నేనే కాబట్టి మరికొన్ని ఆర్డర్ చేస్తూ వాటిని ఆస్వాదిస్తూ మధ్య లో "ఆ ఇప్పుడు చెప్పరా" అన్నాడు వాడు.

"అదేరా నా ప్రేమ విషయం ఆ అమ్మాయికి ఎలా చెప్పాలి. నా కసలే ఇలాంటి విషయాలు కొత్త"

"అందుకేరా దేవుడు నన్ను నీకు స్నేహితుడిగా ఇచ్చింది. నువ్వు ఎంత తొందరగా ఆ అమ్మాయితో నీ ప్రేమను చెప్పేస్తే అంత మంచిది. ఇప్పటికే మన ఆఫీసు లో ని పెళ్ళైన మగవాళ్ళతో సహా పెళ్లి కానీ మగవాళ్ళ కళ్ళన్నీ ఆమె పై పడ్డాయి"

"అయ్యో, నన్నింకా భయపెట్టకురా, అసలు విషయం చెప్పు"

"వెంటనే ఆ అమ్మాయిని ప్రపోజ్ చెయ్యి"

"చెళ్ళు మని లాగి కొడితే"

"అవును కదూ, ఆ రిస్క్ కూడా ఉంది"

"???"

"ఓకే, నాకొక మెరుపు లాంటి ఆలోచన వచ్చింది"

"మెరుపు, కొంచెం తెలుపు"

"ప్రేమ లేఖ"

"ప్రేమ లేఖా?"

"అవును, ప్రేమలేఖ రాయడం"

"నాకు లీవ్ లెటర్ రాయడమే రాదు, లవ్ లెటర్ ఎలా రాయాలి"

"మళ్ళీ మై హూ నా, డిన్నర్ కూడా నువ్వే ఇప్పించు లవ్ లెటర్ సిద్ధం చేసేస్తా. నీ ఆటోగ్రాఫ్ మాత్రం ఇవ్వు" అని చటుక్కున అయిదు నిమిషాలలో లవ్ లెటర్ ని సిద్ధం చేసేసాడు.

"ఓకే రా థాంక్ యు సో మచ్. కానీ ఎలా ఇవ్వాలి, నువ్వెళ్ళి ఇస్తావా?"

"నేను వెళ్లి ఇస్తే, లెటర్ కన్నా లెటర్ తెచ్చి ఇచ్చిన నీ ధైర్యం నచ్చింది అని ఆ అమ్మాయి నాతో లవ్ లో పడే అవకాశం ఉంది జాగ్రత్త"

సినిమాలో కమెడియన్ మొహము నువ్వు. నిన్ను చూసి ఎవరు లవ్ లో పడతారురా.

"ఏంటి బాస్, చెప్పు"

"ఆ లవ్ లెటర్ ఎలా ఇవ్వాలో ఐడియా ఇవ్వరా"

"అందుకే కదరా మన ఆఫీసు వాళ్ళు ఎంప్లాయిస్ కి ఫ్లోర్ కి అవతల లాకర్స్ ఇచ్చింది. సైలెంట్ గా వెళ్లి లవ్ లెటర్ ని ఆ అమ్మాయి లాకర్ లో పడెయ్యి. అంతే. మాటర్ క్లోజ్"

"ఇన్నాళ్టికి ఒక మంచి ఐడియా ఇచ్చావు రా. నువ్వు తిన్న ఈ ఫుడ్ కి ఋణం తీర్చుకున్నావు. మరి ఆ అమ్మాయి లాకర్ నెంబర్ ఎంతో"

"లాకర్ నంబర్ 9 రా తను హ్యాండ్ బాగ్ అందులో పెడుతుంటే చూసాను"

"ఓహ్ థాంక్ యు సో మచ్"

ఇద్దరం సైలెంట్ గా వెళ్లి ఎవరూ చూడట్లేదు అని నిర్ధారించుకున్నాక పింక్ కలర్ లవ్ లెటర్ ని ఆమె లాకర్ లో ని సన్నటి సందులోంచి లోపల తోసేశాం.

ఆ లెటర్ లో రాసినట్టు ఇవాళ నన్ను కలవడానికి ఆ అమ్మాయి ఇక్కడికి వస్తుందని నేను ఎదురుచూస్తున్నాను.

అదిగో వస్తోంది తనే అనుకుంట.

నా మనసు దోచుకున్న ప్రేమ దేవత నా కోసం వస్తోంది. నాకు సిగ్గేస్తోంది. తనే వచ్చి నన్ను పలకరించాలి అనుకుంటూ నేను ఇటువైపు తిరిగి నించున్నాను.

నా దగ్గరికి వచ్చినట్లు ఆమె పట్టీల శబ్దం చెప్తోంది.

"నా భుజం పైన ఆమె చెయ్యి వేసి "హర్షా, ఐ టూ లవ్ యు, నేనే ఈ విషయం నీకు చెబుదామని అనుకున్నాను. కానీ ఆడపిల్లను కదా, సిగ్గేసింది" అని అంది.

"హుర్రే" అంటూ ఒక గెంతు గెంతి పట్టు తప్పి కిందపడిపోయాను.

"హర్షా జాగ్రత్త" అని నాకు తన మెత్తటి చెయ్యినందించింది.

తల ఎత్తి చూస్తే నేను హాసిని కి రాసిన ప్రేమ లేఖను చేత్తో పట్టుకుని సిగ్గుపడుతున్న రోజా.




మా బాల్కనీ లోంచి చూస్తే, ఆ యింటి మొదటి అంతస్తు లో ఉన్న ఆ వాటా స్పష్టంగా కనిపిస్తుంది. ఎప్పుడో కట్టిన ఇల్లు. డాబా, రెండు గదులు, గొంతు ఖాళీ స్థలం.

అప్పుడప్పుడు మా బాల్కనీ లో కూర్చుని ఆ యింటి వైపు చూస్తే ఆ వాట లో వుండేవాళ్ళు కన్పిస్తారు. వాళ్ళ గురించి పూర్తిగా తెలీకపోయినా, కాస్త ఊహిస్తే వాళ్ళ జీవితాలు కొంచెంగా అర్ధమవుతాయి.

మొన్న మొన్నటి వరకు -

ఓ ముసలి జంట వుండేవారు. ముసలి వాళ్ళయినా యిద్దరి గొంతులు పెద్దవే. ఎప్పుడూ ఏవో అరుపులు విన్పిస్తుండేవి. ఒక్కోసారి కచేరీ ఆమె మొదలు పెడ్తే, ఆయిన ముగించేవాడు. మరోసారి ఆయన మొదలుపెడ్తే ఆవిడ గావు కేకలతో పూర్తి చేసేది.

ఇంకోసారి యిద్దరు 'జుగల్ బందీ' లా ఒకేసారి మొదలుపెట్టి కాస్త అటు ఇటు లో పూర్తి చేసేవారు. గడిచిన జీవితంలోని అసంతృప్తి యిద్దరిని ఆ వయసులో కూడా ప్రశాంతంగా వుండనిచ్చేది కాదనిపించేది. ఈ మధ్య కాలంలో ఆవిడకి ఏదో అనారోగ్యం వచ్చినట్టుంది.

అంబులెన్స్ హడావిడి గమనించాను. అరుపులు కేకలు తగ్గిపోయాయి.

'మళ్ళీ ఏజన్మలో కలుస్తామోనన్న బెంగ' యిద్దరిని మరింత ఆత్మీయులని చేసినట్టుంది. ప్రశాంత వాతావరణం స్పష్టంగా అర్ధమవుతోంది.

ఓ రోజు ఆఫీసు నుండి వస్తుంటే చూశాను. ఓ మెటాడోరులో సామాన్లు ఎక్కిస్తున్నారు. వాళ్ళు ఖాళీ చేసి ఏదో ఓల్డ్ ఏజ్ హోమ్ కి వెళ్తున్నట్టు తరువాత తెలిసింది.

ముసలివాళ్ళు ఖాళీ చేసిన పదిరోజులకి ఆ వాటాలోకి ఓ అమ్మాయి వచ్చింది. ఆ అమ్మాయికి ఇరవై ఐదేళ్ళ లోపే వయసు వుండొచ్చు. సన్నగా నాజూగ్గా వుంది. చాలా రోజులనుండి ముసలి దంపతులనే చూసిన కళ్ళకి 'రిలీఫ్' గా అన్పించింది. బహుశా ఈమె కూడా ఏ కంప్యూటర్ కోర్సు అయినా చేయడానికి వచ్చి వుండొచ్చు లేదా ఏ ప్రైవేటు కంపెనీ లోనైనా ఉద్యోగం చేస్తుండవచ్చు.

వచ్చిన రోజు సాయంత్రమే 'దర్శనం' యిచ్చింది. ఆ అమ్మాయి తల పైకెత్తి చూస్తే కానీ నేను కనబడను. నేను మాత్రం బాగానే గమనించవచ్చు.

ఆ అమ్మాయి చేతిలో సెల్ ఫోన్ వుంది. పాత మోడల్ తక్కువ ధర సెల్ ఫోన్ అన్పించింది. ఆ అమ్మాయి ఫోన్ లో మాట్లాడుతోంది. మాట్లాడే పద్ధతి బట్టి బహుశా వాళ్ళ తల్లి దండ్రులతో మాట్లాడుతుందేమో అన్పించింది. బెంగతో మాట్లాడుతున్న భావన

స్పష్టంగా తెలుస్తోంది.

హైదరాబాద్ నగరంలో తరచూ ఇలా బెంగపడ్డ మొహాల్ని చూసిన అనుభవంతో చెప్పగలుగుతున్నాను. నిజానికి 'ఫేస్ రీడింగ్' విషయంలో ప్రత్యేకమైన శిక్షణ తీసుకోకపోయినా గమనింపు వల్ల తెలుసుకుంటాను. మొదట్నించి మొహం చూసిన వెంటనే మానసికంగా ఈ పరిస్థితిలో వుండి వుండొచ్చు అని వూహించేవాడిని. తెలుసున్న వాళ్ళతో ఆ విషయం చెప్పినప్పుడు దాదాపుగా కరెక్ట్ గా అంచనా వేస్తానని తెలుసుకోగలిగాను.

వారం పదిరోజుల వరకు ఆ అమ్మాయి బెంగతో కన్పించినా, క్రమంగా రొటీన్ లో పడి తేరుకుంటున్నట్టనిపించింది. రెండు వారాల తరువాత రాత్రి తొమ్మిది దాటింది. సాధారణంగా నేను ఆసమయంలోనే ఆ వాటా వైపు చూస్తుంటాను. డాబా మీదకి వచ్చిన ఆ అమ్మాయి ఉత్సాహంగా నక్షత్రాల వైపు చూస్తోంది. చందమామకి ఫ్లెయింగ్ కిస్ యిచ్చింది. చాలా హుషారుగా కన్పించింది.

చిత్రంగా -

ఆ అమ్మాయి చేతిలో వున్న పాత సెల్ ఫోన్ మారిపోయింది. తలతలా మెరిసిపోతున్న కొత్త సెల్ కనిపించింది. ఆ సెల్ ఫోన్ లో అతి ఉత్సాహంగా మాట్లాడేస్తోంది.

పరీక్ష పాస్ అయ్యిందా?

ఉద్యోగం వచ్చిందా?

ఆ రోజు జరిగినప్పుడు ఆనందం కన్నా, ఈ ఆనందం మరేదో పెద్ద ఆనందంలా అన్పించింది. ఏమిటది?

తొమ్మిదిన్నరకి మొదలు పెట్టిన ఫోన్ ఆపకుండా రెండుగంటలు మాట్లాడింది. ఆ రెండుగంటలు అదే ఉత్సాహం, ఆనందం, నవ్వులు, కేరింతలు, సిగ్గుపడడం, అలకబోనడం. ఒకటి కాదు రకరకాల హావ భావాలు నాన్ స్టాప్ గా ఒలక బోసేస్తోంది.

ఈ లెక్కన, నా లెక్క కరెక్ట్ అయితే, ఆ అమ్మాయి ప్రేమలో పడింది!

సందేహం లేదు. ప్రేమే.

ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు... నిరాటంకంగా పదిరోజులు రెండు మూడు గంటల చొప్పున రాత్రివేళలో మాట్లాడేస్తోందంటే ఖచ్చితంగా ప్రేమే.

ప్రేమే ఆ శక్తినిస్తుంది. ప్రేమే ఆకళని తెస్తుంది.

ఆ తరువాత -

ఒకటి రెండుసార్లు ఓ బైక్ మీద ఓ అబ్బాయితో ఎలక్ట్రిక్ స్తంభం పక్కన కనబడటం - దగ్గర్లో వున్న పార్కులో ముసిముసినవ్వులతో, గుసగుసలు చెప్పుకోవడం నా కంటపడ్డాయి.

ఈ డాబా మీద చాలా ప్రేమ కథలు పుట్టాయి. ఇక్కడ పుట్టిన మరో ప్రేమ కథ యిది.

చాలా ప్రేమ కథలకి పెళ్ళిళ్ళు అయిపోవడం కూడా నాకు తెలుసు. వీళ్ళ కథ పెళ్ళి పాయింట్ కి ఎప్పుడు చేరుతుందాని చూస్తున్నాను.

ఆరోజు - ఎప్పటిలాగే రాత్రి ఆ అమ్మాయి ఫోన్ లో మాట్లాడుతోంది. మాటలు హుషారుగా లేవు. ఏదో కంప్లయింట్ చేస్తున్నట్టు మాట్లాడుతోంది.

అలక సీను అనుకున్నా -

ఉన్నట్టుంది ఉరుములు మెరుపుల్లా పెద్ద పెద్ద కేకలు -

ఒక ఆవేశంలో ఆ అమ్మాయి చేతిలో వున్న కొత్త సెల్ ఫోన్ విసిరి కొట్టింది. కృష్ణపక్షపు గుడ్డి వెలుతురులో విరిగిన సెల్ ఫోన్ ముక్కలు కనిపిస్తున్నాయి. ఏమైంది?

ఫెయిల్యూర్ లవ్ స్టోరీనా? ఏమో?

... వాళ్ళు మళ్ళీ కలిసారా, ప్రేమ గొడవ సెటిలయ్యిందా, ఏమైందో నాకు తెలిదు - ఎందుకంటే - అనుకోని మలుపులా మా ఇంటి ఓనర్ ఇల్లు ఖాళీ చేయమనడంతో వేరే రూమ్ కి మారిపోయా! ఆ అమ్మాయి ప్రేమకథ ఏమైందో ఎప్పటికైనా తెలుసుకుంటానని అప్పుడప్పుడు అనిపిస్తుంది!!!




ఉ చితం'

శివ పంచాక్షరిలా రాంబాబుకి ఎంతో కర్ణపేయంగా ఉంటుందా మాట.

పక్క వాళ్ళకి తాగడానికి గుక్కెడు నీళ్ళు... తినడానికి గుప్పెడు మెతుకులు పెట్టని సమాజం మనది, అలాంటిది ఉచితంగా ఇస్తున్నారంటే ఏమనాలి. అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నది రాంబాబు ఉవాచ.

ప్రతిరోజు నాలుగు రకాల పేపర్లు వేయించుకుంటాడు. రాజకీయాలపై ఆసక్తితోనో... సినిమా వాళ్ళ విశేషాలు తెలుసుకునే వార్తలకోసమో కాదు. కేవలం ప్రకటనల కోసం. ఉచితం అని కనిపించే ప్రకటనల కోసం. అది కనిపించిందంటే ఆ పూట పండగ. ఆఫీసులో పర్మిషను తీసుకుని అది ఎంత దూరంలో వున్నా అవలీలగా వాలిపోతాడు.

ఈరోజు కూడా పేపర్ల కోసం కాళ్ళరిగేలా తిరుగుతున్నాడు. ఈపాటికే పేపర్లొచ్చేయాలి కాని వెయ్యలేదు. అదే అతని అసహనానికి కారణం. అంతలో పేపర్ల కట్ట విసురుగా వచ్చి ముఖానికి బలమైన దెబ్బ తగిలింది. మరొకరైతే కుమిలిపోయి హాకరుని కేకలేసేవారు. కాని మనవాడు చిన్న గీత ముందు పెద్ద గీతలా పేపర్లలో ఉచితం అన్న పదం చూడాలన్న ఆత్రంలో అది పట్టించుకోలేదు. గబ గబా టీపాయి మీద వాటిని పరచుకుని కుర్చీలో కూర్చుని హడావుడిగా పేజీలు తిరగేశాడు.

చిన్నా బ్రదర్ సూపర్ మార్కెట్ కొత్తగా టోలిచౌకీలో ప్రారంభిస్తున్నాం. ఈ శుభసందర్భంలో అద్భుత ప్రారంభ ఆఫర్ గా మొట్ట మొదటగా విజిట్ చేసిన వందమందికి పదకొండొందల రూపాయల గిఫ్ట్ ఓచర్స్ ఇవ్వబడును. మూడువేల పర్చేజ్ తో వెయ్యి రూపాయలకే డి వి డి ప్లేయర్ తీసుకోవచ్చు. ఇహ మన రాంబాబు మనసు గాల్లో తేలిపోవడం మొదలెట్టింది.

సెల్ ఫోన్ తీసుకుని కొలీగ్ కనకారావుకి ఫోన్ చేసి తను ఇవాళ ఒంట్లో బాగా లేక ఆఫీసుకి రావడం లేదని బాస్ కి విషయం చెప్పమని అభ్యర్ధించాడు. తర్వాత " సుందరీ, ఒసేవ్ సుందరీ" అని భార్యని కేకేశాడు.

మాంచి నిద్రలో వున్న ఆమె అదాటున లేచి "ఎవరో చచ్చినట్టు ఏంటా అరుపులు?" అంది కోపంగా.

"అది కాదే సుందరీ, మరేమో నేనివాళ ఆఫీసుకి వెళ్ళడం లేదు. కారణం..." అని విషయం మొత్తం విపులంగా చెప్పాడు.

" హవ్వ... ఎవరైనా వింటే నవ్విపోతారు. ఎక్కడ టోలిచౌకి ఎక్కడలోకం ఇక్కడినుండి అరవై కిలోమీటర్లుంది. పైగా ఆఫీసు మానేసి వెళతారా? చోద్యం కాకపోతే!"

" అదికాదే నీకు విషయం పూర్తిగా అర్ధం కాలేదు పదకొండొందల గిఫ్ట్ ఓచర్లు ఇస్తారట, మనం ఎప్పటినుండో డి వి డి ప్లేయర్ కొనాలనుకుంటున్నామా... మార్కెట్లో మినిమం మూడువేల రుపాయలుంది. అలాంటిది వెయ్యి రుపాయలకే ఇస్తానంటున్నారా... ఉపయోగించుకోవాలే... ఇలాంటి ఆఫర్లు తెలివిగా ఉపయోగించుకోవాలి. నేను ఇక బయల్దేరుతా, టిఫిన్ బయట చేస్తా, మొదటిగా విజిట్ చేసిన వందమందికే గిఫ్ట్ ఓచర్లట" అన్నాడు.

"ఖర్మ... నే చెబితే ఏరోజు విన్నారు గనక? వెళ్ళండి" అంది విసురుగా.

రాంబాబు తన డొక్కు స్కూటరు మీద బయలుదేరాడు.

అక్కడికెళ్ళేసరికి ఎవరూ లేరు షాపు కూడా మూసి వుంది. షాపు ముందు చాలా మంది ఉంటారని... తొక్కిసలాట జరుగుతుందని ఊహించన రాంబాబుకి పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. టైము చూసుకున్నాడు పావుతక్కువ తొమ్మిదయింది. అక్కడి వాచ్ మెన్ న అడిగాడు షాప్ ఎప్పుడు తెరుస్తారని. ముహూర్తం పదకొండూ నలభై అయిదుకయినందువల్ల పదిన్నరకి షాపు తెరుస్తారని చెప్పాడు.

రాంబాబు చేసేదేం లేక కడుపులో ఎలుకలు పరిగెడుతుండటంతో దగ్గర్లో వున్న హోటల్ కి వెళ్ళి పెసరట్టు ఉప్మా తిని కాఫీ తాగాడు. బిల్లు యాభై అయింది. 'చక్కగా ఇంట్లో తిని వచ్చినా బాగుండేది డబ్బు మిగిలేది' అనుకుని నిట్టూర్చాడు.

షాపు తెరవంగానే లోపలికి వెళ్ళబోయాడు. " ఆగండి సార్ పూజ పూర్తయ్యాక, పెద్ద బోణీ అయ్యాక మీరు షాపింగ్ చేద్దురు గాని" అన్నాడు పట్టు బట్టల్లో, చేతి వేళ్ళకి ధగ ధగలాడే ఉంగరాలతో మెరిసిపోతున్న షాప్ ఓనర్.

రాంబాబు ఒక మూల నిలుచున్నాడు.     అంతా అయ్యేసరికి రెండు అయ్యింది. వాడిపోయిన ముఖంతో రాంబాబు షాప్ లోపలికి అడుగుపెట్టాడు. చల్లని ఏ సి గాలి... పై నుండి కూల్ డ్రింక్ ఇవ్వడంతో పోయిన ప్రాణం తిరిగొచ్చింది. ఉత్సాహంగా షాపింగ్ పూర్తి చేసి బిల్ కౌంటర్ ముందు నుంచున్నాడు. బిల్ పూర్తయ్యాక " సార్ మీరు చాలా అదృష్టవంతులు... మీరు తొంభై తొమ్మిదో వారు మీ గిఫ్ట్ ఓచర్లు ఇదిగోండి" అన్నాడు కౌంటర్ లోని వ్యక్తి. పట్టుమని పాతికమంది కూడా లేరు తనది అప్పుడే తొంభై తొమ్మిది ఎలా అయిందో అర్థం గాక బుర్ర గోక్కున్నాడు. ఏదయితేనేం తనకి గిఫ్ట్ ఓచర్లు సొంతమయ్యాయి అనుకుని "ఇవన్నీ ఇప్పుడే రిడీం చేసుకోవచ్చా!"అన్నాడు ఆశగా.

కౌంటర్లో కూర్చున్న వ్యక్తి రాంబాబుని వెర్రి వెంగళాయిని చూస్తున్నట్టుగా చూసి " ఇవన్నీ నెలకి వంద చొప్పున రిడీం చేసుకోవాలి. ఆల్రెడీ మేము ఒకటి కన్సిడర్ చేసేశాం. అందుకే మీకు పదకొండు నెల్లకి పదకొండు కూపన్లు ఇచ్చాం." అని చెప్పి నవ్వాడు. అంటే వందరూపాయల ఓచర్ కోసం నెలకోసారి ఇంతదూరం రావాలన్నమాట. " మరి వెయ్యి రూపాయలకే డి వి డీ ప్లేయర్?" అడిగాడు క్వశ్చన్ మార్కు ముఖంతో. " అచ్చా మీకు డి వి డి ప్లేయర్ కావాలా? ఇప్పటిదాకా మీరు పర్చేజ్ చేసిన వాటికి డిస్కౌంట్ రేట్స్

వేశాం. మరి డి వి డి ప్లేయర్ కావాలంటే ఎం ఆర్ పి రేట్స్ వెయ్యాలి మరి వెయ్యనా" అన్నాడు.

రాంబాబు చేసేదేం లేక 'సరే' అన్నాడు. మెషిన్ లో ఏదో ఫీడ్ చేసి వెంటనే బిల్ ప్రింట్ తీసి ఇచ్చాడు. రెండు వేల తేడా. పైన తనెలాగు వెయ్యి రూపాయలు కట్టాలి అంటే మార్కెట్ లో దొరికే రేటే! నిట్టూర్చి అది కూడా తీసుకుని డబ్బెక్కువుగా తీనందుకు, క్రెడిట్ కార్డుతో బిల్ కడుతున్నందువల్ల 2.5 శాతం అదనంగా కట్టి ఈసురోమంటూ బయటకొచ్చాడు. రాంబాబుకి తనేం సాధించాడో అర్థం కాలేదు. పేపర్లో కనిపించే అరచేతి వైకుంట ప్రకటనకి ఆకర్షితుడై ఆఫీసుకి సెలవు పెట్టి మరీ అరవై కిలోమీటర్ల దూరంలోని షాప్ కొచ్చి కొనాల్సిన దానికన్నా ఎక్కువ కొని భంగపడ్డాడు. ఈ విషయం తన భార్యకి తెలిసిందంటే తననో వారం రోజుల పాటు సాధిస్తుంది 'డబ్బూ పోయి దొబ్బులాట' అంటే ఇదే కాబోలు.

ప్రతి రోజు పేపర్ చూసి ఆన్ లైన్ షాపింగ్ ప్రకటనల మోజులో పడి ఫోన్ చేసి దర్జాగా వస్తువు ఆర్డర్ చేయడం... ఆ తర్వాత చేతి చమురు వదలడం. ఓ వ్యసనంలా అవసరమైనవన్నీ కొని ఇళ్ళంతా నింపేశాడు. ఓ మాయలో చిక్కుకున్నట్టుగా తనకి తెలియకుండానే గిల గిల లాడాడు. తన కొచ్చే జీతమెంత? తన ఖర్చు పెట్టేదెంత? అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. పైగా క్రెడిట్ కార్డు ఒకటి... స్టైల్ గా తీసి అలవోకగా ఉపయోగించడం... ఆ తర్వాత వచ్చే స్టేట్ మెంట్ చూసి గతుక్కుమనడం. ఎవరైనా ఆఫర్లు ఎందుకిస్తారు? అవి నిజంగా ఆఫర్లేనా? అదో మోసం. మధ్య తరగతి వాళ్ళ ఆశలకి వేసే అందమైన గాలం. చిక్కుకున్న వాళ్ళు గిల గిల్లాడుతుంటారు. మిట్ట మధ్యాహ్నపు ఎండలో నడుస్తున్న రాంబాబుకి జ్ఞానబోధ అయింది.

మూడుంపావుకి దాహంతో ఆకలితో ఇంటికి చేరుకున్న రాంబాబు " ఏమండి... ఏమేం తెచ్చారు?" అని భార్య అడుగుతున్నా వినిపించుకోకుండా ల్యాండ్ లైన్ నుండి పేపర్ ఏజంట్ కి ఫోన్ చేసి రేపటి నుంచి తనకి పేపర్లు వేయద్దన్నాడు. " మీకేమైందండి..." అని భార్య అడిగితే "మంచిరోజులొచ్చాయి" అని చెప్పాడు.

***




ఇం ట్లో ఎవరూ లేరు.మా బంధువుల పెళ్ళికి బందరు వెళ్ళారు.సాయంత్రం ఆఫీసు నించి వస్తూ మధ్యలోని ఒక హోటల్లో కొంత గ్రాసాన్ని తిని ఇంటికి వచ్చాను.స్నానం, పానం చేసి టీ.వీ.ఆన్ చేసాను.

స్థానిక 'ఎల్.టీ.వి' చానెల్ లో 'ఫోన్ కొట్టు-టికెట్ పట్టు' లైవ్ ప్రోగ్రాం మెదలయింది. టీ.వి లోంచి యాంకర్ రింగుల రోజా, తంబోలా రమేష్ చేతులూపుకుంటూ వచ్చారు. కార్యక్రమానికి స్వాగతం, సుస్వాగతం..అంటూ హడావిడి మొదలెట్టారు. ఈ కార్యక్రమంలో మీతో పాలుపంచుకోవడానికి ప్రఖ్యాత నటులు, 'గుండెల్లో దడ' చిత్ర కథా నాయకులు 'శ్రీ గుండు గజానన్' గారు స్టూడియో కి విచ్చేసారు.

'గుండెల్లో దడ' చిత్రం ఈ మధ్య నే విడుదలై విజయవంతం గా ప్రదర్శింపబడుతున్న సందర్భం గా, ఈ చిత్ర విశేషాలను మీతో పంచుకోవటానికి వారు విచ్చేసారు. వారితో మాట్లాడటానికి మీరు ఫోన్ చెయ్యవలసిన నంబరు-040-20202020. ఫోన్ నంబరు ట్రై చేస్తూ వుండండి. మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. ఫోన్ కొట్టండి-టికెట్ పట్టండి. ఇప్పుడో చిన్న బ్రేక్ తీసుకోండి." అంది రింగుల రోజా.

ఒకింత విసిగిస్తున్నా ఇవాళ ఈ ప్రోగ్రాం చూడాలని నిశ్చయించుకున్నాను.

'డబ్బు కోసమా, మీ చింత, మా డార్లింగ్ బ్యాంక్ వుంది మీ చెంత' అంటూ వాణిజ్య ప్రకటనతో ఒక హీరో తెర మీద ప్రత్యక్షం అయ్యాడు. అదయ్యే లోగానే తళ తళ లాడే పళ్ళ కోసం అందరి ఎంపిక మా 'గబుల్' పళ్ల పొడి అంటూ, మా పళ్ల పొడి వాడక ముందు అంటూ నోట్లో ఒక పన్ను కూడా లేని రమణా రెడ్డి లాంటి వాడ్ని చూపించారు. మా 'గబుల్' పళ్ళపొడి వాడిన తర్వాత అంటూ నోటి నిండా కట్టుడు పళ్ళున్న వాడ్ని ఒకడ్ని చూపించారు.

తిరిగి కార్యక్రమానికి స్వాగతం అంటూ రోజా, రమేష్ ప్రత్యక్షమయ్యారు. స్టూడియో లో ఫోన్ రింగైంది.

" హలో..ఎవరండీ..ఎవరు మాట్లాడేది. మీ పేరు, వివరాలు చెప్పండి." అంటూ వగలుపోతూ అష్ట వంకర్లు తిరిగింది రోజా.

" నా పేరు గునపాల గోవర్ధనం. నేను గుండాల పాలెం నుంచి ఫోన్ చేస్తున్నాను." అన్నాడు.

" ఆ..చెప్పండి, గోవర్ధనం గారు.." అంది రోజా.

" చెప్పడానికి ఏమీ లేదండి. మీరు చెప్పారు కదా! ఫోన్ కొట్టు, టికెట్ పట్టు అని ఫోన్ కొట్టాను. టికెట్ పంపించండి." అన్నాడు.

" అలా కాదు..గోవర్ధనం గారు, ఇక్కడ మీ ముందు స్టూడియో లో 'గుండెల్లో దడ' కథా నాయకుడు శ్రీ గజానన్ గారు వున్నారు. ఆయనతో మాట్లాడండి. తర్వాత మీ మొబైల్ కు ఎస్.ఎం.ఎస్ వస్తుంది. అది పట్టుకొని థియేటర్ కి వెళితే అక్కడ మీకు టికెట్

ఇస్తారు." చెప్పింది రోజా.

" నాకు ఆ గజానన్ గారు ఎవరో తెలియదు. సినిమా టికెట్ ఇస్తానన్నారని ఫోన్ చేసాను. ఎక్కువ సేపు మీతో సుత్తి కొట్టడానికి నా మొబైల్ లో బాలన్స్ లేదు. వెంటనే ఎస్.ఎం.ఎస్ పంపించండి." అంటూ కోపంగా ఫోన్ పెట్టేసాడు గోవర్ధనం .

మళ్ళీ స్టూడియో లో ఫోన్ రింగైంది.

" హలో..మీరు మాట్లాడే ముందు మీ పేరు, వివరాలు చెప్పండి." అంటూ రొటీన్ గా వంకర్లు తిరిగింది రోజా.

అవతల నుంచి " నమస్తే మేడం..నా పేరు గోసంగి సుబ్బారావు. నేను జొన్నాడ నుంచి ఫోన్ చేస్తున్నాను. గుండు గజానన్ గారికి ఇవ్వండి." అన్నాడు.

" ఆ వింటున్నారు, మాట్లాడండి." అన్నాడు రమేష్.

" గజానన్ గారు నాకు మీ నటనంటే మహా ఇష్టమండి. కానీ నాకో సందేహమండి. మీరేమో గాలేస్తే ఎవరికీ కనబడనంత దూరం ఎగిరిపోయేలా వుంటారు కదండి. మరి సినిమా లో చీపురు పుల్ల లాంటి చెయ్యేసుకొని, రుబ్బురోళ్ళ లాంటి విలన్లని ఎలా కొడతారండి. మీరు చెయ్యి వెయ్యగానే వాళ్ళు గాలిలో అలా ఎగిరిపోతారు కదండి. ఆ టెక్నిక్ గురించి ఈ కార్యక్రమం ద్వారా చెబితే విని తెలుసుకుంటామండి." అన్నాడు.

" చూడండి, సుబ్బారావు గారు, ఇలాంటి సినీ సూత్రాలు బహిరంగం గా చెప్పేవి కావు. ఈ సారి మీరు హైదరాబాద్ వచ్చినప్పుడు కలిస్తే అప్పుడు మీకు తెలుస్తుంది." అన్నాడు గజానన్.

మీరు సినిమా కి సంబంధించిన ప్రశల్ని మాత్రమే అడగాలని వెనకాల నుంచి రోజా సర్దుతోంది. ఇక లాభం లేదనుకొని పోన్ లైను కట్ చేసారు.

గుండు గజానన్ కి స్టూడియో లో చల్లగా ఏ.సి.తగులుతున్నా కిందనుంచి కనబడకుండా చెమటలు కారుతున్నాయి. ఇంకెలాంటి ఫోన్ లు వినిపిస్తార్రా భగవంతుడా అనుకుంటున్నాడు మనసులో.

ఈ లోపల ప్రేక్షకుల కోసం..మీకో సర్ప్రైజు సిద్ధం గా వుంది. అంటూ సందడి చేస్తున్నాడు తంబోలా రమేష్. ఆ సర్ప్రైజు మీ కోసం ఈ బ్రేక్ తర్వాత చూడండి. అన్నాడు.

మళ్ళీ ప్రకటనలు మొదలయ్యాయి.

తిన్నారా..పడుకున్నారా..తెల్లారిందా..మీకే తెలియదు. మా బెడ్ పై పడుకుంటే సరాసరి మీరు స్వర్గం లో వున్నట్టే. ' లంగూన్ ' ఫోంబెడ్స్. బెడ్ కొంటే పిల్లో ఫ్రీ. అంటూ ఊదర గొడుతున్నాడు.

మీకు గుండెల్లో మండుతోందా..మీ పెళ్ళాం ఊరెళ్ళిందా..అయితే వెంటనే రండి. రంభ, ఊర్వశి బార్..మీకు చేరువలోనే మా బ్రాంచీలు. మీకు మరింత చేరువ కావడానికి అతి త్వరలో మరిన్ని బ్రాంచీలు ప్రారంభం. అంటూ మరో ప్రకటన.

తిరిగి కార్యక్రమానికి పునర్ స్వాగతం అంటూ వళ్ళు వేయి వంకర్లు తిప్పింది రోజా. మీరు ఎంతగానో ఎదురు చూస్తున్న సర్ప్రైజు ' గుండెల్లో దడ ' చిత్ర కథా నాయకి కుమారి లక్ష్మీ పట్నం లతాంగి గారు స్టూడియో కి విచ్చేసారు. మీ కోసం..మీ కోసం ..మాత్రమే, ఇక్కడికి విచ్చేసారు. బయట ఎన్నో కార్యక్రమాలు వున్నప్పటికీ వాటిని వాయిదా వేసుకొని అభిమానుల్ని అలరించడానికి విచ్చేసిన లతాంగి గారికి చాలా చాలా థేంక్స్ అని చెవులు చిల్లులు పడేలా అరుస్తోంది రోజా.

" ముందుగా చెప్పండి లతాంగి గారు, మీ చిత్రం ఇంత పెద్ద సూపర్, డూపర్ హిట్ అయినందుకు ఎలా ఫీలవుతున్నారు." అడిగాడు రమేష్.

మూతి ముప్పయి మూడు వంకర్లు తిప్పుతూ " చాలా..అనందం గా వుంది." అంది లతాంగి.

" మీరు తెలుగు వారే కదా, తెలుగులో మాట్లాడలేరా.?"అడిగింది రోజా.

" నేను మాట్లాడేది తలుగే కదా."అంది లతాంగి.

" తలుగు కాదమ్మా, తెలుగు.." సవరించాడు గజానన్.

ఏ నన్నయో, తిక్కనో ఈ తెలుగు వింటే గంగలో ఒకరు, గోదారి లో ఒకరు దూకే వారేమో అన్నట్టుంది. ఓ పక్కన అష్ట వంకర్ల యాంకర్ల తెలుగు కి ఈ లతాంగి తెలుగు ఏమీ తీసిపోదనిపించింది.

ఇంతలో మళ్ళీ ఫోన్ మోగింది. " ఇందాకటి నుంచి ఫోన్ చేత్తావుంటే ఫోనెత్తరేటండి. మీకు ఫోన్ సేసి,సేసి మా సేతులు అడిపోతున్నాయి ఇక్కడ. బోడి మీరు ఏబై రూపాయల టికెట్ ఇత్తారో,ఇవ్వరో కాని,మా కు బోల్డు బిగినెస్ పోనాది ఇక్కడ. నా పేరు కిరాణా కొట్టు కనకరాజు." అని చెప్పేది వినే స్థితిలో లేకుండా వాయించేస్తున్నాడు.

" చూడండి..కనక రాజు గారు..మీలా చాలా మంది ట్రై చేస్తూ వుంటారు కదా. లైన్ కలవడానికి కొంతసమయం పడుతుంది. మీరు చికాకు పడకూడదలా.." అంటూ ముద్దు,ముద్దు గామెలికలు తిరిగింది రోజా.

" సరే కాని..మన స్టూడియో లో ' గుండెల్లో దడ ' హీరో గజానన్ గారు, హీరోయిన్ లతాంగి గారు వున్నారు. మీరు ఎవరితో మాట్లాడతారు."అని అడిగాడు రమేష్ .

" ఆ లతాంగి కోపాలి ఇవ్వండి. " అన్నాడు కనక రాజు.

" ఏటండి..లతాంగి గోరు మీరు, మరీ అంత పిసనారోళ్ళు..సినిమా, సినిమా కి బోలెడంత డబ్బుచ్చుకుంటారు గదా. ఏమీ లేనోళ్ళా ఆ పొట్టి,పొట్టి గుడ్డలేటండి. శుబ్రమైన పొడుగు గుడ్డముక్కలు కొనుక్కోవచ్చు కదా. ఓ పాళి మా వూరొచ్చారంటే, నేను దగ్గరుండి, మా జంగం బాబూరావు కొట్టుకు తీసుకెళ్ళి, శుబ్రమైన లాంగ్లాత్ గుడ్డ తీసి, మా గోళీల సందు దగ్గరుండే..బొంతల.నారాయణ గాడి కిచ్చి బెమ్మాండం గా కుట్టిస్తాను."అన్నాడు.

కనకరాజు బాగా బుద్ధి చెప్పాడనుకున్నాను మనసులో.

"అది కాదండి, కనక రాజు గారు, మీరు గజానన్ గారి సినిమా లేమైనా చూసారా. సినిమాల గురించి మాట్లాడండి."అంది రోజా.

" నేనెందుకు సినిమా సూత్తానండి. నేనేమైనా ఎర్రోన్నా. పిచ్చోన్నా, ఏభై రూపాయలు దండగ. ఎవడు తిన్నదీ కాదు. మీరు ఫ్రీగా టికెట్ ఇస్తానన్నారని ఫోన్ చేసాను కాని, లేకపోతే మాకెందుకీ దండగ కార్యక్రమం. ' టాటా టు టాటా ' ఫ్రీ ఫోనవడంతో మీతో ఇంతసేపు బాతాఖానీ కొడుతున్నాను."అన్నాడు.

వెంటనే ఫోన్ లైన్ కట్ అయిపోయింది.

గజానన్ కి ఎక్కడో కాలింది. ఈ టి.వి చానల్ వాళ్ళు తమ సినిమా ని ప్రమోట్ చేయడానికి ఈ కార్యక్రమం పెట్టారా, లేకపోతే మా పరువు తియ్యడానికి కంకణం కట్టుకొని మరీ మా దురభిమానులందరిచేత ఫోన్ లు చేయించి అవమానిస్తున్నారా అనుకున్నాడు.

ఇంతలో షరామామూలే అన్నట్టు..కరెంట్ పోయింది.

పోన్లేరా బాబు, బుర్ర బాగా వేడెక్కినందుకు ఈ కామెడి కార్యక్రమంతో బాగానే కాలక్షేపం అయిందనుకున్నాను....




మా ఆవిడ ప్రత్యేకతల గురించి వివరించడానికి ఒక్క రోజు సరిపోదు. డైలీ సీరియల్ ఎపిసోడ్స్ లాగా దీర్ఘ కాల ఎపిసోడ్స్ విత్ యాక్షన్ అండ్ సెంటిమెంట్ అవసరం. కొలతలు తీసుకుని మరీ మా ఆవిడని బ్రహ్మ సృష్టించాడా అని అనిపించే శరీర సౌష్టవం ఆమె సొంతం.

ఆ బ్రహ్మ దేవుడు మా ఆవిడని మలిచేటప్పుడు కొంత అందాన్ని, కొంత అమాయకత్వాన్ని, మరికొంత తెలివితేటలతో పాటు టీవీ పిచ్చి కూడా యాడెడ్ అడ్వాంటేజ్ (ఎవరికి) గా పడుంటుందని కలిపేసి ఉంటాడు.

ముచ్చట గొలిపే అందం, అమాయకపు నవ్వు కలగలిపితే మా ఆవిడ. వీటితో పాటు ఆవిడకున్న టీవీ పిచ్చి ఆమెకే ప్రత్యేకమైనది.

అసలు ఇప్పుడు కాదు పెళ్లి అయిన తరువాత మా శోభనం రోజే మా ఆవిడకి టీవీపై అందులో నటించే వాళ్ళపై ఉన్న అభిమానం అర్ధమయింది.

నా ఫ్లాష్ బ్యాక్ చదవండి మరి

శుక్రవారం

సమయం - రాత్రి 7:30 నిమిషాలు

అమ్మలక్కలు అందరూ మా ఆవిడని ముస్తాబు చేస్తున్నారు.

"ఈ సిగ్గంతా మా వద్ద కాదే నీ మొగుడి కోసం కొంచెం ఉంచుకో" అని పక్కింటి బామ్మగారు, "ఓసినీ, నువ్వేంటే ఇంత సిగ్గుపడుతున్నావు, నన్ను చూడు శోభనం శోభనం అని ఎలా ఎదురుచుస్తున్నానో" అని పెళ్ళికాని మా ఆవిడ స్నేహితురాలు, "చాల్లే సంబడం, మా కాలంలోనైతేనా చచ్చేంత సిగ్గు అనుకో. శోభనం అయిపోయిన మరునాడు అబ్బాయి మొహం చూసేవాళ్ళం" అని బామ్మగారు మళ్ళీ రంగం లోకి దిగడం

శుక్రవారం

సమయం - రాత్రి 7:50 నిమిషాలు

మా అత్తగారు మా ఆవిడని కుందనపు బొమ్మలా తయారు చేసి చెవిలో ఏవో గుసగుసగా చెప్పారు.

సాధారణంగా సినిమాలలో అత్తగారు కూతురి చెవిలో శోభనానికి పంపించే రోజు చెప్పే మాటలు

"అబ్బాయి చెప్పినట్టే నడచుకో"

ఇక్కడా అలాగే చెబ్తూ ఉంటారు. మా అత్తగారు ఎంత మంచివారో అని ముచ్చట పడిపోయాను.

శుక్రవారం

సమయం - రాత్రి 7:59 నిమిషాలు

మంచంపై చల్లిన మల్లెలపై హృదయం ఆకారంలో అందంగా అలంకరించబడిన గులాబీ పూలు. గదిలో చల్లిన లావెండర్ రూం ఫ్రెష్నర్. మంచం పక్కనే వెండి పళ్ళెం లో సర్దిపెట్టిన స్వీట్లు హోట్లు నన్ను ఎంతో ఉత్తేజపరుస్తున్నాయి. శోభనపు గదిలోకి మా ఆవిడ ఎంటర్ అవగానే తనతో ఎలా మాట్లాడాలి అని నాలో నేను ప్రాక్టీసు చేస్తున్నాను.

కొన్ని సినిమాల ద్వారా నాకర్థం అయింది ఏంటంటే అసలు విషయం ప్రారంభించే ముందు...

తన చేతిలోని పాల గ్లాసు తీసుకుని సగం పాలు నేను తాగి సగం పాలు తనచేత తాగించాలి. సుతారం గా మంచం వరకు తనని తీసుకెళ్ళి నేను కూడా పక్కన కూర్చోవాలి. నా ఫ్లాష్ బ్లాకు గురించి తనకి చెప్పి తన ఫ్లాష్ బ్యాక్ వినాలి. ఆ తరువాత నువ్వే నా సర్వస్వం ఇప్పుడు మనం ఇద్దరం కలిపి మన జీవితాన్ని ఒకే జీవితంగా గడుపుదాం అని చెప్పాలి.

వీలయితే నాలుగు మాటలు, కుదిరితే గ్లాసుడు పాలు తరువాత ఇద్దరం కలిసి "ఈ రేయి తీయనిది ఈ చిరుగాలి మనసైనది" అని ఒక పాట పాడాలి. పాట చివరలో ఇద్దరం మంచం మీద ఎదురెదురుగా కూర్చొని ఉండగా నేను మా ఆవిడ రెండు భుజాల పైన చెయ్యి వేసి సుతారంగా పడుకోబెట్టాలి.

ఇలా నేను జరగబోయే మా శోభనపు తీయని అనుభవాల గురించి ఆలోచిస్తూ ఆలోచిస్తూ తేరుకునేసరికి చాలా సమయం గడిచిపోయినట్టు అనిపించింది. ఇంకా ఆవిడ రాలేదేంటి. అదేనండి మా ఆవిడ. గదిలోంచి బయటకు వెళ్లి చూసాను. ఆశ్చర్యం అమ్మలక్కలు లేరు, మా ఆవిడా లేదు.

బయటకి రావటానికి శోభనపు పెళ్ళికొడుకుని కదా కొంచెం మొహమాటం వేసింది. భోజనం పెట్టేసి హడావిడిగా నన్ను లోపలి పంపించారు. ఆవిడని ముస్తాబు చేసి పంపిస్తారు కాబోసు అని నేను లోపలి వచ్చి కలలుకనే సరికి 8:30 అయింది.

ఎక్కడ వీళ్ళు. మా ఆవిడ ఎక్కడ. అని అనుకుంటూ ఇల్లు మొత్తం కలియదిరగడం ప్రారంభించాను. ఇల్లంతా నిశ్శబ్దం.

పల్లెటూరిలో ని ఇళ్ళ గురించి వేరే చెప్పాలా. ముందంతా బోలెడంత వాకిలి. హాలు, హాలుకి ఇరువైపులా రెండు బెడ్ రూములు. వంటగది.

అరే, ఎవరూ కనిపించరేమిటి???

మామయ్యగారు కూడా కనబడట్లేదు అనుకుంటూ నేను పెరటి వైపుగా వచ్చాను. అక్కడ కనిపించారు మామయ్య గారు తన స్నేహితులతో పేకాడుతూ.

నన్ను చూసి కొంచెం ఆశ్చర్యం తో "ఏంటండీ అల్లుడు గారు, మీరు ఈ సమయం లో ఇక్కడ, ముహూర్తం దాటి పోతోంది కదా" అని అడిగారు.

"మీ అమ్మాయి కోసమే వెతుకుతున్నానండి. ఎక్కడుందండి." అనికొంచెం మొహమాటం తో అడిగాను.

"అదేంటి అల్లుడు గారు, అమ్మాయి లోపలికి రాలేదా? ఒసేయ్ వరాలు, వరాలు" అని నేను వెతికినట్టే మా మామయ్య గారు వెతకడం ప్రారంభించారు.

కాకపోతే నేను ఇంట్లో ఎక్కడైనా ఒక చోట మా ఆవిడ కనిపిస్తుంది అనే ఉద్దేశ్యంతో వెతికితే అతనికి రోజూ ఇలా వెతకడం అలవాటు కాబోలు ఇంట్లో వీళ్ళు కనబడరు అని తెలిసి నా కోసం వెతుకుతున్నట్టు వెతుకుతున్నారు.

వాళ్ళు కనబడకపోయే సరికి నా దగ్గరకి వచ్చి "అల్లుడు గారు, ఇలా కూర్చోండి. టీవీ చూస్తూ ఉండండి. ఈ లోపు నేను వాళ్ళని తీసుకుని వస్తాను" అని టీవీ స్విచ్ ఆన్ చేసారు.

టీవీలో నీలం రంగు దర్శనమిస్తోంది. "కేబుల్ ప్రాబ్లం అనుకుంటా" అని ఏదో ఒకటి మాట్లాడాలి అన్నట్టు మాట్లాడాను.

అసలే ఒళ్ళు మండిపోతోంది. శోభనం గురించి చిన్నప్పటి నుంచి (అంటే సినిమాలలో చూసి) ఎన్ని కలలు కన్నాను. నా తొలిరాత్రి జీవితం లో మరచిపోలేని అనుభూతిని మిగులుస్తుంది అనుకుంటే ఈ విధంగా అవుతుందని ఎక్కడో మండుతోంది.

అయినా గదిలోకి పంపించడానికి కదా వాళ్ళందరూ ముస్తాబులు, చమత్కారాలు చేసుకున్నారు. ఈ లోపు మా అత్తగారు మా ఆవిడ చెవిలో ఏదో గుసగుసలాడారు. ఎలాగో లోపలికి వస్తుంది కదా అని నేను మా ఆవిడని దొంగ చాటుగా గమనించడం బాగోదని లోపలి వచ్చేసాను.

ఈ లోపు టీవీకి కేబుల్ కనెక్షన్ ఇచ్చిన మా మామగారు నన్ను పిలిచేసరికి ఆలోచనల్లోంచి బయటకి వచ్చాను.

"అల్లుడుగారు, కేబుల్ ప్రాబ్లం లేదండి. నేనే ఈ వైర్ తీసేసాను. లేకపోతె ఆడమేళం మొత్తం ఇక్కడే ఉంటారు" అని చెప్పి వాళ్ళని వెతకడానికి బయటికి వెళ్లారు.

టీవీ చూసే మూడ్ లేదు. అసలు ఏ మూడ్ లేదు. మా ఆవిడ మీద నాకు చాలా కోపం గా ఉంది. అప్పుడు తెలీదు నా జీవితం మీద నాకే జాలి వేసే స్థితి వస్తుందని.

ఏదో సీరియల్ వస్తోంది టీవీ లో

ఆ సీరియల్ కింద పెద్ద పెద్ద అక్షరాలలో స్క్రోలింగ్

"ఇదే ఈ సీరియల్ చివరి ఎపిసోడ్. ఇదే ఈ సీరియల్ చివరి ఎపిసోడ్"

టీవీ లో పాత్రలు ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా ఏవో మాట్లాడుకుంటున్నాయి.

గంభీరం గా ఉన్న ఒక ఎభయి అయిదేళ్ళ ముసలావిడ నిగ నిగ లాడే నల్ల జుట్టులో, ఒంటి నిండా భారీ నగలతో దట్టమైన మేకప్ తో ఎదురుగా ఉన్న ఇరవై అయిదేళ్ళ అమ్మాయితో అంటోంది.

"ఇదేనా నీ నిర్ణయం"

ఏడుపు మొహం తో ఉన్న ఆ అమ్మాయి చెక్కు చెదరని మేకప్ తో ఉంది. నగల షాపులోని నగలన్నీ ఈ అమ్మాయి వంటి మీదే ఉన్నాయి.

ఆ ముసలావిడకి సమాధానం గా "అవును ఇదే నా నిర్ణయం" అని అంది

"అలా అయితే నువ్వు ఎటువంటి సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందో నీకు వేరే చెప్పక్కర్లేదు" అని ఆ ముసలావిడ

"నాకు తెలీదా పిన్నీ. ఇలాంటి సమస్యలు వస్తాయనే కదా నువ్వు నిన్నే మోసం చేసుకుని జీవిస్తున్నావు"

"జీవితం అంటేనే సమస్యల వలయం తల్లీ. పెద్దదాన్ని నేనెందుకు చెబుతున్నానో అర్ధం చేసుకో"

"అర్ధం చేసుకున్నానుగాబట్టే నా నిర్ణయాన్ని మార్చుకోలేను"

"ఇదే ఆఖరి సారి అడుగుతున్నాను. ఇదేనా నీ నిర్ణయం"

"ఇదే ఆఖరి సారి చెబుతున్నాను. ఇదే నా నిర్ణయం"

"ఇరవై అయిదేళ్ళ పిల్లవి జీవితం గురించి నీకేం తెలుసు"

"నాకేం తెలుసో ముందు ముందు నీకు తెలుస్తుంది"

"ఇదేనా నీ ఆఖరి నిర్ణయం"

"అవును ఇదే నా ఆఖరి నిర్ణయం"

'తిక్క కుదిరిందా' సీరియల్ లో విరామం అని ఒక ఫిమేల్ వాయిస్ లౌడ్ స్పీకర్ లో అరిచింది.

నిర్ణయం నిర్ణయం అంటారు తప్ప వాళ్ళ నిర్ణయం ఏంటో అర్ధం కావట్లేదు.

ఇదేంటి మా మామయ్యగారు ఇంకా కనబడట్లేదు. అయన స్నేహితులు కూడా మామయ్యతో పాటే వెళ్ళిపోయారు.

వీళ్ళంతా ఎక్కడికి వెళ్లినట్టు. నాకర్ధం కాలేదు.

మళ్ళీ సీరియల్ ప్రారంభం అయింది.

మిస్ అయిన వాళ్ళు చూస్తారని మళ్ళీ అదే సీన్ రిపీట్ చేస్తున్నట్టున్నారు.

"ఇదే ఆఖరి సారి అడుగుతున్నాను. ఇదేనా నీ నిర్ణయం" అని పెద్దావిడ వాయిస్

"ఇదే ఆఖరి సారి చెబుతున్నాను. ఇదే నా నిర్ణయం" అని చిన్నావిడ వాయిస్.

ఏంటో డైలాగులు కోరస్ లో వినబడుతున్నాయి ఈ సారి అనుకుంటూ పక్కకి తిరిగి చూస్తే సీరియల్ లో లీనమయిపోయిన మా ఆవిడా, మా అత్తగారు కలిసి ఆ సీరియల్ నటులతో పోటీగా డైలాగులు రిపీట్ చేస్తూ అక్కడే ఉన్న సోఫా లో కూర్చున్నారు. పక్కింటి బామ్మగారు, ఇంకా మా ఆవిడ స్నేహితురాలు కూడా సీరియల్ లో లీనమయిపోయారు.

మా మామయ్యగారు నా వద్దకి వచ్చి.

"ఇదీ బాబు వరస. రోజూ సీరియల్స్ లో నిమగ్నమయిపోతారు.చుట్టు పక్కల ఏం జరిగినా పట్టించుకోరు. ఇంట్లో కేబుల్ కనెక్షన్ తీయించేస్తే ఒక దారికి వస్తారేమో అనుకుంటే పక్కింట్లోకి ఎదురింట్లోకి వెళ్లి టీవీ చూస్తున్నారు. అందుకే ఈ కేబుల్ వైర్ ని నేనే దాచేస్తూ ఉంటాను. కాని ఇవాళ కూడా వాళ్ళు సీరియల్స్ కోసం పక్కింటికి వెళ్తారని ఊహించలేదు. నన్ను క్షమించండి అల్లుడుగారు. క్షమించండి" అని గుమ్మడి స్టైల్ లో ప్రాధేయపడుతున్నారు.

అసలే శోభనం గదిలోకి మా ఆవిడ రాలేదని నేను బాధపడుతుంటే మా మామయ్య గారు కొత్త బాంబు పేల్చారు. రోజూ ఇదే వరసంటే ఎలా వేగేది.

భవిష్యత్తు గురించి త్వరలో ప్రణాళికలు వేసుకోవచ్చు అనుకుంటూ ... "పర్వాలేదు మామయ్యగారు, ముందు మీ అమ్మాయిని లోపలి పంపించే ఏర్పాటు చెయ్యండి" అని నవ్వు బలవంతంగా తెచ్చుకుంటూ చెప్పాను.

"మీరు లోపలి వెళ్ళండి అల్లుడు గారు, వెంటనే పంపించే ఏర్పాటు చేస్తాను" అని అన్నారు.

నేను లోపలికి వచ్చాను.

ఇప్పటికైనా మా ఆవిడ లోపలికి వస్తోందని తెగ సంతోష పడ్డాను.

తను రాగానే నేను ఎలా మాట్లాడాలో మళ్ళీ ప్రాక్టీస్ చేసుకున్నాను. కాని అనుకోని పరిణామం ఎదురయింది.

చేతిలో పాల గ్లాసుతో వస్తుందనుకున్న మా ఆవిడ శోభనపు గదిలోకి పోర్టబుల్ టీవీ తో ఎంటరయింది.

"ఏంటి హారిక, ఈ టివి ఏంటి"

"ఈ టీవీ కాదు, మా టీవీ. మాటీవీలో ఈ సీరియల్ ఆఖరి ఎపిసోడ్ ఇవాళ. పుట్టి బుద్దెరిగినప్పటి నుండి టీవీ సీరియల్లోని ఆఖరి ఎపిసోడ్ చూడలేదు. కాబట్టి, ఏవండీ ప్లీజ్ ఈ సీరియల్ నన్ను చూడనివ్వండి."

"అదేంటి హారిక, ఇవాళ మన శోభనం"

"శోభనం ఎప్పుడైనా చేసుకోవచ్చండి. కాని సీరియల్ లో ని ఆఖరి ఎపిసోడ్ మాత్రం ఎప్పుడు పడితే అప్పుడు రాదండి. తర తరాలు ఎదురు చూడాలి. పుష్కరణిలో లో స్నానం చేస్తే ఎంత పుణ్యమో, టీవీ సీరియల్ ఆఖరి ఎపిసోడ్ చూస్తే అంత ఆనందం" అని తను చక్కా టీవీ ఆన్ చేసి కేబుల్ వైర్ అడ్జస్ట్ చేసి సీరియల్ చూడడంలో నిమగ్నమయిపోయింది.

ఆఖరి ఎపిసోడ్ ఆఖరి ఎపిసోడ్ అని ఆ సీరియల్ మొదట్నుంచి ప్రసారం చేసారు. ఆ ఎపిసోడ్ అయ్యే సరికి మర్నాడు ఉదయం అయింది.

మా శోభనం పోస్ట్ పోన్ అయిందని వేరే చెప్పాలా... ఆ తరువాత వారం రోజులకి టీవీ సీరియల్ రాని సమయంలో టీవీ పుణ్యమా అని మా శోభనం జరిగింది.

ఇంతకీ మా అత్తగారు మా ఆవిడ చెవిలో చెప్పిన మాటలు తెలుసుకోవాలనుందా? "మర్చిపోయానే, ఇవాళే 'తిక్క కుదిరిందా' సీరియల్ ఆఖరి ఎపిసోడ్".

***************




"రైట్, రైట్" కండక్టర్ అరవడంతో బస్సు బయల్దేరింది.

బస్సంతా జనంతో నిండి ఖాళీ పాలిథిన్ సంచులు కూరిన జనపనార బస్తాలా వుంది.

రక రకాల వాసనలు కలగాపులమై ఓ విచిత్రవాసన బస్సంతా నిండివుంది. ఓ పక్క బయట ఎండ, లోపల ఇసకేస్తేరాలకపోవడం కాదు... గాలి వీచే అవకాశం లేక ప్రాణాలన్నీ విలవిల్లాడిపోతున్నాయి. అందులో... నుంచుని వున్న నాలాంటి ప్రయాణీకులు ఆక్సిజన్ అందక గిలగిల్లాడి పక్కకి వాలిపోయే పరిస్థితి ఇంకొద్ది సేపట్లో దాపురించే లోపల బస్సు కదలటంతో శరీరంలో ఓ చిన్న భాగానికి కాస్త గాలి సోకి శరీరాని కంతటికీ ఆహ్లాదాన్ని పాకించింది.

బస్సు నింపాదిగా వెలుతోంది. "టికెట్... టికెట్" కండక్టర్ అరుపులు దూరంగా వినిపిస్తున్నాయి. సీట్లో కూర్చున్న వాళ్ళు

అందునా కిటికీ పక్కన కూర్చున్న వాళ్ళు సుడిగల వాళ్ళు. చచ్చాక యమలోకానికి వెళ్ళాక బహుశా వాళ్ళు నరకానికి మేము స్వర్గానికీ వెళతామేమో! ఎందుకంటే అంతకన్నా ఘోరమైన నరకం ఇక్కడ అనుభవించేశాము కదా! ఇలాంటి పరిస్థితుల్లో కూడా తమాషాలు ఊహించుకుని నవ్వుకోవడం బహుశా నాకే సాధ్యం అనుకుంటా. బయట వెలుతురున్నా లోపలికి ప్రసరించడంలేదు... మసక మసకగా వుంది. కాళ్ళు తిమ్మిరెక్కుతున్నాయి. కాస్త జరిపాను. అంతే "ఏంది సారూ అక్కడ టమేటాల గంప వుంది... దాని మీద కాలేస్తే అవి సితికి పోయి మాకు వారం రోజులు కూడుండదు. జరా సూసుకో." నా పక్కనున్న ముఖం నా ముఖం మీద వాలి బీడి కంపు చేస్తూ రిక్వెస్టూ కమాండింగూ కలిపిన వాయిస్తో దమాయించింది. నా కాలు యధాస్థానానికి తెచ్చే ప్రయత్నంలో ఓడిపోయాను కారణం అక్కడెవరిదో మరో కాలుంది. చేసేదేంలేక అలాగే ఒంటి కాలుమీద కొంగ జపం మొదలెట్టాను.

బస్సు చాలా పాతదనుకుంటా రణగొణధ్వనిలా వుంది. "టికెట్... టికెట్" అరుపు కాస్త దగ్గరకి వచ్చింది. ఒక చెయ్యి నా ముఖం ముందు కొచ్చింది. టికెట్ తీయడానికి నేను అతికష్టం మీద చేయి ప్యాంటు జేబుమీద పెట్టి హతాశుడనయ్యాను. నా పర్సు లేదు. గుండె చల్లబడిపోయింది. దాన్ని చేతితో సంరక్షించుకోవాల్సింది. పొరబాటుచేశాను. "ఏంటి సారూ.. చేతులు నా ప్యాంటు లో పెడుతున్నారు నేను చాలా జాగ్రత్తగా ఉంటా నా పర్సులు ఎవరూ కొట్టలేరు" అని నవ్వాడు నాకు కొద్దిదూరంలో వున్న వ్యక్తి. నేను అతని ప్యాంటుజేబులో చేయి పెట్టానా? మరైతే నాది? అతి కష్టం మీద నన్ను నేను గిల్లుకుంటూ చేతిని జేబుస్థానానికి పంపి పర్స్ చూసుకున్నాను వుంది. హమ్మయ్య! అదృష్టవంతుడ్ని పర్స్ పోతే ఇంకేమైనా ఉందా డబ్బులన్నీ అందులోనే వున్నాయి. తిరుమల శ్రీనివాసుడు నా యందు వున్నాడు. దాన్ని జాగ్రత్తగా పైకి తెచ్చి యాభై నోటు తీసి ఆచేతిలో పెట్టాను. ఒక నిమిషం ఆ చెయ్యి అదృశ్యమయ్యి మళ్ళీ ప్రత్యక్షమైంది టికెట్ తో కాని చిల్లరలేకుండా. కనీసం టికెటన్నా దక్కినందుకు కాస్త ఉపశమనంతో దాన్ని అందుకుని జేబులో భద్రపరచుకున్నాను.

బస్సు ఏదో స్టాపులో ఆగింది.

నేను ఇంకా రెండు స్టాపుల తర్వాత దిగాలి. బస్సులోంచి ఎవరూ దిగలేదు కాని కొంతమంది ఎక్కినట్టుగా అనిపించింది... ఇంకాస్త ఇరుకయ్యేసరికి. నేను దిగి సోడా తాగి కాస్త గాలి పీల్చుకోవాలనుకున్నాను. కాని కదలడానికి స్థలం లేనప్పుడు ఇంకా ముందుకెళ్లడమెలాగ? పదిహేను నిమిషాల తర్వాత నాకు శోషవచ్చి పడిపోయేంతలో బస్సు బయల్దేరింది. మళ్ళీ ఓ సన్నగాలి శరీర భాగాల్లో ఎక్కడో తాకి జీవం పోసింది.

నాకు బస్సు ప్రయాణాలంటే ఫోబియా. అందులో శుభముహూర్తాలున్న ఇటువంటి రోజుల్లో ప్రయాణమంటే అది నరకసదృశ్యమే! మేగ్జిమం నేను అవాయిడ్ చేస్తాను. కాని అప్పుడప్పుడు ఆఫీసు పనిమీద ఇన్స్పెక్షన్లకి అర్జెంటుగా వెళ్ళవలసి వస్తుంది. అదీ ఒక గంట కోసం. అప్పటికప్పుడు రైల్లుండవు... ఒకటీ ఆరా వున్నా ప్రయాణం భయానకం. అందుకే తప్పనిసరై బస్సెక్కుతా. ఇలా తిప్పలు పడతా. నాకింకా లగేజ్ లేదు కాబట్టి సరిపోయింది అది వున్న వాళ్ళ పరిస్థితి ఏమిటో? బస్సు వేగంగా టర్న్ అయింది. అందరం ఒకరిమీద ఒకరం పడిపోయాం. "డ్రైవరన్నా జెర జూసే..." ఎవరో గట్టిగా అరిచాడు. మగాళ్ళమైన మాకే ఇలా వుంటే ఇంక

ఆడవాళ్ళ పరిస్థితి ఎలా వుంటుందో? పాపం! ఏవేవో దుర్గంధ వాయువులు బస్సంతా ఆక్రమించాయి. అవి స్తంభించిన గాలికి తోడై కదలిక లేక మేము ముక్కుమూసుకునే అవకాశం లేక గిలగిల్లాడిపోయాం.

భగవంతుడా ఏమిటీ బాధ? స్వాతంత్ర్యం వచ్చి ఇంతకాలమైనా మన రవాణా వ్యవస్థ ఇంత అధ్వాన్నంగా ఉందేమిటి?. ప్రయాణికులకి రోజూ నరకమేనా? దీనికి ప్రత్యామ్నాయం లేదా? బస్సు మరో స్టాపులో ఆగింది. ఏ దేముడి వరమో ఓ పదిమంది దాగారు. మా బస్సుకున్న కిటికీలు కనిపించాయి. బట్టలు తడిసిముద్దై ఒంటికి అతుక్కుపోయి వాసనేస్తున్నాయి. బస్సు బయల్దేరింది. కొద్ది దూరం వెళ్లి ఆగిపోయింది. మాకెందుకో అర్థం కాలేదు. చెకింగ్ స్క్వాడ్ గబగబా ఎక్కి టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు. నేను నా టికెట్ జేబు లోంచి జాగ్రత్తగా బయటికి తీశాను. దగరకొచ్చిన ఇన్స్పెక్టర్ కిచ్చాను. ఆయన దాన్ని పరీక్షించి అది డూప్లికేట్ అన్నాడు. నా పై ప్రాణాలు పైనే పోయాయి. కంప్లైంట్ రాసి ఫైన్ వేశాడు. టికెట్టు లేకుండా ప్రయాణించడం నా వ్యక్తిత్వ విలువలకి విరుద్ధం. నేను చేయని తప్పుకి శిక్ష అనుభవించాను. నేనూ నాలాంటి వాళ్ళం అయిదుగురమున్నాం. మేము జరిగింది ముక్త కంఠంతో చెప్పాము. చివరికి ఆయన "మీరందరూ చదువుకున్న వారు... మోసపోయామని చెప్పడానికి సిగ్గేయడం లేదూ" అని ముక్తాయింపునిచ్చి నవ్వుతూ మిగతా వాళ్ళతో కలసి దిగిపోయాడు. బస్సు బయల్దేరింది.

ఇప్పుడు గాలి బాగానే వీస్తోంది కాని మనసు ఆహ్లాదించలేకపోతోంది. బస్సు మరో స్టాపులో ఆగింది. నేను కాస్త దిగి సోడా తాగి బస్సెక్కాను. మళ్ళీ బస్సునిండిపోయింది. టికెట్టు కొనుక్కుని అదీ ఫైను కట్టి నుంచుని వుండడం అవమానమనిపిస్తోంది. కాని ఏంచేయను? మళ్ళీ గాలి స్తంభించింది. బస్సు బయల్దేరింది. ఈసారి వెంట్రుకంత గాలి కూడా ఏ శరీరభాగానికీ తగలడంలేదు. ఒకరికొకరం అతుక్కుని ఎంతసేపున్నామో తెలియదు. నా స్టాపు వచ్చిందని ఎవరో అదృష్టవశాత్తూ అరిచాడు... నాకు ఆశ్చర్యం కలిగింది. మరో స్టాపు నాకు తెలియకుండా ఎలా దాటేశానా అని. నేను అందర్నీ విదిలించుకుంటూ ముందుకు దూసుకు పోయాను. నన్ను అక్కడున్న వాళ్ళందరూ తోస్తూ డోర్ లోంచి బయట పడేశారు.

కాసేపు అలాగే వుండి నా అంగాంగాలని స్వాధీనంలోకి తెచ్చుకుని నెమ్మదిగా లేచి నన్ను నేను చూసుకుని కెవ్వుమని కేకేశాను... కారణం నా బట్టలు, నేను సింగరేణి కాలరీస్ లో పనిచేసి వస్తున్నట్టువున్నాయి. అక్కడక్కడ చిరిగిపోయాయి కూడా. నేను ఇన్స్పెక్టర్ ని అంటే నమ్ముతారా? గౌరవిస్తారా? పర్స్ చూసుకున్నాను. అది వుంది. తీసి చూసుకున్నాను. గుండె రాజధాని ఎక్స్ప్రెస్ లా స్పీడ్ గా కొట్టుకుంది. పర్స్ వుంది కాని అందులో డబ్బు నా ఐడెంటిటీ కార్డు లేదు. అసలు దొంగతనం అలా ఎలా చేశాడో? నాకు పిచ్చెక్కి పోతోంది. ఇహ ఇన్స్పెక్షన్ అయ్యేపనికాదు. చేతిలో చిల్లిగవ్వ లేదు. వెనక్కి వెళ్ళడమే బెటర్. డబ్బులేదు కాబట్టి హాయిగా నడుచుకుంటూ వెళతా. అదే నయం. అనుకుని ఇంటిదారి పట్టాను.

(పండగల సీజన్లో బస్సు ప్రయాణం చేసిన వారి జీవితం ఎంత దుర్భరమో అనుభవించి... ఓ ట్వంటీపై పర్సెంట్ కల్పించి రాసినది ఈ విషాద హాస్యకథ)




అరవై ఏళ్ళకు పైబడ్డ బిలియనీర్ అయిన మా ఆయనకు నేను ఇరవై మూడేళ్ళ మొదటి భార్యను, బహుశా చివరి భార్యను కూడా. వారి దగ్గర నా కోసం క్షణం తీరిక ఉండదు? ఓ ముచ్చట మురిపెం లేదు, పెళ్ళయిన ఈ మూడేళ్ళ నుంచి!

వారికెప్పుడూ బిజినెస్ గొడవలే! ఆ మీటింగ్ ఈ మీటింగ్ లని, బిజినెస్ ట్రిప్పులని రాత్రులు కూడా కానరాకుండా ఉంటారు. నా ఈ ఏకాంతంలో టి.వి., కేబుల్ చానల్స్, వి.సి.ఆర్., కథలు, నవలలు తప్ప వేరే మార్గం లేదు రాత్రులు గడపడానికి.

అడపాదడపా ఫైవ్ స్టార్ హోటల్లో ఏదో బిజినెస్ మీటింగ్ ఉందని, ఫారెన్ డెలిగేషన్ వస్తుందని నన్ను బ్యూటీ పార్లర్ కు పంపించి ఏ

మిస్ బ్యూటీకి తక్కువ కాకుండా నన్ను తయారుచేయించి కూడా తీసుకువెళ్లుతారు మా ఆయన.

అర్ధరాత్రి దాటే వరకు నన్ను వచ్చిన ఆ ఫారెన్ వెధవల పోకిరి వేషాలు సహించడానికి వదిలేసి ఎక్కడికో మాయమైపోతారు.

తెలతెల్లారుతుండగా మా ఇంటి డ్రైవరు మా ఆయన నన్ను వదిలేసిన హోటల్లో నుంచి మా బంగళాలో దింపేసి వెళ్ళుతాడు. ఇలా జరిగినప్పుడల్లా రెండు మూడు రోజులు నన్ను తప్పుకొంటూ తిరుగుతారు మా ఆయన. ఆ తర్వాత మళ్ళీ మామూలు డైలాగులు...

'ఓ...హనీ...సారీ... ఐ యామ్ వెరీ బిజీ...బట్... యూ నో... వుయ్ గాట్ టెన్ మిలియన్ డాలర్స్ ప్రాజెక్ట్... ఫర్ ఇనిషియల్ స్టేజ్'

ఏడ్వాలో... నవ్వాలో తెలియని సందిగ్దంలో మా ఆయన వైపు తీక్షణంగా చూస్తూ... చివరికి చిరునవ్వుతో ఒకరినొకరు చూసుకునే దృశ్యాన్ని ముగిస్తాను.

క్లబ్ లకు వెళ్ళడం బోర్ కొట్టుతుంది. కొన్నాళ్ళ నుంచి ఆడవాళ్ళ స్నేహంతో, వాళ్ళ కబుర్లలో విసిగి పోయాను. కొద్ది రోజుల నుంచి మగాళ్ళ స్నేహం నాకు ఓ.కె. లా అనిపిస్తుంది. వాళ్ళతో కబుర్లాడటం నాకు సరదాగా ఉంటుంది. నా పట్ల నా పరిస్థితుల పట్ల వాళ్ళ సానుభూతి కోరడం నాకు అలవాటై పోయింది. కొందరు మగాళ్ళు దీన్ని మరో విధంగా తీసుకొని చొరవ తీసుకున్నారు. ఆ కొందరిలో నేను ఓ హాండ్సమ్ చేతిలో చిక్కిపోయాను. నాకు అతడి పొందు కావాలి. అతడికి నా డబ్బు కావాలి.

అలా కొన్నాళ్ళు గడిచాయి. అతడితో విసిగిపోయాను అని చెప్పుకోవడం కంటే అతను నన్ను మరో విధంగా ఉపయోగించుకొంటున్నాడని చెబితే సరిగా ఉంటుంది. మా వారికి ఈ విషయం తెలిసినా తెలియనట్లుగా నటించారు?

ఓ సారి షాపింగ్ సెంటర్ లోఅనుకోకుండా, నా నిగ్రహాన్ని అధిగమించి, నా అధీనంలో లేకుండానే నా కళ్ళచూపు ఓ యువకుడితో ఆకట్టుకున్నాయి. ఎంత ప్రయత్నించినా, అప్రయత్నంగానే నా మనసు అతడి వైపే లాగసాగింది. నా శరీరంలో అవ్యక్తమైన బావతరంగాలు ఉవ్వెత్తున లేచాయి.

అతడితో మాటలు కలిపాను సేల్స్ మేన్ అయి ఉంటాడని నటిస్తూ.

'మీ లాగే నేను కూడా ఓ కస్టమర్నే' అని అన్నాడు ఆ యువకుడు నవ్వుతూ, జబ్బలెగరేస్తూ.

'ఏమేమి కన్స్యూమ్ చేస్తార'ని చిలిపిగా అడిగాను.

'మంచిగా అనిపించేవన్నీ?' నా కళ్ళలోకి సూటిగా చూస్తూ చెప్పాడు. అతని పెదవులపై చిరునవ్వులు.

క్లుప్తంగా ఒకరినొకరం పరిచయం చేసుకున్నాం. కాలక్రమేణా మా పరిచయం పెరిగింది.

ఐస్ క్రీములతో మొదలైన మా మీటింగ్ స్థలాలు నైట్ క్లబ్బుల్లోకి చేరాయి. సమయం, సందర్భాలు చూసి ఆయువకుడు నన్ను కవ్వించే స్థలాలను స్పర్శించేవాడు. నాలో లావా బ్రద్దలవుతూండగా నన్ను జుర్రుకునేవాడు. మంచి రసికుడు. అతడితో లేచిపోదామని ప్లాన్ వేశాను. అతడితో చెప్పాను. ఉప్పొంగి పోయాడు. కాని నా ప్లాన్ అతడికి నచ్చలేదు.

ఇందులో అనుమానాలకు అవకాశం ఎక్కువగా ఉంది? పైగా రిస్క్. మీ ఆయన ఎంత బిజీగా ఉంటారో అంతే నేర్పుతో మీపై నిఘా వేసి ఉన్నాడు! అని చావు కబురులాంటిది చల్లగా చెప్పాడు, త్రీ స్టార్ హోటల్లోని లాంజ్ లో డిమ్ లైట్ లో వెలుగుతున్న నా మొహాన్ని చూస్తూ.

'నీకెలా తెలుసు?' అని భయభ్రాంతురాలైన నేను, గుండె వేగంగా కొట్టుకుంటుండగా అడిగాను.

మీరిస్తున్న రెస్పాన్స్ ను బట్టి మీ ఆచూకీ తీశాను. గొప్పోళ్ళతో ఇలాంటి సంబంధాలు పెట్టుకొంటే ఓ రోజు ప్రాణం మీదికి వస్తుందని నాకు తెలియకపోలేదు. ఎక్కడ... ఎవరు నన్ను గప్ చిప్ గా మింగేస్తారో తెలియదు? ఇది అండర్ వరల్డ్ రీతి, సీరియస్ గా చెప్పాడు.

అతడు చెప్పిన విషయాలు వింటూంటే... చివరికి నా భవిష్యత్తు ఎలాంటి బీభత్సానికి దారితీస్తుందో... అని ఓ వైపు నాకు భయంగా కూడా ఉంది.

అతని చేతిని గట్టిగా అదిమిపట్టుకొంటూ, 'ఈ భయాందోళన నుంచి దూరంగా... ఏ పర్వతాల పైకో, ఏ మేఘాలను దాటో... కొన్ని రోజులు ఈ లోకాన్నే మైమరచి, నిద్రాహారాలు మాని... ఏకమైపోలేమా?' అన్నాను.

'అదెంత పని?' అని ఓ ఫ్లయింగ్ కిస్ నాపై విసిరాడు.

కొన్ని నిమిషాలు మేము వేయబోయే ప్లాన్ గురించి తర్జనభర్జనలు పడి, హోటల్ నుంచి మా గమ్యాల వైపు బయల్దేరాం?

***

***

***

అణువు అణువునా హిమజ్వాలలా రగిలిన నా శరీరం ఈ మూడు రాత్రుల్లో నాకెంతో తృప్తిని, హాయినొసగాయి.

మా మూడు రాత్రుల ఏకాంత కలయిక ఎగ్రిమెంటు తెల్లారితే పూర్తవుతుంది.

వేకువ జాముననే లేచి, తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతూ అతడి పేర నా అంగీకారం ప్రకారం లక్ష రూపాయలు చెక్కు రాసి, గాడనిద్రలో ఉన్న అతడిని లేపాను.

నిద్రలో ఎర్రబడ్డ కండ్లతో నా చెక్కును చూశాక అతడి మొహం వికసించింది.

అమాంతంగా బెడ్ మీదనుంచి లేచి తన కౌగిలిలో బంధిస్తూండగా మొబైల్ ఫోను మోగింది.

మొబైల్ ఫోన్ స్క్రీన్ లో వచ్చిన నెంబరు వైపు చూస్తూ... నా పెదవులు విప్పవద్దని సైగ చేస్తూ...

'హలో... హరిప్రియ హియర్... ఆ... చెప్తున్నాను... మీ విలువైన సమయాన్ని వృధాచేయకుండా క్లుప్తంగా... మీరనుకొంటున్నట్లు మీ మిసెస్... ఎలాంటి గూఢచారి గొడవలు లేవు... మీ బిజినెస్ రైవల్స్ తో ఆమెకెలాంటి సంబంధాలు కూడా లేవు. నా ప్లాను ప్రకారం మీరు ఆమెను కోడైకనాల్ కు ఒంటరిగా బిజినెస్ ట్రిప్ కని పంపించి, ఆమెపై నిఘావేసి, నిజానిజాలు బయట పెట్టాలనే మన ఒప్పందం కదా. కాని ఐ యామ్ వెరీ సారీ టు ఇన్ఫామ్ యు దట్... ఆమె అమాయకురాలు. మీ బిజినెస్ సీక్రెట్స్ ఆమె ఎవరికి అందించలేదు. ఆమెను కనీసం చూడటానికైనా ఎవరూ రాలేదు. పైగా ఆమె ఉన్న హోటల్ రూంకు ఓ ఫోన్ కాల్ కూడా... రాలేదు... ఆమె దగ్గర ముబైల్ ఫోన్ కూడా లేదని ఆరా తీశాను... సో... మీ టైం ఇంకా వేస్ట్ చేయకుండా నా ఎక్స్ పీరియన్స్ ప్రకారం... ఆమె కేవలం... అన్ సాటిస్ ఫైడ్... ఉమెన్ లా ఉంది... ఉంటాను సార్ మరి... హలో... హలో... మిస్టర్ పట్టాభిరాం... మీరు పంపించే నా ఫీజు రెండు లక్షలు తీరా దుబాయ్ నుంచి నా అకౌంట్ లో వేయించగలరు... ఓకే బై బై...

ఫోను పై అతని సంభాషణ వింటూన్న నేను, అతని కౌగిలిలో నుంచి విడిపోయాను.

డబుల్ క్రాస్ గురించి విన్నాను. చదివాను, ఇప్పుడు అనుభవించాను.

స్త్రీని అరిటాకు అని పెద్దలెందుకన్నారో ఇప్పుడర్థమైంది.




ఆనందం... ఆశ్చర్యం!

పిచ్చిపిచ్చిగా ఉంది శ్రీపతికి. కూచున్న కుర్చీలోంచి ఒక్కసారి లేస్తూ వచ్చీరాని డాన్సులు చేస్తూ ఎగిరెగిరి గంతులేస్తున్నాడతడు. ఉదయం ఎనిమిది గంటలవేళ... ఆఫీసుకెళ్ళే తొందర్లో ప్లేట్లో పొగలు కక్కుతున్న వేడివేడి ఇడ్లీల్ని ఏమాత్రం ముక్కలు చేయకుండా వేసినవి వేసినట్లే గబుక్కున నోట్లోకి తోసేసుకుని నమలకుండా గుటుక్కున మింగేస్తూ... మంచినీళ్ళ గ్లాసుని పట్టుకోవాల్సిన ఎడమచేతి ఆనవాయితీని ఏనాడో విస్మరించి వ్యసనం ప్రకారం ఆ చేత్తో రిమోట్ పట్టుకుని... అత్యంత లాఘవంగా చానెల్స్ మార్చేస్తూ చిన్నితెరపై కనిపిస్తున్న ప్రతి దృశ్యాన్ని కళ్ళనిండుగా నింపుకుంటూ ప్రతి రోజూ అల్పాహారం పూర్తిచేసే పతిదేవుడు ఇవాళ ఇలా పిచ్చి పిచ్చిగా గెంతులేస్తుంటే అవాక్కయిపోయింది శ్రీపతి భార్య ఎ. ఎం. ఎం. తాయారు అలియాస్ అలిమేలు మంగతాయారు.

"ఏమైందండీ" అని గట్టిగా అరుస్తూ భుజాలు పట్టుకుని కుదుపుతూ అతడ్ని లోకంలోకి తీసుకొచ్చేందుకు చేయరాని ప్రయత్నమంతా చేస్తోందామె.

"ఏమో... ఏమైందో నాకు తెలీడం లేదు. పట్టరాని సంతోషంతో కాళ్ళు నేలమీద నిలవడం లేదు. ఇప్పటికిప్పుడు సల్సా డాన్స్ చేయాలనిపిస్తోంది..." అంటూ రెండు చేతులు పట్టుకుని ఊపేస్తూ గిరగిరా తిప్పేయసాగాడు శ్రీపతి.

"అబ్బ... ఈ ఉప్పెనలో ఊపిరాట్టం లేదు. కళ్ళు తిరుగుతున్నాయి. ఉండండీ" ఆయాసంతో రొప్పుతూ అరుస్తోంది తాయారు.

"ఊహూ.." శ్రీ పతిదేవుడస్సలు ఊరుకోవడం లేదు. పైపెచ్చు ఆ బండ గొంతేసుకుని - "ఆనందమానందమాయేనే..." అంటూ పాటెత్తుకున్నాడు.

అలా పూనకంతో వీరంగం చేస్తున్న మొగుడి చెంపని చెల్లుమనిపిస్తూ ఒక్కటిచ్చింది... ముద్దుగా ఓ ముద్దు. అంతే! ప్రకోపించిన పైత్యం కాస్త తగ్గి - "ఏమైందీ" అంటూ యాక్సిడెంటై కోమాలోకి వెళ్లి అపుడే బయటకొచ్చిన రోగిలా అయోమయంగా చుట్టూ చూస్తూ అడిగాడు భార్య అలిమేలుని.

"ఆ క్వశ్చన్ పై కాపీ రైట్సన్నీ నావే. ఏమైందంటూ ఇందాకట్నుంచీ మిమ్మల్ని నేనే అడుగుతున్నాను. ఆన్సరివ్వకుండా పిచ్చి గెంతులేస్తున్నారు"

"పిచ్చిగెంతులు కావు... సల్సాడాన్స్"

"ఎపుడు నేర్చుకున్నారటా..." ఎకసెక్కంగా అడిగిందామె.

"ఎపుడో...! ర్యాంప్ షోల్లో పార్టిసిపేట్ చేస్తున్న సినీ సెలబ్రిటీస్... మోడల్స్ ఈమధ్య చేస్తున్న డాన్స్ అదేగా..."

"వాళ్ళు సరే... ఆ డాన్స్ మీరెప్పుడు నేర్చుకున్నారనీ అర్థమయ్యేట్టు అచ్చతెలుగులో అడుగుతున్నా" కాస్త కోపంగా అడిగింది

అలిమేలు.

"అదే చెప్తున్నా... ఈలోకంలో సామాన్యుడికి సర్వకలలూ అబ్బుతున్నాయంటే కారణం... ఈబుల్లితెరే. ఇంట్రస్ట్ అంటూ ఉండాలే కానీ విశ్వంలో ఉన్న ఏ విషయమైనా ఇట్టే నేర్చుకోవచ్చు. పైగా నాలాటి ఏకసంతాగ్రాహికి ఇలాటి సల్సాడాన్స్ లు నేర్చుకోవడం ఎంతో సేపు పట్టదు. ఆ డాన్స్ ల భంగిమలు రోజూ టీవీల్లో చూస్తూనే ఉన్నాగా" చెప్తున్నాడు తన అంతరంగంలోంచి పొంగిపొర్లుతున్న అంతర్గత సృజనకి హద్దులంటూ లేవని తెలియపరుస్తూ.

"అద్సరే... ఆఫీసుకెళ్లాల్సిన టైంలో పొద్దున్నే ఈ ప్రోగ్రాం ఎందుకు పెట్టారో? అది తెలికే నేను నెత్తీనోరు బాదుకుంటున్నా"

"అంతపని చేయకు..."

"అయితే... నాన్చక అసలు విషయం చెప్పండి... అలా పిచ్చిగెంతులెందుకు వేసారు?"

"పిచ్చిగెంతులు కావని చెప్పానా?"

"సర్సరే... నాకు పిచ్చి గెంతులనిపించే మీ సల్సానృత్యాన్నే ఇంత పొద్దున్నెందుకు చేసారటా?"

"కళా ప్రదర్శనకి కాలంతో పనేముంది. ఎపుడు హృదయం సంతోషంతో పరవళ్ళు తొక్కుతుందో... ఎపుడు ఆనందం అంబరాన్ని తాకుతుందో... ఎపుడు వళ్ళంతా పులకరించి పరవశిస్తుందో అపుడు... అపుడు నాలాటి సామాన్య కళాకారులెవరైనా ఆదమరిచి డాన్స్ లు కట్టొచ్చని..."

"ఏ రాజ్యాంగంలో రాసుంది 'మగా'నుభావా?"

"చెప్పేది విను. చరిత్ర అడక్కు. అలా ఒక్కసారి టీవీ వంక చూడు..."

"చూసా...?" ఓ క్షణం టీవీవేపు కన్నార్పకుండా చూసి మళ్ళీ మొగుడు వేపు చూపు మరల్చి చెప్పింది అలిమేలు.

"ఆ డిస్కషన్ చూడు ఎంత లక్షణంగా సాగుతుందో?"

"ఇవాళ కొత్తేం కాదుగా... ప్రతిరోజూ ఇదే టైం లో ఏ న్యూస్ చానెల్ చూసినా కొన్ని డైలీ పేపర్లు ముందేసుకుని కూచున్న యాంకర్ వివిధ పొలిటికల్ పార్టీల అఫీషియల్ స్పోక్ పర్సన్స్ తో హెడ్ లైన్స్ చదువుతూ ముచ్చట్లాడుతాడు. ఎపుడూ కనిపించే దృశ్యమే కదా"

"చూడు అలిమేలు మంగతాయారూ... ఇవాల్టి డిస్కషన్ రోజూ కనిపించేది కాదు. ఆకాశంలో కనిపించే గురుచంద్రుల కలయికంత అద్భుతం. ఎపుడో తప్ప ఇలాటి దృశ్యం టీవీతెరపై కనిపించదంటే కనిపించదు. ఇంట్రస్ట్ పెట్టి ఇంకోసారి చూడు. స్టూడియోలో కూచున్న ఆ మనుషుల్లో ఏ ఒక్కరైనా చికాకుతో చిర్రుబుర్రులాడుతున్నారా? అసెంబ్లీలో అంతంత గొంతులేసుకుని అరుస్తున్నారా? లేదే? ఓ క్షణం బ్రేక్ ఇస్తే... ఒకరిపై ఒకరు చటుక్కున పడిపోయి కౌగిలించుకోవాలని ఆశపడ్తున్నట్లు లేరూ...? ఎంత అభిమానంగా పలకరించుకుంటున్నారో? ఎంత ఆప్యాయతని ఒలకబోస్తున్నారో? ఎంత గౌరవాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నారో? సందు దొరికితే చాలు తెలుగు భాషలో కొత్త తిట్లు కనిపెట్టి మరీ తిట్టడంలో ఎక్కడలేని ప్రావీణ్యతని సంపాదించుకున్న మన రాజకీయనాయకులేనా వీళ్ళు? టీవీ స్టూడియోలో ఇంత సామరస్యంగా కూచుని డిస్కస్ చేస్తున్నారు. పక్కపార్టీవాడు ఏది చెప్పినా కాదనడమే ఒకానొక లక్ష్యంగా ఒంటికాలిపై లేచి వీరావేశం ప్రదర్శించే మనవాళ్ళేనా... ఈ సమ్మర్ లో ఇంత కూల్ గా మాట్లాడుతోంది? వాళ్ళలో ఎంత వినయం కనిపిస్తోంది? చూస్తుంటే నాకళ్లలో నీళ్ళు కారుతున్నాయి. దాంతో... ఏదో తెలిని భావావేశంతో పూనకం వచ్చినవాడిలా ఊగిపోయా. వీరావేశంతో సల్సా డాన్స్ కట్టా" పట్టరాని ఆనందంతో ఛాతీ విశాలమవుతుండగా అంతరాయం లేకుండా అనర్గళంగా చెప్తున్నాడు శ్రీపతి.

"ఏమోనండీ... నాకలా ఏం అనిపించడం లేదు" నిర్మోహమాటంగా అంది అలిమేలు.

"అందుకే...ఎపుడూ సీరియల్సే కాదు అపుడపుడూ న్యూస్ ఛానల్స్ చూడమని నీకు చెప్తోంది" తను గమనించిన అంశాన్ని అర్ధాంగి గమనించలేదనే అసహనం అతడి మాటల్లో ధ్వనించింది.

"అద్సరే... ప్లేట్లో మిగిలిపోయిన చల్లారిన ఆ రెండు ఇడ్లీల్ని చటుక్కున నోట్లో వేసుకుని ఫాంట్, షర్టు మీ వంటికి తగిలించుకుని

ఆఫీసుకి నడవండి. ఆలస్యమైతే సిటీబస్సులో సీట్ దొరకలేదని రద్దీగా ఉన్న ఆ బస్సులోనే మళ్ళీ ఏ కూచిపూడి డాన్సో వేస్తారు" చురకలంటిస్తూనే అతడ్ని వేగిరిపరుస్తోంది అలిమేలు.

అంతే! భార్య సూచించిన విధంగా ఒక్కోటి చేసుకొంటూ... త్వరత్వరగా బయటపడ్డాడు శ్రీపతి.

మళ్ళీ అంతలోనే అతనికి ఆశ్చర్యం... అనందం.

అదెలా అంటే -

వేలాడుతున్న జనంతో ఎపుడూ పదకొండుమాసాల పూర్ణగర్భిణిలా కనిపించే సిటీబస్సు ఆరోజు ఆవేళపుడు ఖాళీగా వచ్చి సరిగ్గా ఆ బస్టాండ్ లోనే ఆగింది. ఆకాశం చిల్లుపడినట్లు, నేల ఈనినట్లు... ప్రతి కూడలి ఓ జాతరనే తలపించే ఆ ప్రయిమ్ టైం లో హైద్రాబాద్ లోని ఆర్డనరీ సిటీబస్సొక్కటి కేవలం కండక్టర్నే మోసుకుంటూ అదీ బస్టాండ్ లోనే ఆగడంతో మొదట ఆశ్చర్యం... ఆతర్వాత ఆనందం కలిగింది శ్రీపతికి.

"సిటీలో ఎక్కడైనా అల్లర్లు జరిగాయా?" బస్సెక్కుతూ అడిగాడు శ్రీపతి కండక్టర్ ని.

"జరిగిన అల్లర్లు చాలవా? ఇంకా జరగాలా?" కస్సుమన్నాడు కండక్టర్. బస్సులో జనాలెవరూ లేకపోయేసరికి డ్యూటీ చేస్తున్నట్టనిపించలేదు అతగాడికి. కాలివేలు కూడా పెట్టడానికి వీల్లేని బస్సులో అట్నుంచి ఇటువరకూ బొంగరంలా తిరుగుతూ 'టిక్కెట్... టిక్కెట్' అని అరుస్తూ ఆడామగా అన్న తేడా లేకుండా అడ్డొచ్చిన ప్రతిఒక్కర్నీ తన కండబలంతో లోసేస్తూ... డ్యూటీ చేయడం అలవాటైపోయిందతడికి. ఖాళీ సీట్లో సౌకర్యంగా కూచుని చేతిలో ఉన్న పేపర్లో చెవిలో దాచుకున్న బాల్ పెన్ తీసి అంకెలు వేయడం... అతడికెందుకో సరిపడడం లేదు. వేగంగా పరిగెడుతున్న బస్సులో నడిమధ్యలో ఉన్న ఏదో ఓ రాడ్ ని ఒంటికాలిపై ఆనుకుని అటూఇటూ మూగిన జనం ఆసరాలో రాతపని పూర్తిచేయడం అతడికి పెన్నులో పెట్టిన విద్య. అలాటిది... ఇవాళ ఖాళీగా సిటీబస్ ఉండడం అతడిని కలవరపరిచిందేమో... శ్రీపతి ప్రశ్నకి అడ్డదిడ్డంగా సమాధానమిచ్చాడు.

"సిటీలో వన్ ఫార్టీ ఫోర్... కర్ఫ్యూలాంటివేమైనా విధించారా?" మళ్ళీ అడిగాడు కండక్టర్ ని శ్రీపతి.

"అలాటివేం లేవు"

"మరి..." నానుస్తూ కండక్టర్ వేపు చూసాడతడు.

"ఖాళీగా ఈ బస్ ఎందుకుందనేగా మీ డౌట్"

"కరెక్ట్"      అన్నట్టు తలూపాడు శ్రీపతి.

"ఘనత వహించిన మన ఆర్టీసీవాళ్ళు కేవలం మన సిటీలో తిరిగేందుకే వెయ్యి బస్సులు కొనేసారు"

"వెయ్యి బస్సులా?" శ్రీపతి గుండె ఆగినట్టనిపించిందోసారి.

"ఎపుడు చూసినా ఆర్టీసికి నష్టాలంటారే... ఇన్ని బస్సులెలా కొనేసారబ్బా" నోరు వెళ్లబెట్టాడతడు. నేలపై నడుస్తున్న పుష్పకవిమానంలా ఏ అడ్డూఆపూ లేకుండా హాయిగా సాగిపోతోంది సిటీ బస్సు. నిజానికి, హైదరాబాద్ లో సిటీబస్ లో ప్రయాణించడాన్ని మించిన ప్రత్యక్ష నరకం మరోటి లేదనోచ్చు. విపరీతమైన రద్దీతో పాటు... అడుగడుగునా ట్రాఫిక్ సిగ్నల్స్ తో అరనిముషం కూడా సజావుగా సాగదు సిటీబస్ ప్రయాణం. అస్తమానం ఆగిపోతుండడమే. అయిదునిముషాల దూరానికి ఆరుగంటలకు పైగా టైం తీసుకుంటూ నెమ్మదిగా ఊరేగుతుంటుంది సిటీబస్సు. అలాటిది... జెట్ స్పీడ్ లో ఆటంకాలన్నవి లేకుండా వెళ్లిపోతుంటే ఇంకా ఆశ్చర్యం వేసింది శ్రీపతికి.

"ఇదెలా సాధ్యం?" అడిగాడు మళ్ళీ కండక్టర్ ని.

"ట్రాఫిక్ కంట్రోలింగ్. మనోళ్ళు మాబాగా చేస్తున్నారు. ప్రయిం టైం లో జనాలకు ఇబ్బందులు రాకూడదని కొన్ని బస్సుల దారులు మళ్ళించారు. దాంతో... రోడ్లు విశాలమై ట్రాఫిక్ అంతరాయం లేకుండా సాఫీగా సిటీబస్సులెల్తున్నాయ్. ఇక, రోజూ ఇలాగే ఉంటుంది" చెప్పాడు కండక్టర్.

"హమ్మయ్యా. పద్మవ్యూహంలో అభిమన్యుడిలా ప్రతిరోజూ అవతారమెత్తక్కర్లేదు. జనాల్ని తోసుకుంటూ బస్సుల్లో వేలాడుతూ ప్రయాణం చేయక్కర్లేదు. సొంతకారులో ట్రావెల్ చేస్తున్న అనుభూతితో దర్జాగా ఈ సిటీబస్సుల్లో కూడా ప్రయాణించవచ్చు..."మహానందపడిపోతున్నాడు శ్రీపతి. వేసవిలో వింటర్ లా ఉందతనికి. కిటికీలోంచి వీస్తున్న పిల్లతెమ్మెరని మనసారా ఆస్వాదిస్తుండగా... ఆఫీస్ స్టేజ్ వచ్చేసింది.

బస్ దిగి అయిదు సెకన్లలో ఆఫీసులో పడ్డాడతడు. ఎదురుగా సొగసుగా కనిపిస్తున్న లేడీరిసెప్షనిస్టు అందమైన 'హాయ్' తో వళ్ళు పులకరించిపోతుండగా... ఆనవాయితీ ప్రకారం చాంబర్ లోకి వెళ్లి బాస్ ని విష్ చేసాడు.

"హౌ ఆర్యూ శ్రీపతి. మీ సెక్షన్ లో వర్క్ ఎలా సాగుతోంది?" చిన్మయలాస్యం, చిరుదరహాసంతో చిదానందమూర్తి పలకరించాడు.

"ఎవ్విరిథింగ్ ఓకే సర్..."

"నథింగ్ టు వర్రీ. ఏమైనా డౌట్స్ ఉంటే డైరక్ట్ గా నన్ను కలువ్" అభయమిచ్చాడతడు.

"ఏంటో...? ఈ సమ్మర్ లో పైన భానుడు, లోన 'బాసు'డు చిటపటలాడాల్సింది పోయి చిదానందాన్నొలికిస్తున్నారు" మళ్ళీ ఆశ్చర్యం... మళ్ళీ ఆనందం కలగలిసిన అపురూపమైన ఫీలింగ్ తో శ్రీపతి గుండె తడబడింది.

అలా అలా క్షణానికో వింత ఎదురవుతుంటే ఆశ్చర్యపడడానికూడా అతడికి విసుగేస్తుంది. సాధారణంగా సమ్మర్ లో కరెంట్ కోత సహజాతిసహజమైన విషయమే. అధికారికంగా ఆరుగంటలు... అనధికారికంగా పన్నెండుగంటలపాటు కరెంట్ కట్ చేస్తూ 'ఆంధ్రప్రదేశ్' పేరుని 'అంధేరాప్రదేశ్' గా రాష్ట్రనేతలు మార్చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వినవస్తున్న నేపధ్యంలో ఆరోజు అసలు విద్యుత్ కోతే లేదు. ఆఫీసులు, సినీ థియేటర్లలో జనరేటర్ లకి పనే లేకుండా పోయింది.

ఇంటికి రాగానే ఇల్లాలు నవ్వు మొహంతో ఎదురై వేడివేడి పొగలు కక్కుతున్న కాఫీకప్పు అందించింది. ఎపుడో పెళ్ళయిన కొత్తలో ఆమె దగ్గర్నుంచి ఇలాటి ఆహ్వానం అందేది. ఆ తర్వాత క్రమక్రమంగా ఆమెకి మొహమాటం పోవడం... సంసారం అలవాటై రొటీన్ గా మారిపోవడంతోపాటు ఇబ్బందులు, ఇక్కట్లు, పనిఒత్తిళ్ళ కారణంగా అటువంటి మురిపాలన్నీ ఎపుడో జ్ఞాపకాల్లోకి జారిపోయాయి.

"ఏంటీ పెళ్ళయిన కొత్తరోజుల్ని మళ్ళీ గుర్తుకి తెస్తున్నారు" కాఫీ అందించిన పెళ్ళాం చేతిని ఆప్యాయంగా నిమురుతూ అడిగాడు శ్రీపతి.

"ఇవాళ జాక్ పాట్ కొట్టినంత ఆనందంగా ఉంది. మీతో కలిసి పిచ్చిపిచ్చిగా గెంతులు వేయాలనిపిస్తోందండీ. ఔనూ... పొద్దున్న మీరు వేసిన డాన్స్ సల్సా కదా... నాకిపుడు ఆ డాన్స్ వచ్చేసిందండీ" శ్రీపతి కాఫీతాగుతున్నాడనే స్పృహ కూడా లేకుండా రెండు చేతులూ పట్టుకుని ఊపేస్తూ అతడ్ని గిరగిరా తిప్పేస్తోంది అలిమేలు మంగతాయారు. ఆ హఠాత్ పరిణామానికి అతడిచేతిలోని కప్పు జారిపడి కాఫీ అతడి షర్ట్ ని తడిపేసింది. అసలే పొగలు కక్కుతున్న వేడి కాఫీ ఒంటిని చురుక్కుమనిపించడంతో 'కెవ్వు'మని కేకేసాడతడు. పట్టరాని ఆనందంతో అలా కేకలువేస్తున్నాడనుకున్న అలిమేలు మంగతాయారు మరింత జోరుతో హుషారుగా అతడ్ని గిరగిర తిప్పసాగింది.

"మరీ ఇంత సంతోషం ఏంటే?" అడుగుతున్నాడు శ్రీపతి భార్యని.

"ఎపుడు హృదయం సంతోషంతో పరవళ్ళు తొక్కుతుందో... ఎపుడు ఆనందం అంబరాన్ని తాకుతుందో... ఎపుడు వళ్ళంతా పులకరించి పరవశిస్తుందో అపుడు... అపుడు నాలాటి సామాన్య కళాకారులెవరైనా ఆదమరచి డాన్స్ లు కట్టొచ్చని..."

ఈమాటలెపుడో... ఎక్కడో అన్నట్టు, విన్నట్టు అనిపించిందతడికి. ఎపుడో కాదు... ఈ ఉదయమే. ఎవరో కాదు... తనే అన్నాడామాటల్ని. ఇపుడు అవే మాటలు శ్రీమతి నోటివెంట వింటున్నాడతడు ఆశ్చర్యంగా.

"ఇంతకీ ఏం జరిగింది?" కారణం తెలియాలంటూ కస్సుమన్నాడు.

"ఏ భగీరథుడు కరుణించాడో ఏమో ఆ ఆకాశ గంగ దిగొచ్చినట్లు నల్లానీళ్ళు మధ్యాహ్నమే వచ్చాయి. నిజానికి ఈ సిటీలో నల్లా నీళ్ళెపుడొస్తాయో... టాంకర్లనెపుడు పిలిపించుకోవాలో తెలిని పరిస్థితి. ఏ అర్ధరాత్రో కాకుండా పగలు మేలుకున్న సమయంలోనే నల్లానీళ్ళు వచ్చాయంటే మంగళగౌరీవ్రత ఫలితం దక్కినంత సంబరంగా ఉంది నాకు..." అంటూ సల్సా స్టెప్పులేస్తోంది శ్రీపతి శ్రీమతి.

"అంతేనా... చెప్పుకోదగ్గ విశేషాలు ఇంకా ఉన్నాయి. కాస్త తీరిక దొరకడంతో కూరలు కొనొద్దామని అలా మార్కెట్ కి వెళ్తే అక్కడింకో షాక్"

"అదేంటో?"

"వంకాయ, బీరకాయ, దొండకాయ, కాకరకాయ, టమోట, ఆలుగడ్డ... ఇలా అన్ని కూరలూ కారు చవగ్గా అమ్మేస్తున్నారు. ఏది కొందామన్నా రూపాయి రెండ్రూపాయలకి మించి లేదు. కూరగాయలు కొని ఇంటికొచ్చి టీవి చూసేసరికి ఇంకో బ్రేకింగ్ న్యూస్ నన్ను నన్నులా నిలవనీయలేదు. పెట్రోల్, డీజిల్ రేట్స్ తగ్గిస్తూ కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుందంట. ఇపుడు లీటర్ పెట్రోల్ రేట్ ఓన్లీ ట్వంటీ రూపీస్ మాత్రమే..."

'ఇది నిజమా... కలయా?" అనుకున్నాడతడు కళ్ళు బైర్లు తిరుగుతుండగా. నిన్నటికి నిన్న యుపిఎ గవర్నమెంట్ రైల్వే బడ్జెట్ లో చార్జీలు పెంచడంతో... ఓ భాగస్వామ్య పక్షం నుంచి వ్యతిరేకత ఎదురుకావడం... ఫలితంగా కేంద్ర రైల్వే మంత్రి రిజైన్ చేయడం అతనికెందుకో ఇపుడు గుర్తుకొచ్చింది. ఆ నేపధ్యంలో ఇంత సడన్ గా పెట్రోల్, డీజిల్ కారుచవగ్గా దొరికిపోతుంటే... ఇంకా సిటీబస్సుల్లో ఆఫీసుకి వెళ్ళిరావటం ఎందుకు? ఏకంగా ఓ కారు కొనుక్కోవచ్చు... హటాత్తుగా వచ్చిన ఆ ఆలోచనతో మనసుండబట్టలేక-"అదిగో... నవలోకం విరిసే మనకోసం" అంటూ హఠాత్తుగా పాటెత్తుకున్నాడు శ్రీపతి.

అలా అలా ఆ ఇద్దరూ కలిసి డాన్సులు కడ్తుంటే టీవీతెరపై మరో అద్భుతం ప్రత్యక్షమైంది.

జాతివైరం ఉన్న పిల్లికుక్కల్లా ఎపుడూ కాట్లాడుకునే సిఎం, అపోజిషన్ లీడర్ ఒకే ఫ్రేం లో చిర్నవ్వులు చిలికిస్తూ కెమెరాకి ఫోజులిస్తున్నారు. 'రాజకీయభేదాలు మరిచి అందరూ కలిసికట్టుగా పనిచేస్తే రాష్ట్ర ప్రగతి సుసాధ్యమం'టూ ఒకరి చేతిలో ఇంకొకరు చేయివేస్తూ మరీ ఉపన్యాసాన్ని దంచేస్తున్నారు.

"అసలేమైందీ రాష్ట్రానికి. చానెల్స్ లో పొలిటికల్ పార్టీల అఫిషియల్ స్పోక్స్ పర్సన్స్ కొట్టుకోవడం లేదు. ట్రాఫిక్ పంజరాల్లో చిక్కుకోకుండా సిటీబస్ లు రాజహంసల్లా వయ్యారాలొలుకుతూ వెళ్తున్నాయి. కరెంట్ కటకట లేదు. టైంకి టంచన్ గా నల్లానీళ్ళొస్తున్నాయి. ఇక, రోజూ ఎదురుపడితే కొట్టుకునే సిఎం అపోజిషన్ లీడర్లు చెట్టాపట్టాలేసుకుంటూ అసెంబ్లీని సైతం సజావుగా నడిపించాలని ప్రతిన పూనుతున్నారు. అన్ని పార్టీలవాళ్ళు అన్నదమ్ముల్లా కలిసిపోతే న్యూస్ చానెల్స్ లో ఎంటర్టైన్మెంట్ ఇంకేముంటుంది? ఎక్కడ సమస్యల సంక్షోభంలో చిక్కుకుని జనాలు విలవిలలాడుతారో...? ఎక్కడ వానరాకడ, కరెంట్ పోకడ చెప్పలేని పరిస్థితి నెలకొంటుందో? ఎక్కడ గొంతెండుతున్నా గుక్కెడు నీళ్ళు దొరకని స్థితి దాపురిస్తుందో...? ఆ దేశం... ఆ రాష్ట్రం నాదీ అని చెప్పుకునే సామాన్యుల్లో సామాన్యుడిని నేను.

చానెల్స్ లోని స్టూడియోల్లో కూచున్న వాళ్ళు తలబొప్పికట్టేట్టు తిట్టుకోవాలి. అడపాదడపా కొట్టుకోవాలి. అసెంబ్లీలో కూడా ఆ ఆనవాయితీ మారడానికి ఎంతమాత్రమూ వీల్లేదు. అధికారపక్షం, విపక్షం ఒకరిపై ఒకరు విరుచుకుపడుతూ స్పీకర్ పోడియాన్ని చుట్టుముట్టేయాలి. అపుడే కదా... ఏ నిముషాన ఏం జరుగుతుందో తెలీని ఉత్కంఠతో వ్యూవర్స్ చానెల్స్ టీఆర్పీ రేట్ ని పెంచేస్తారు. అర్ధరాత్రివేళల్లో మాంచి రొమాంటిక్ మూడ్ లో కొత్త దంపతులున్నపుడే నల్లా నీళ్ళు రావాలి. కరెంట్ కోత యధాతధంగా ఉండాలి. నిముషనిముషానికి బిపి పెరిగినట్లు కూరగాయల రేట్లు పెరుగుతుండాల్సిందే..." అనుకున్నాడు శ్రీపతి.

"ఔను... కూరగాయల రేట్లు పెరగాల్సిందే... పెరగాల్సిందే... పెరగాల్సిందే" గట్టిగా అరుస్తున్నాడు శ్రీపతి.

అర్ధరాత్రివేళ మొగుడు అరుపులకి ఒక్కసారిగా హడలిపోయి లేచింది శ్రీపతి భార్య ఎ.ఎం.ఎం. తాయారు అలియాస్ అలిమేలు మంగతాయారు.

"ఏమైందండీ మీకు?" అడిగింది బిక్కచచ్చిపోతూ.

"కల వచ్చిందే?"

"ఏదైనా పీడకలేమో?"

"ఔను పీడకలే. భయంతో హడలిచచ్చాననుకో. అమ్మో... ఇపుడు తలచుకుంటున్న కొద్దీ భయమేస్తోంది" కల చెప్పబోతున్నాడు శ్రీపతి.

"వద్దండి. ఎంత తాళికట్టిన భార్యనైనా పాడు కలలు కూడా పంచుకోవాలా? ఆ పాపమంతా మీదే. మంచి కలలేమైనా వచ్చాయనుకోండి. విని తరిస్తా. ఆ పుణ్యం నాది" ఆదిలోనే అటకాయించింది అలిమేలు మంగతాయారు.

"వాల్మీకిగా మారకముందు ఓ బోయవాడికి అతడి భార్య కూడా సరిగ్గా ఇలాగే చెప్పి ఉంటుందేమో?" అంతరాత్రివేళ నిద్రకళ్ళతో అనుకున్నాడు శ్రీపతి. ఆ తర్వాత మనసు కుదుటపరుచుకుంటూ... 'ఈ రాత్రి వచ్చిన ఈ కల నా డైరీలో లేని ఓ పేజిలాంటిది. మళ్ళీ తెల్లారితే నా చుట్టూ ఉన్న ప్రపంచంలో సమస్యలు యధాతధం. వాటితో జనాలు సతమతమవడం 'షరామామూలే'. ఇంక

నాకెందుకు భయం?" అలా అనుకున్న మరుక్షణమే అతడి కన్రెప్పల్ని నిద్ర కాటేసింది.




ఆయనకు షష్టి పూర్తి. ఆ సందర్భంగా రుద్రాభిషేకమో, ఆయుష్షు హోమమో చేయిద్దాం అని పిల్లల వినతి. అది సుతారము ఆయనకు ఇష్టం లేదు. అదే పిల్లలకు చెప్పాడు. వాళ్ళ పోరు పడలేక, "ఓరేయ్ పిల్లలూ ఆ రోజు మీరంతా మా యింటికి రండి. ఒక్కొక్కరే కాదు, పిల్లా జెల్లా అందరూ రండి. కలివిడిగా అందరం ఆ రోజు కలిసి భోంచేద్దాం. పిల్లల ఆట పాటలతో ఇల్లంతా సందడిగా వుంటే అదే పెద్ద పండుగ కదూ! అన్నారు. షష్టి పూర్తి రానే వచ్చింది. కొడుకులూ, కోడళ్ళూ, మనవళ్ళూ, మనవరాళ్ళూ అందరూ వచ్చారు. అందరికీ విశ్వనాథం గారు బట్టలు పెట్టారు. "ఏవండీ, రేపు శుక్రవారం అయింది. కనీసం ఇంటి చుట్టూ వున్న ముత్తయిదువులను పిలిచి వాళ్ళకు తాంబూలాలు ఇచ్చి పంపుతానండీ" అని విశ్వనాథం గారి శ్రీమతి అడిగింది. "ఊఁ, సరే" అని అందుకు కావలసిన ఏర్పాట్లు అన్నీ ఘనంగానే చేసాడాయన, రమ సహాయంతో.

విశ్వనాధం గారింట ఆత్మీయత అనురాగాల కలబోసిన మమతల పండుగ ఆ రోజు. తృప్తిగా భోజన తాంబూలాలయ్యాయి. సాయంత్రం అవుతోంది. మమ్మల్ని ఐమాక్స్ కి తీసుకెళ్లమని పిల్లల గోల! విశ్వనాథం గారి పెద్దబ్బాయి ప్రసాద్, తమ్ముడు రవి మొత్తం పిల్లల్ని కాసేపు సరదాగా నెక్లెస్ రోడ్ లో తిప్పి వస్తామని కార్లలో తీసుకెళ్ళారు. ప్రసాద్ కూతురు సంధ్య మాత్రం – " నేను వెళ్ళనమ్మా, నీకు సాయం చేస్తానం"ది వాళ్ళమ్మ రమతో.

సత్యవతి, భానుమతి రమాదేవి ఆడపడుచులు. వాళ్ళిద్దరూ, "సంధ్యా! నువూ వెళ్ళవే పిల్లలందరితో" అన్నా వినలేదు. "పేరంటాలంటే నాకూ ఇష్టం అత్తయ్యలూ.. పట్టు పరికిణీ కట్టుకోవద్దూ " అంది సొట్టలు పోతున్న బుగ్గలతో.

***

ప్రసాద్, రవి, సత్యా, భాను విశ్వనాథం గారి సంతానం. అందరివీ మంచి చదువులూ, ఉద్యోగాలూనూ. ప్రసాద్ ఏకంగా ఓ మందుల కంపెనీకి యజమాని. ప్రసాద్ భార్య రమ. రెండో కొడుకు రవి. రవి, రవి భార్యా ఇద్దరూ డాక్టర్లు. సత్యా, ఆమె భర్తా ఇద్దరూ కంప్యూటర్ ఇంజనీర్లే. భానుమతి, ఆమె భర్తా ఇద్దరూ కూడా. విశ్వనాథం కొడుకులూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ, కూతుళ్ళూ, అందరూ హైదరాబాదు లోనే వుంటారు. అదీ విశ్వనాథం గారి అదృష్టం అంటే.

***

విశ్వనాథం గారింట్లో పేరంటం అంటే మాటలా! పాతికేళ్ళుగా అదే ఇంట్లో నివాసం ఆయే. ఆయన పిల్లల చదువుల నుండి వాళ్ళ పిల్లల పురుళ్ళు కూడా ఆ ఇంట్లోనే. ఆ కాలనీ లో తెలినివారుండరు. ఎవరిని విడవలేదు. భానూ, సత్యా అయితే ఏకంగా వాళ్ళ స్నేహితురాళ్ళనందరిని కూడా పిలిచేసారు ఇదే సందర్భంగా.

సందడే సందడి. వచ్చిన వాళ్ళ నందరిని పలకరించడం, చల్లటి పానీయాలూ, వండిన పలహారాలూ పెట్టడం, తాంబూలాలు ఇవ్వడం అన్నీ రమే చూసుకొంటోంది. సంధ్య వాళ్ళమ్మకి కాస్త ఉడతా సాయం చేస్తోంది.

“ఆడపడుచులు యింటికి అపుడపుడూ వచ్చిపోయేవాళ్ళు. వాళ్ళకేం ఎక్కువగా పనులు చెప్పకమ్మా..” ముందే హెచ్చరించింది అత్తగారు. రమ కాస్త కోరగా చూసింది. వాళ్ళూ నా వయస్కులేగా అని దాని భావం. “వాళ్ళిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. వారం అంతా అలసిపోయివుంటారు.” వెనకేసుకొచ్చింది ఆ పిల్లల కన్న తల్లి. పెద్దకోడలు రమకే పనులన్నీ. చిన్నకోడలు డాక్టరమ్మ ఆయె. రోగం రొష్టూ వస్తే వైద్యం చేసేది ఆమే గనుక ఆమెకు ఏదీ చెప్పే పనే లేదు.

విశ్వనాథం గారివద్ద చదువుకొన్న పిల్లల తల్లితండ్రులు చాలా మందే వున్నారు ఆ బజారులో. వారిలో కొందరు జంటలు గా కూడా విచ్చేశారు. విశ్వనాథం గారింటికి ద్వారాలకి అరటి చెట్లు ఇటూ అటూ కట్టారు. మామిడి తోరణాలతో అలంకరించారు. ఆ ఇంటి ముందు వేసిన చలువ పందిరికి కొబ్బరి మట్టలు కట్టారు. చెప్పద్దూ! ఆ సాయంత్రం వారింట తెలుగుదనం వెలిగి పోయిందంటే నమ్మండి. విశ్వనాథం గారు తెల్లటి లాల్చీ పంచె, కండువాలతో అచ్చు “సీతారామయ్య గారి మనుమరాలు” చిత్రం లో అక్కినేని లా నిండుగా వున్నారు. రమలో తెలుగుదనం ఉట్టిపడుతోంది. నీలకంఠం రంగు పట్టుచీరలో అచ్చరలా వుంది. సత్యవతి - స్నేహితురాళ్ళకి, సహోద్యోగులకీ రమను పరిచయం చేసింది, “మా వదిన .. రమ” అని. ఆమె స్నేహితురాళ్ళు అందరూ హైటెక్ సిటి లో పని చేసే వాళ్ళు! అందరూ, “ఓకే,ఓకే, మీరేం చేస్తున్నారు” అని అడిగారు. చేతిలో వున్న పళ్ళెం పక్కన పెడుతూ, ..”నేను హౌస్ వైఫ్” చెప్పింది రమ. వాళ్ళు పేలవంగా ‘ఇంతేనా’ అన్నట్లుగా హేళనగా నవ్వి ముందు కెళ్ళారు. రమ ఇంటి పట్టునే వుంటుంది. తన భర్తకు, పిల్లలకూ, అత్తమామలకూ అందరికీ కావలసినవి సమకూరుస్తుంది. ఉద్యోగం చేయక పోవడం ఈ రోజుల్లో తప్పైనట్లు చూస్తున్నారేమిటో! రమ మనసు నొచ్చుకొనింది.

విశ్వనాథం గారు పిలిచి పనేదో చెబితే అటుగా వెళ్లిపోయింది. యింతలో మనవళ్ళు, మనుమరాళ్ళు వచ్చేశారు. వాళ్ళకి కొబ్బరిఆకుతో పీప్పీ శబ్దం చేసే బూరలు ఎలా చేయాలో నేర్పిస్తున్నారు తాతగారు. అదో పాతకాలం విద్య. పిల్లలు భలే ఆనందిస్తున్నారు.

భానుమతి చాలాకాలం తర్వాత స్నేహితురాళ్ళనందరినీ ఒక్కసారిగా కలవడం ఇదే! భాను స్నేహితురాళ్ళు సత్యా ను చూసి చాలా రోజులే అయింది. సత్యాని, మిగిలిన కుటుంబ సభ్యులను అందరినీ పరిచయం చేస్తోంది. రమనూ పరిచయం చేసింది భాను. “మా పెద్దవదిన రమ… ప్రసాద్ అన్నయ్య భార్య” చెప్ప సాగింది.

“ఓహో. అలాగా. మీరు ఎక్కడ పనిచేస్తున్నారు” అడిగారు అందులో కొందరు. కొందరికి “హౌస్ వైఫ్” అనీ, “హోమ్ మేకర్” అనీ చెప్పింది. చెప్పడానికి ఇబ్బంది పండింది రమ. ఒకరికైతే సరే .. నలుగురూ ఒకేసారి అడగడం, వెనువెంటనే అదే సమాధానం చెప్పాల్సివచ్చేసరికి ఆమెలో అంతకు ముందు ఎన్నడూ లేని

వెలితి తోచింది. నేను ఉద్యోగం చేయకపోవడం ఏదో తప్పుగా చూస్తున్నారేమిటి? ఉద్యోగం ఏమైనా స్త్రీ లక్షణమా? అంతే! ఆమెకే తెలియకుండా కొలుకుల్లో నీళ్లు చేరడం మొదలైంది. వచ్చిన వాళ్ళలో చాలా మంది జీన్సూ, షర్టు లూ వేసుకొన్న వాళ్ళున్నారు.

అంతా దూరం నుంచి గమనిస్తున్న విశ్వనాథం గారు అక్కడికి చేరుకొన్నారు. అందరికీ సగర్వంగా రమని మళ్ళీ పరిచయం చేశారు, ఆమెను చేరువగా తీసుకొని ఆశీర్వదిస్తూ.

“ఈమె నా పెద్దకోడలు రమ. ఏం.టెక్. లో బంగారు పతకం సాధించింది. సొంత వ్యాపారంలో తన భర్త నిత్యం తలమునకలై వుండడం చేత యింటి బాధ్యతలూ, అతని బాధ్యతలూ, వాళ్ళ పిల్లల శ్రేయస్సూ, మా సంక్షేమం అన్నీ స్వీకరించి సమర్ధవంతంగా, ఆనందంగా నిర్వర్తిస్తోంది. ఈ మాట చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను. “ రమ వైపు చూస్తూ, “అమ్మా రమా! నువ్వు ఇక ఎప్పుడూ ఎవరికీ “హౌజ్ వైఫ్”ని అనీ, “హోమ్ మేకర్” అనీ చెప్పకు. ఆ పరాయి భాషా పదాలూ, వాళ్ళ భేషజాలూ మనకు దేనికి. “గృహిణి” అనీ, “గృహలక్ష్మి” అనీ సగర్వంగా చెప్పు. నీవు నిర్వర్తిస్తున్న ఈ విధులేవీ వాళ్ళు చేస్తున్న ఉద్యోగాల కంటే చిన్నదే కాదు. ఇదే అన్నిటికంటే పవిత్రమైనదీ, ప్రాముఖ్యమైనదీ!” అని చెప్పి వెళ్లిపోయారు విశ్వనాథం.

రమ కళ్ళలో సుళ్ళు తిరగబోయిన కన్నీళ్లు వెనక్కి వెళ్ళిపోయాయి ఆమె చెక్కిళ్ళ పై విరిసిన ఆనందపు దొంతరల మాటున!!!




హోరున వర్షం కురుస్తుంది. పట్టపగలే విజిబిలిటి తక్కువగా ఉంది. నేలంతా వాన నీరుతో చిత్తడిగా ఉంది. కాళ్ళకు పంచెకు బురద కూడా అంటుకుంది. ఎలాగో అపసోపాలు పడుతూ ఆ ఇంటికి చేరుకున్నాడు. భారంగా ఊపిరి పీలుస్తూ తలుపు మీద కొట్టాడు. ఒక్క క్షణం తరువాత తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మం దగ్గర అందమైన అమ్మాయి కనిపించింది. సన్నగా పొడుగ్గా నాజుకుగా ఉంది. కాని వేసుకున్న బట్టలు మాత్రం ఆమె బీదరికాన్ని చెప్పకనే చెబుతున్నాయి.

“ఎవరండి మీరు ఏం కావాలి” అంటు మర్యాదగా అడిగింది.

ఆ మనిషి కోపంతో ఏదో మాట్లాడబోయాడు.  కాని కారణం తెలియదు కాని గొంతులోంచి మాట పెగిలి రాలేదు.  గొంతుకు ఏదో అడ్డం పడినట్టు ఉక్కిరిబిక్కిరిఅయ్యాడు.

ఆ అమ్మాయి విసుగ్గా చూసి ఏదో చెప్పబోయింది.  వేళ కాని వేళ రావటమే కాకుండ ఏం మాట్లాడకుండ మౌనంగా ఉండటం ఆమెకు చిరాకు తెప్పించింది. అయినా కోపం తెచ్చుకోకుండా "ఎవరండి మీరు. ఏంపని మీద వచ్చారు "అని శాంతంగా అడిగింది.

ఈ సారి కూడా ఆయన మాట్లాడాలని ఎంతో ప్రయత్నించాడు.  కాని గొంతు ఎందుకో సహకరించలేదు.  ఆదే సమయంలో ఆయన శరీరం ఒక్కసారిగా ముందుకు తూలింది.  చప్పున గుమ్మం తలుపులు పట్టుకుని నిలదొక్కుకున్నాడు కాని మనిషి మాత్రం గజగజ వణికిపోతున్నాడు. శరీరం చిగురుటాకులా కంపిస్తుంది.  ఊహించని ఈ నాటకీయం చూసి ఆ అమ్మాయి బిత్తరపోయింది. ఏదో చెప్పాలనుకుంది.  ఇంతలో ఆ మనిషి మెల్లగా నేలమీదకు జారిపోయాడు. మనిషి స్పృహలోనే ఉన్నాడు కాని ఒళ్ళు మాత్రం చలిజ్వరం వచ్చినవాడిలా అల్లాడిపోతుంది.

ఆ అమ్మాయి వెంటనే తేరుకుని గట్టిగా భర్తను పిలిచింది.

ఆమె భర్త శ్రీధర్ కంగారుగా వచ్చాడు.  గుమ్మం ముందు పడిపోయిన వ్యక్తిని చూసి "లలిత ఎవరీయన. ఏమైంది. ఎందుకు ఇలా వణికిపోతున్నాడు"అని అడిగాడు.

"నాకు తెలిదండి.  తలుపు కొడితే తీశాను. గుమ్మం దగ్గర ఈ పెద్ద మనిషి కనిపించాడు. ఎవరు మీరు అని అడిగితే జవాబు చెప్పకుండ ఇలా పడిపోయాడు" అంది లలిత.

"వర్షంలో తడవటం వల్ల చలిజ్వరం వచ్చిందని నా అనుమానం. ఇంతరాత్రివేళ మనింటికి ఎందుకు వచ్చాడు."

"నాకేం తెలుసు."

"ఇంతకుముందు ఈ మనిషిని ఎప్పుడైనా చూశావా."

"లేదండి. ఖచ్చితంగా ఈ ఊరివాడు మాత్రం కాదు."

"నాకు అలాగే అనిపిస్తుంది. ఇతనెవరో మనకు తెలియదు. మనం ఎవరో ఇతనికి తెలియదు. కాని పనిగట్టుకుని ఇంత రాత్రివేళ అది ఈ వర్షంలో మన ఇంటికి ఎందుకు వచ్చాడు. చూస్తుంటే చాల పెద్ద మనిషిలా కనిపిస్తున్నాడు. ఇతను ఎవరైన మన ఇంటి ముందు పడిపోయాడు. పైగా చలిజ్వరంతో బాధపడుతున్నాడు. ఈ పరిస్థితిలో ఇతన్ని ఇలాగే వదిలేయ్యటం మానవత్వం అనిపించుకోదు. వెంటనే లోపలికి తీసుకువెళ్ళి మంచం మీద పడుకోబెడదాం. మిగతా విషయాలు తరువాత చూసుకోవచ్చు"అన్నాడు శ్రీధర్.

ఇద్దరు కలిసి అతన్ని లోపలికి తీసుకువెళ్ళి మంచం మీద పడుకోపెట్టారు. శ్రీధర్ ఆయన లాల్చీ జేబులు వెతికాడు. పర్స్ కనిపించింది. అందులో చాల డబ్బు కొన్ని రశీదులు ఉన్నాయి. కాని ఆ మనిషి విజిటింగ్ కార్డు కాని అతని ఐడెంటి తెలిపే వివరాలు కాని లేవు. శ్రీధర్ పర్స్ తిరిగి జేబులో పెట్టేశాడు.

మంచం పక్కన నేలమీద ఉన్న చిన్న సీసా తీసి భర్తకు చూపించింది లలిత. అది విషపు సీసా.

"మన ఆత్మహత్య కార్యక్రమం ప్రస్తుతానికి వాయిదా వేద్దాం. ముందు ఈ అపరిచితుడు ఎవరో, ఎందుకు వచ్చాడో తెలుసుకుందాం."అన్నాడు శ్రీధర్.

"చావు తప్ప మనకు ఇంకో మార్గం లేదా"బేలగా అడిగింది లలిత.

"నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకున్న పాపానికి నీకు ఈ శిక్ష తప్పదు. అయిన వాళ్ళందరికి దూరమయ్యాం. సహాయం చేసే వాళ్ళు ఈ ప్రపంచంలో ఒక్కరు కూడా లేరు. మాయదారి జబ్బువల్ల ఉన్న ఉద్యోగం ఊడిపోయింది. బ్యాంకులో డబ్బు అయిపోయింది. చేతిలో ఒక్క పైసా లేదు. భవిష్యత్తు అగమ్యగోచరంగా ఉంది. ఈ పరిస్థితిలో మనం ఎలా బ్రతకగలం. మన పెళ్ళి అయి రెండు సంవత్సరాలు అయినా,నా తల్లితండ్రికి మీ వాళ్ళకు మనమీద కోపం పోలేదు. వాళ్ళ దృష్టిలో మనం ఎప్పుడో చనిపోయాం. అందినంతవరకు స్నేహితుల దగ్గర అప్పు చేశాం. ఇంకా ఎంతకాలం వాళ్ళు మాత్రం సహాయం చేస్తారు. తిరిగి ఇచ్చే పరిస్థితిలో ఉంటే అది వేరే సంగతి. కాని మనకు చిల్లి గవ్వ ఆదాయం లేదు. అందుకే బాగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను. నా ప్రాణాలు తీసుకునే హక్కు నాకుంది. కాని నిన్ను బలవంతం చేసే అధికారం నాకు లేదు. నేను పోయిన

తరువాత మీ ఇంటికి వెళ్ళిపో.      భర్త పోయిన అమ్మాయిని ఎవరైన చేరదీస్తారు.”

“మీరు పోయిన తరువాత నేను మాత్రం బతికి ఉంటానని ఎలా అనుకున్నారు. మీరు లేకుండ ఒక్క క్షణం కూడా ఉండలేను. ఏదో బలహీన క్షణంలో అలా అన్నాను. మీరు చెప్పినట్టు చేద్దాం”అంది లలిత.

శ్రీధర్ ఏదో మాట్లాడబోయాడు. ఇంతలో పెద్దగా మూలుగు వినిపించింది. ఇద్దరు కంగారుగా మంచం దగ్గరికి వెళ్ళారు. ఆ మనిషి పూనకం వచ్చినట్టు ఒణికిపోతున్నాడు. కాళ్ళు చేతులు కొట్టుకుంటున్నాడు.      లలిత ఇంట్లో ఉన్న బట్టలన్ని తీసి అతని మీద కప్పింది. తన చీరలు కూడా విడిచిపెట్టలేదు.      కాని ఆ మనిషిలో కొంచెం కూడా మార్పు లేదు. శ్రీధర్ కంగారుగా కిటికి లోంచి బయటకు చూశాడు. వర్షం మరింత పెద్దదయింది.      ఉరుములు మెరుపులతో జడివానగా మారిపోయింది.      పైగా గాలి వేగంగా వీస్తోంది.      ఇంట్లో గొడుగు కూడా లేదు.      ఈ పరిస్థితిలో డాక్టర్ ను పిలుచుకువచ్చే అవకాశం కూడా లేదు.

ఏం చెయ్యాలో తోచక శ్రీధర్ తిరిగి గదిలోకి వచ్చాడు.      ఆ మనిషి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. లలిత బిక్కమొహం వేసుకుని భయంగా చూస్తుంది.      శ్రీధర్ కి కాళ్ళు చేతులు ఆడలేదు. ఏం చెయ్యాలా అని ఆలోచించాడు.      అతని మనస్సులో ఫ్లాష్ వెలిగింది. అలా చేస్తే ఆ మనిషి తప్పకుండ బతుకుతాడు.      కాని దానికి లలిత ఒప్పుకోవాలి. ఆమె ఒప్పుకుంటుందా. ఏ భార్య అలాంటి ప్రపోజల్ కు ఒప్పుకోదు.      పైగా భర్తను చీదరించుకుంటుంది.      అయిన ఫర్వాలేదు. లలిత గురించి అతనికి బాగా తెలుసు.      అతని మాట ఎప్పుడు కాదనదు.      ఈ ఆలోచన రాగానే లలితను హాలులోకి తీసుకువెళ్ళాడు.

లలిత భర్తవంక ప్రశ్నార్ధకంగా చూసింది.

శ్రీధర్ చెప్పాడు. అతను చెప్పింది పూర్తిగా విన్న లలిత తలమీద పిడుగుపడినట్టు అదిరిపడింది. బిత్తరపోయి భర్త వంక చూసింది.

“ప్రస్తుత పరిస్థితిలో ఆ మనిషిని కాపాడటానికి ఇంతకంటే ఇంకో మార్గం లేదు. ఎలాగు మనం చచ్చిపోబోతున్నాం.      వెళ్ళేముందు కనీసం ఒక మంచి పని చేసి వెళదాం. నీ వల్ల నాకు నా వల్ల నీకు తప్ప మనం ఎవరికి సహాయం చెయ్యలేదు. ఉపయోగపడలేదు. తుచ్ఛమైన ఈ శరీరం ఒక మనిషి ప్రాణాలు కాపాడటానికి ఉపయోగపడుతున్నప్పుడు అంతకంటే గొప్ప అదృష్టం ఇంకేం ఉంటుంది. ఈ అవకాశం అందరికి రాదు. పుణ్యం చేసుకున్న వాళ్ళకు మాత్రమే వస్తుంది. నీ భర్తగా ఆజ్ఞాపించటంలేదు.      వాస్తవాన్ని తెలుసుకోమంటున్నాను. నేను చెప్పాలనుకుంది ఇంతే.      తరువాత నీ ఇష్టం.”అన్నాడు శ్రీధర్.

లలిత పిచ్చిదానిలా భర్త వంకచూసింది.   తరువాత ఏదో నిర్ణయించుకున్నట్టు మౌనంగా గదిలోకి వెళ్ళింది.   ఆ మనిషి పరిస్థితిలో కొంచెం కూడా మార్పు లేదు. మనిషి భయంకరంగా వణుకుతున్నాడు. లలిత ఆయన వైపు నిర్లిప్తంగా చూసి యాంత్రికంగా తన ఒంటి మీద బట్టలు విప్పేసింది. నగ్నంగా మంచం మీద అతని పక్కన పడుకుంది. శ్రీధర్ గదితలుపులు దగ్గరగా వేశాడు.

మరుసటి ఉదయం కళ్ళు తెరిచిన ఆ మనిషి నగ్నంగా తన పక్కన పడుకున్న అమ్మాయిని చూసి చప్పున లేచి కూర్చున్నాడు. ఎవరు నువ్వు అంటు గట్టిగా అరిచాడు.

అతని అరుపులు విని శ్రీధర్ కంగారుగా లోపలికి వచ్చాడు.   ఈలోగా లలిత కూడా లేచి బట్టలు వేసుకుంది.

శ్రీధర్ జరిగినదంతా చెప్పాడు. ఆ మనిషి వర్షంలో తన ఇంటికి రావటం చలిజ్వరంతో తన ఇంటి గుమ్మం ముందు పడిపోవటం అంతా వివరంగా చెప్పాడు. అతన్ని ప్రాణాపాయం నుంచి కాపాడటానికి ఏం చేశాడో కూడా వివరంగా చెప్పాడు.

"అమ్మా మహాతల్లి నన్ను క్షమించమ్మా.   నువ్వు మాములు స్త్రీవి కాదు. నా దైవం త్రిపురసుందరివి. ఈ పాపిష్టి వాడిని మన్నించమ్మా"అంటు అమాంతం లలిత కాళ్ళ మీద పడిపోయాడు. అతడి కళ్ళు దారాపాతంగా వర్షిస్తున్నాయి.   ఆమె కాళ్ళను అభిషేకిస్తున్నాయి.

"ఏమిటండి ఇదంతా.   మీరు పెద్దవారు. నా కాళ్ళమీద పడటం ఏం బాగాలేదు" కాళ్ళు వెనక్కి తీసుకుంటు అంది లలిత.

"వయస్సులో నేను పెద్దవాడిని. కాని మానవత్వం లో మీకంటే చాల చిన్నవాడిని.   మేరుపర్వతంలా మహోన్నతంగా ఎదిగిపోయిన మీ వ్యక్తిత్వం ముందు నేను చాలా అల్పుడిని. నేనెవరో తెలియకపోయినా, నా ప్రాణాలు కాపాడారు.   ప్రపంచంలో ఇంతవరకు ఏ స్త్రీ చెయ్యని త్యాగం చేశావు. నిజానికి నేనెవరో తెలిస్తే మీరు నన్ను అసహ్యించుకుంటారు.   ఇలాంటి మనిషినా మనం కాపాడింది అని బాధపడతారు" లేచి కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు.

"ఇంతకి ఎవరు మీరు"అడిగాడు శ్రీధర్ ఆసక్తిగా.

“ నేను ఈ ఇంటి యజమాని బాపినీడుని.   ఆరునెలలనుంచి మీరు అద్దె ఇవ్వటంలేదని గుమాస్తా చెప్పాడు. నాకు చాల కోపం వచ్చింది.   మీ విషయం అటో ఇటో తేల్చుకుందామని ఇక్కడికి వచ్చాను.   మిమ్మల్ని ఖాళీ చేయించి ఈ ఇల్లు పడగొట్టించి పెద్ద భవనం కట్టుకుందామని అనుకున్నాను.   అనుకోకుండా వర్షం రావటం నాకు చలిజ్వరం సోకటం అంతా దైవనిర్ణయం. అది రావటం ఒకందుకు మంచిదే అయింది.   లేకపోతే మీ లాంటి మానవత్వం ఉన్న వాళ్ళను కలుసుకునే అవకాశం ఉండేది కాదు. వయస్సులో మీరు చిన్న వాళ్ళయినా మీ ముందు మాత్రం నేను అల్పుడిని.

“నాతో రండి.   ఈ రోజుతో మీ కష్టాలు తీరిపోయాయి.   నా కళ్ళు కూడా తెరుచుకున్నాయి.

నా కంపెనిలో మీకు మంచి ఉద్యోగం ఇస్తాను. మంచి కార్పోరేట్ హాస్పటల్ లో చేర్పించి నీ జబ్బుని నయం చేస్తాను” అన్నాడు బాపినీడు.

బయట వర్షం వెలిసింది. ఆకాశంలో కారుమబ్బులు తొలగిపోయి స్వచ్ఛంగా ఉంది. బాపినీడు మనస్సు కూడా అలాగే ఉంది.




నాకు మ్యూజిక్ అన్నా, డాన్సు అన్నా చాలా ఇష్టం. పాటలు వినడం అంటే ఇంకా ఇష్టం.

నాకు పాటలు సెలెక్ట్ చేసుకుని వినడం నచ్చదు. తరువాత వస్తున్న పాట ఎప్పుడూ సస్పెన్స్ గా ఉండాలి. అందుకే నేను రేడియోనే ప్రిఫర్ చేస్తాను. ఈ దేశం లో తెలుగు పాటలు వినాలంటే ఆన్ లైనే దిక్కు. అందుకే ఆన్లైన్ రేడియో లో సాంగ్స్ వినటం నాకు చాలా ఇష్టం.

అలా సరదాగా సాంగ్స్ వింటుంటే నాకిష్టమైన పాట రావడం మొదలయింది.

"ఇన్నాళ్ళకి గుర్తొచ్చానా వాన,

ఎన్నాళ్ళని దాక్కుంటావే పైన

చుట్టంలా వస్తావే చూసేళ్లి పోతావే

అచ్చంగా నాలోనే నిత్యం ఉంటానంటే

చెయ్యారా చేరదీసుకోనా

నువ్వొస్తానంటే నేనొద్దంటానా..."

ఈ పాట నా ఎద మాటు జ్ఞాపకాలని నిద్రలేపుతోంది.

సంగీతానికి జ్ఞాపకాలకి అవినాభావ సంబంధం ఉందని మీరు నమ్ముతారా.

నేను నమ్ముతాను.

ఆ జ్ఞాపకాలు సంతోషకరమైనవి కావచ్చు, బాధాకరమైనవి కావచ్చు, అసలు ఎటువంటి విశేషం లేనివి కావచ్చు.

కొన్ని సందర్భాలలో విన్న పాటలు ఆ సందర్భాల్ని గుర్తు చేసేలా ఉంటాయి. ఉదాహరణకి మీరు మీ ప్రియురాలితో సరదాగా ఏదైనా షాపింగ్ మాల్ కి వెళ్ళారనుకోండి అక్కడ మీకు వినిపించిన మెలోడియస్ సాంగ్ ని మళ్ళీ మీరు విన్నప్పుడల్లా అదే షాపింగ్

మాల్ లో మీరు మీ ప్రియురాలితో కలిసి వెళ్ళిన జ్ఞాపకం వెంటాడుతుంది.

ఇది అందరికీ వర్తిస్తుందని నేను చెప్పలేను. కానీ నాకు మాత్రం వర్తిస్తుంది.

అలా వర్షం సినిమాలోని ఈ పాట వింటున్నప్పుడు మెల్లగా నాలోని జ్ఞాపకాలు దృశ్య రూపం లో నా మదిలో మెదలసాగాయి.

ఆ రోజు వర్షం సినిమా పాట ప్లే అవుతుండగా స్వతహాగా డాన్సు అంటే ఇంట్రెస్ట్ ఉన్న నాకు ఆ పాటంటే మక్కువ తో డాన్సు చెయ్యడం మొదలుపెట్టాను.

నాలో ఉన్న గొప్పతనం ఒక్క సారి చూసిన స్టెప్స్ ని గమనించి అవే స్టెప్స్ ని రెండో సారి చూడకుండా కరెక్ట్ గా చెయ్యగలను. నా ఈ టాలెంట్ నాకు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చింది. మా కాలేజీలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో తప్పకుండా నేను పాల్గొనే దానిని. ఒక వేళ నేను పాల్గొనడానికి ఆసక్తి చూపించక పోయినా మా స్నేహితురాళ్ళు, లెక్చరర్లు నా పేరు ని పరిశీలనలో పెట్టేవాళ్ళు. అంతటి నమ్మకం నా నాట్యం అంటే.

అలా ఆ పాట కి మైమరచి నా రూం లో డాన్సు చేస్తున్న సమయం లో ఎవరో నా రూం లో కి అడుగు పెట్టినట్టు అనిపించింది. సాధారణంగా నేను డాన్సు చేస్తున్నప్పుడు నా ఏకాగ్రతకి భంగం కలగకుండా గది తలుపులు వేసుకుంటాను. కానీ ఈ సారి వేసుకోలేదు.

ఆ వచ్చిన వ్యక్తి ఎవరో కాదు మా అన్నయ్య. నన్ను అన్ని విధాలా ప్రోత్సహించే వ్యక్తి. అటువంటి మా అన్నయ్య ఆ రోజు నా గదిలోకి వచ్చి స్పీడ్ గా వెళ్లి సిస్టం ని ఆఫ్ చేసి నా దగ్గరికి కోపంగా వచ్చాడు.

ఎప్పుడూ ఎంతో ఆనందంగా, ప్రశాంతం గా ఉండే మా అన్నయ్య కళ్ళలో ని తీవ్రమైన కోపాన్ని చూసి ఆ రోజు నేను ఎంతో భయపడ్డాను.

"అన్నయ్య, ఏం జరిగింది"

"ఇంకా, ఏం జరగాలి"

"నాకేం అర్థం కావట్లేదు. నువ్వెందుకిలా ప్రవర్తిస్తున్నావో"

"చిన్న పిల్లవి కదా అని నిన్ను ఇంట్లో అందరూ గారం చేస్తుంటే ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నావు"

"ఏమైంది. కొంచెం నాకు అర్థం అయ్యేటట్టు చెప్పు"

"ఏంటి ఈ లెటర్"

"లెటర్ ఏంటి"

"అదే ఈ లెటర్ ఏంటి"

"నాకు తెలీదు"

"నీకు తెలియకుండా నీ బాగ్ లో ఉంటుందా"

"నా బాగ్ లో ఉందా. ఏదీ ఒక సారి చూడనివ్వు"

"ఏంటి చూసేది. ముందు ఈ విషయం చెప్పు ఏంటి ఈ లెటర్"

"నిజం గా నాకు తెలియదు అన్నయ్య"

"నీ సంగతి ఇలా కాదు ముందు నాన్న గారి దగ్గరికి వెళ్లి చెప్పాలి"

"అన్నయ్య ప్లీజ్, అసలు జరిగినదేంటో పూర్తిగా చెప్పకుండా ఇలా ఎందుకు చేస్తున్నావు"

"ఎంత బాగా నటిస్తున్నావే, చేసిందంతా చేసి ఏమీ తెలియని అమాయకురాలిలా బాగా నటిస్తున్నావ్"

ఒక్క సారిగా అన్నయ్య అంత మాట అనేసరికి నా హృదయం బాధతో నిండిపోయింది.

నన్ను ఎంతగానో అభిమానించే అన్నయ్యేనా ఇలా మాట్లాడగలుగుతోంది. ఇంట్లో నాన్నగారు ఎంత స్ట్రిక్ట్ గా ఉంటారో అన్నయ్యకు తెలుసు. నాన్నతో ఈ విషయం చెప్తానంటాడు. అసలు ఇది ఏ విషయమో నాకు చెప్పకుండా ఇలా నన్ను ఇబ్బంది పెడుతున్నాడు.

చిన్నప్పుడు ఒకసారి స్కూల్ నుండి ఇంటికి వస్తున్నప్పుడు నా కాలికి ముళ్ళు గుచ్చుకుంటే నేను నడవలేకపోయినప్పుడు నన్ను ఎత్తుకుని ఇంటికి తీసుకువచ్చాడు. స్కూల్ నుండి ఇల్లు ఎంత దూరంగా ఉండేదో.

అలాగే ఎన్నో సార్లు అమ్మా నాన్నా ముందు నా అల్లరి చేష్టలను వెనకేసుకు వచ్చేవాడు.

స్కూల్ లో పిల్లలకి మా అన్నయ్య అంటే హడల్. తను ఆ ఇమేజ్ నా కోసమే సృష్టించుకున్నాడు. లక్ష్మి సినిమాలో వెంకటేష్ అంత బిల్డ్ అప్ ఇచ్చుకునేవాడు. నన్ను ఎవరూ ఇబ్బంది పెట్టకూడదు అన్నది అన్నయ్య ఉద్దేశ్యం.

టీనేజ్ లోకి వచ్చాక అబ్బాయిలు కామెంట్స్ చెయ్యడానికి భయపడేవారు ఎందుకంటే బాడీ గార్డ్ లాంటి మా అన్నయ్య నా వెంట ఉన్నాడు కదా.

ఆ రోజు ఇంటర్ లో జరిగిన సంగతి నాకింకా గుర్తుంది.

ఒక అబ్బాయి నాతో మాట్లాడాలని ఏంతో ఆశతో దగ్గరికి వచ్చాడు. ఇంతలో నా వెనుకే ఉన్న అన్నయ్యను చూసి తను నడుస్తున్న తోవను గమనించకుండా గుంటలో పడిపోయాడు. ఫన్నీ ఇన్సిడెంట్. పాపం ఆ అబ్బాయి.

అలాంటి అన్నయ్య నన్ను అనుమానిస్తున్నాడా. ఆ లెటర్ ఏంటి నా బాగ్ లో ఉండటం ఏంటి నాకేం తోచట్లేదు.

అది లవ్ లెటరా? అఫ్ కోర్స్ అందమైన చెల్లెలికి లవ్ లెటర్స్ రావడం సహజమే కదా. మరి అన్నయ్య నన్ను అనుమానించడం నన్ను అతిగా బాధిస్తోంది.

బతిమిలాడుతూ అడిగాను

"అన్నయ్య, ప్లీజ్ చెప్పవా, ఆ లెటర్ గురించి నాకేం తెలియదు."

"నేను నమ్మను"

"ప్లీజ్"

"సరే, బట్ ఆన్ వన్ కండిషన్"

"చెప్పు,"

"ఈ విషయం నువ్వు ఎవరికీ చెప్పకూడదు"

"ఏంటి" ఆశ్చర్యం గా అడిగాను

"యా, ప్రామిస్ మీ"

"ప్రామిస్"

వెంటనే కామెడీ మూడ్ లో కి వచ్చి

"ఒసేయ్, ప్లీజే, నీ ఫ్రెండ్ అంకిత కి ఈ లెటర్ ఇవ్వవే"

ఒక్క క్షణం నాకు షాక్

ఇంతసేపు లెటర్ ఏంటి లెటర్ ఏంటి అని నన్ను హింసించి ఆ లెటర్ తను నా ఫ్రెండ్ కి రాసి ఇప్పుడు కాళ్ళ బేరానికి వచ్చాడా

"ఏంట్రా అంటున్నావ్"

"అవునే, ఈ లెటర్ నీ ఫ్రెండ్ అంకిత కి ఇవ్వు. నువ్వు మాత్రం చదవకు చిన్నపిల్లవి"

"మరి ఇంత సేపు నన్ను ఏడిపించావు కదరా"

"ఏదో కామెడీ కి అలా చేసాను. మా చిట్టి తల్లి కదూ, వెళ్ళమ్మా వెళ్ళు ఈ లెటర్ అంకిత కి ఇచ్చి తనేం చెప్పిందో నాకు చెప్పు"

"సరే,"

"థాంక్స్. ఎంతైనా నువ్వు నా బంగారు కొండవి కదా"

"అవును" అని మనసులో నా వ్యూహాన్ని అన్నయ్య ముందు బయటపెట్టలేదు

ఆ లెటర్ ని సరా సరి అన్నయ్య అంటే ఇష్టపడే మా ఎదురింటి రంజిత కి ఇచ్చాను.

రంజిత లావుగా పొట్టిగా ఉంటుంది. ఇంటర్ లో నే చదువు ఆపేసింది. లెటర్ తీసుకున్నప్పటి నుంచి అన్నయ్య పైనే వళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తోంది.

లెటర్ సంగతి తెలియని అంకిత ని చూసినప్పుడల్లా అన్నయ తను ఆ లెటర్ చదివి ఉంటుందని మెలికలు తిరిగి పోతూ ఉంటాడు.

అన్నయ్యే లెటర్ ఇచ్చాడని అనుకున్న రంజిత అన్నయ్యని చూడగానే వయ్యారాలు పోతూ ఉండేది.

నాకు మాత్రమే తెలిసిన రహస్యం కావడం వల్ల వాళ్ళ రియాక్షన్స్ చూసి మనసులోనే ఆనందించేదాన్ని.

కానీ ఆ రోజు నేను ఆడిన నాటకం బయట పడే రోజు వచ్చింది

ఆ రోజు అంకిత నా కోసం మా ఇంటికి వచ్చింది. తను సన్నగా పొడవుగా నాజుగ్గా ఎంతో అందంగా ఉంటుంది. అందుకే అన్నయ్య పడిపోయాడు.

వాళ్ళేం మాట్లాడుకుంటారో విందామని నేను గోడచాటు గా గమనిస్తున్నాను.

తను రాగానే అన్నయ్య సిగ్గు పడిపోతూ

"చదివారా" అని అడిగాడు

ఎగ్జామ్స్ కాబట్టి చదువు గురించి అడుగుతున్నాడని అనుకుంది కాబోలు పాపం అంకిత "చదివాను" అని సిగ్గు పడుతూ సమాధానం ఇచ్చింది. మగవాళ్ళతో మాట్లాడడం అంకిత కి అలవాటు లేని కారణం గా వచ్చిన సిగ్గు ఇది.

"మరి మీ ఉద్దేశ్యం ఏంటి" అని అన్నయ్య మళ్ళీ అంకితను అడిగాడు

ఏం ఉద్దేశ్యం గురించి అడుగుతున్నాడో అంకిత కి అర్థం కాలేదు. ఒహో పరీక్షలలో పాస్ అవుతానా లేదా నని అడుగుతున్నాడు కాబోసు అని

"పాస్ అవ్వాలి" అని సమాధానం చెప్పింది

ఇదేంటి ఉద్దేశ్యం ఏంటి అంటే "పాస్ అవ్వాలి అని సమాధానం చెప్పిందేంటి" ఓహో ప్రేమలో పాస్ అవ్వాలి అని అర్థమా అనుకుని

"ఎలా" అని అన్నయ్య మళ్ళీ అడిగాడు

"బాగా అర్ధం చేసుకుని చదవాలి"

అర్ధం చేసుకుని చదవాలి అంటే మనసులని అర్ధం చేసుకుని ఒకరి కొకరు చదువుకోవాలి అని ఆహా ఎంత బాగా చెప్పింది అంకిత అని తనలో తనే మురిసిపోయాడు.

"మరి అర్ధం చేసుకుంటున్నారా" అన్న అన్నయ్య ప్రశ్నకు

"యా రోజూ అదే పనిలో ఉన్నాను" అని అంకిత సమాధానమిచ్చింది

'దొంగ, ఇన్నాళ్ళు దొంగ చాటుగా నా మనసుని అర్ధం చేసుకునే పనిలో ఉందన్నమాట . తనే సూపర్ ఫాస్ట్ గా ఉంది. నేనేమో ఒక లెటర్ ఇచ్చేసి ఊరుకున్నాను. ఆలస్యం చెయ్యకుండా నేను కూడా అర్ధం చేసుకోవడం ప్రారంభించాలి.'అని అనుకుని మనసులోనే ప్రణాళికలు వెయ్యడం ప్రారంభించాడు.

"మీరు అర్ధం చేసుకుంటున్నారు సరే మరి నేను కూడా అర్ధం చేసుకోవాలనుకుంటున్నాను" అని అంకిత తో అన్నయ్య అన్నాడు

"అయితే చేసుకోండి"

"మరి ఎలా అర్ధం చేసుకోవాలి, నాక్కొంచెం చెప్పరు"

"ఏముంది పదే పదే చదవండి. అర్ధం కాకపోతే ట్యూషన్ మాస్టర్ ని అడగండి"

"ఆఆఆ, మధ్యలో వీడెవడు"

"అదే నండి అర్ధం కాకపోతే అర్ధం అయ్యేటట్టు చెప్పటానికి మాస్టర్ ని అడగండి"

ఇదేంటి ఇలా మాట్లాడుతోంది అసలు ఇది మాట్లాడేది ప్రేమ గురించేనా అనుకుంటున్న సమయం లో ఎదురింటి రంజిత వచ్చింది.

ఈలోపు అంకిత "అనూ కి ఈ బుక్ ఇవ్వండి" అని వెళ్ళిపోయింది.

ఆ తరువాత రంజిత అన్నయ్యతో "అభి, నీకు నీలం రంగు ఇష్టమని ఇదిగో నీకోసమే ఈ చీర కట్టుకున్నాను అనేసరికి" అన్నయ్యకి విషయం అర్ధమయింది. నేను ఇంక ఒకటే నవ్వు. నా నవ్వుని గమనించి ఇదంతా నేను చేసిన పనే నని అన్నయ్య గ్రహించాడు.

మా అన్నయ్య నన్ను కోపం గా చూడడం ప్రారంభించాడు.

ఇక చూడండి నా పరిస్థితి ఇల్లంతా పరుగో పరుగు నేను మా అన్నయ్య చేతిలోని దెబ్బలు తప్పించుకునేందుకు.

ఎలాగైతేనేం నేనే అంకితతో అన్నయ్య విషయం చెప్పి వాళ్ళని ప్రేమికులుగా కలిపాను.

చదువైపోయాక అంకిత మా వదిన అయింది. మా అన్నయ్యకి ముంబై లో ఉద్యోగం వస్తే అక్కడే సెటిల్ అయ్యాడు.

మధ్య మధ్యలో ఎప్పుడు కలిసినా మేం ముగ్గురం ఈ విషయాన్ని తలచుకుని పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతాము.

నేను పై చదువుల కోసం అమెరికా కి వచ్చాను. ఇక్కడ కి వచ్చినప్పటి నుంచి మెకానికల్ లైఫ్. మన కోసం మనకి ఇచ్చుకోవడానికి కూడా సమయం ఉండదు.

కాలం తో పరుగులు పెడితే కానీ ఈ పోటీ ప్రపంచం లో నెగ్గుకు రాలేము.

ఇక్కడికి వచ్చాక నా హాబీస్ అన్ని రూఫ్ ఎక్కాయి.

మొత్తానికి ఎలాగో ఒకలా ఇవాళ్టికి నాకంటూ కొంత సమయం చిక్కింది. లేదు చిక్కించుకున్నాను.

రిలాక్స్ డ్ గా ఉంటుందని ఆన్ లైన్ రేడియో ని ఆన్ చేస్తే అలా అలా ఒక సరదా సంఘటనని జ్ఞప్తి కి తెచ్చింది. అందుకే నాకు ఈ పాటంటే చాలా ఇష్టం.

ఇంతలో ఎవరో బెల్ నొక్కినట్టు అనిపించింది. ఎదురుగా నా కలల రాకుమారుడిలా ఉన్న ఒక అబ్బాయి చేతిలో ఒక లెటర్ తో నిలబడి ఉన్నాడు. ఆ లెటర్ నాకోసమే అని నాకు అర్ధమయింది.

రేడియో లో ఇప్పుడు "మనసంతా నువ్వే" అన్న పాట వస్తోంది.

అందమైన బంధానికి సిద్ధం కమ్మని నా మనసు పలికింది.

***




నింగి నుండి చినుకు ఏదో వర్తమానం తీసుకువస్తున్నట్లు రాంబాబు మీద పడింది.

చినుకుని చంపేద్దామన్న కోపం వచ్చింది. ఏ ఆయుధంతో ఎలా చంపాలో అర్థం కాలేదు.

మనసుతో చంపాలనుకున్నాడు - ఎలా?

పట్టించుకోకపోతే చంపినట్టేగా -

వేగంగా బైట నుంచి ఇంట్లోకి నడిచాడు - తలుపు వేసేశాడు - కిటికీలు మూసేశాడు

బైట పెరుగుతున్న వాన శబ్దం వినిపించకుండా దేవుడి పటం దగ్గరున్న పత్తి తీసి చెవుల్లో పెట్టుకున్నాడు.

తల్లి, భార్య, పిల్లలు రాంబాబు ప్రవర్తనకి ఆశ్చర్యపోయినా, కాస్త భయపడి దగ్గరికి వచ్చే ధైర్యం చెయ్యలేకపోయారు.

రాంబాబు మెల్లగా వణుకుతున్నాడు - ఊహించని పరిణామానికి భయపడ్డ పసివాడిలా!!

తనకిప్పుడు ఏమీ వినిపించడం లేదు !

కళ్ళుమూసుకున్నాడు - చినుకుని చిత్ర వధ చెయ్యాలనుకున్న కక్ష మనసులో మరీ పెరిగిపోతోంది!

అప్పటికీ శత్రువు వచ్చినట్టు తలుపేసేశాడు.వినిపించుకోనట్టు పత్తి కుక్కాడు. చినుకు ఆచూకీ తెలిడానికి వీల్లేదు. దొంగ దెబ్బ తీసింది. జీవితాన్ని మార్చేసింది. ఈ చినుకు కోసమే తండ్రి ఎంతో తపన పడ్డాడు. తండ్రి గుర్తుకు వచ్చేసరికి మరీ పసివాడు అయిపోయాడు.

పచ్చటి పైరు లాగా ఉండేవాడు ... చినుకు కోసం బెంగ పెట్టుకుని ఎండిన చిడ లా అయిపోయాడు.

ఓ రోజు అడిగాడు , ఎలా అడగాలో తెలీక 'ఏంటి నాన్నా ఇది .....?' అని -

భూమిని, మనని   విడదీసుకుని బ్రతకలేమురా ..... అది పచ్చగా వుంటే పచ్చగా ఉంటాము... ఎండిపోతే ... తండ్రి గొంతు మూగబోయింది. ఊర్లో తండ్రే పెద్ద రైతు. పెద్ద మనిషి. అక్కడే పుట్టి అక్కడే పెరిగాడు. పట్టుదల మనిషి. అంతా భూమిని వదిలి వ్యాపారాల్లోకి వెళ్ళిపోతే, తను అక్కడే వున్నాడు. 'వానని కూడా శాసిస్తాడు' అని పేరు గడించాడు.

'పంట వేసుకోండి ... వాన అదే వస్తుంది .. ' ఖండితంగా చెప్పేస్తాడు.

ఈ సారి వాన రాలేదు. రాని సమాచారం కోసం ఎదురుచూస్తున్న వాడిలా ఆకాశం వైపు చూడటం - మేఘాల ఆచూకి కనపడక దిగాలు పడి, అంతలోనే ఏదో ధైర్యంతో 'వస్తుంది లే' అనడం - ప్రతీసారీ రావడం జరిగేది. ఈ సారి నమ్మక ద్రోహం చేస్తున్నట్టుంది. పక్కూరి సిద్ధాంతి గారిని అడిగాడు.

'వరుణ యాగం చెయ్యండి ..... వశీకరణం వేసినట్టు వాన పరిగెత్తుకు వస్తుంది .... ' అన్నారాయన.

యాగమంటే మాటలా?

ఆ సాయంత్రం ఎండ గాలి వంటిని తాకి ఎక్కిరిస్తున్నట్టు అనిపించింది. - ఆ వెక్కిరింపు తగ్గాలంటే యాగం చేయవలసిందే ....

డబ్బెలా ??

తన వంతుగా భార్య మెడలో ఉన్న వంటిపేట గొలుసుని 'సమిధ' గా ఇచ్చాడు. ఊరంతా తండ్రిని అనుసరించారు. యాగం జరిగింది. జరిగిన వెంటనే మేఘాలు నగలు దాచుకున్న దొంగల్లా చినుకులని బైట పెడతారనుకున్నారు -

'రాలేదు - '

తెల్లటి ఆకాశం వెక్కిరిస్తోంది.

సిద్ధాంతి గారిని అడిగితే -

'రావాలే ... ' నమ్మకంగానే చెప్పారు. వారం గడిచింది .... చినుకు లేదు. తప్పు చేసిన వాడిలా తండ్రి బాధ పడుతున్నాడు. అసలే ఆర్థిక పరిస్థితి బాగోకపోతే , ఈ ఖర్చు ఒకటి - ఊరి పెద్ద.      తప్పు తను చేస్తే సరిపోయేది ... అందరినీ నమ్మించాడు .

వాళ్ళెవరూ తనని అడగకపోయినా, తనలో తానే కుంగిపోయాడు. నిరాశ లో మునిగిపోయాడు. బెంగగా ఊరంతా తిరిగాడు. పొలంలోనే పడుకున్నాడు. మొక్కలని పలుకరించాడు. చెట్లని తడిమి తడిమి చూసుకున్నాడు.

ప్రొద్దుటే తండ్రి కోసం పొలం వచ్చిన రాంబాబుకి ఆకాశం వైపు ఆశగా చూస్తూ కనిపించాడు. దగ్గరకెళ్ళి "నాన్నా ..... " గట్టిగా అరిచాడు.

వానలో తడిసినంత చల్లబడిపోయింది తండ్రి శరీరం. ఊరంతా శోక సంద్రంలో మునిగిపోయింది.! ఋతువు మరో సంహారం చేసింది. కర్మ కాండకి డబ్బుల్లేవు. మళ్ళీ ఊరంతా ఏకమైనది.

".... మీ నాన్నకి ఈ ఊరంటే మమకారం ... ఎక్కడికి వెళ్ళినా ఈ ఊరి మీదే ధ్యాస వుంటుంది ... " ఊరంతా అదే మాట. పలకరింపులూ ... ఓదార్పులూ.

సాయంత్రమయ్యింది ... అలసట ని జ్ఞాపకాల తాకిడి జయించింది.

తండ్రి కళ్ళముందు !!

ప్రతిసారీ మాట నిలబెట్టిన చినుకు ఈసారి నమ్మక ద్రోహం చేసింది.

తండ్రి కూర్చునే గట్టు మీదే కూర్చున్నాడు. అప్పుడే పలకరించింది చినుకు - ఈ చినుకే 24 గంటల ముందు వచ్చి వుంటే తండ్రి దూరమయ్యేవాడు కాడు.... తల్లి పసుపు కుంకుమలు కొట్టుకుపోయేవి కావు ... తను ఒంటరి వాడు అయ్యేవాడు కాడు ...

బంధాలని, అనుబంధాలని దారుణంగా హత్య చేసి - ఇప్పుడు తేనె పూసిన కత్తిలా పలకరిస్తోంది చినుకు ... అందుకే దాన్ని చూడలేదు. వినలేదు. అలానే వెలివేస్తున్నట్టు ఉండిపోయాడు.!

అప్పుడే రెండు పసి చేతులు రాంబాబు మొహం తాకాయి. కళ్ళు తెరిచాడు ...

మూడేళ్ళ పాప _____

"వానొస్తోంది" .....

చూరు లోంచి కారుతున్న వాన వైపు చూపెట్టింది.

రాంబాబుకి విపరీతమయిన కోపం వచ్చింది. బందిపోటులా ఇంట్లోకి చొరబడుతున్న చినుకుని ఆపే ప్రయత్నం చేసాడు ....

కర్రలు, గుడ్డలు, గడ్డి పెట్టి ఆపాడు.

అతి కష్టం మీద ఆపాడు ... తను జయించాడు. !!

'నాన్నా .... అక్కడ .... పాప మరో వైపు చూపెట్టింది ... ' గోడ అంచు మీదనుంచి వాన కురుస్తోంది.

తండ్రి పంచె, చొక్కా కనిపించాయి .. తడిసిపోయాయి !

ఈ వానలోనే తడవాలని తండ్రి భగీరథ ప్రయత్నం చేసాడు. ఇప్పుడు ఆయన బట్టలు తడుస్తున్నాయి!

ఏడుస్తూ తండ్రి ఫోటో దగ్గరికి వెళ్ళాడు. ఎలాంటి పరిస్థితిలోనైనా పొలం నమ్ముకున్న తండ్రి గుర్తొచ్చాడు. ఆయన పట్టుదల గుర్తొచ్చింది.

'ఎక్కడున్నా ఊరిమీదే ధ్యాస .... ' ఊరోళ్ల మాటలు గుర్తొచ్చాయి.

" తాత అడిగిందే వస్తోందిగా .... మరెందుకు ఏడుస్తున్నావ్ " పాప అమాయకంగా అడిగింది. అవును ... తండ్రి కోరుకున్నదీ అదే.. అందుకే యాగం చేసాడు. యాగఫలం అందకపోతే స్వయంగా తనే వెళ్లి ఆ ఊరికి వరుణ యోగం పట్టించాడు. !!

ఋతువు తన తండ్రిని సంహరించలేదు ... తన తండ్రే రుతువుని దారిలో పెట్టి జయించాడు ... వాన కురిపించాడు.

ఆ ఊహ కలిగిన వెంటనే అప్పటిదాకా విషాదంలో కూరుకుని పోయున్న రాంబాబు వానలో గెంతుతూ ఆకాశంలో తండ్రిని పలకరిస్తున్నట్లుగా చేతులు ఊపుతూ చిందులు వేస్తున్నాడు.

అతనిని చూస్తూ ఆశ్చర్యపోతున్నారు ఇక్కడ వున్న ఊళ్ళో వాళ్ళు, కుటుంబ సభ్యులు, - పైన వున్న తండ్రి !!!